

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 28-9-2025 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 164 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి మ.2:27 తదుపరి సప్తమి, నక్షత్రం: జ్యేష్ఠ తె.3.55 తదుపరి మూల, వర్జ్యం: ఉ.7:22-9:10, దుర్ముహూర్తం: సా.4:27-5:15, అమృతఘడియలు: సా.6:05-7:52, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:08, సూర్యాస్తమయం: 6:02 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





చంద్రయ్య కుమారుడి 'ఉద్యోగ బిల్లు'కు వైసీపీ అడ్డు 15

విజయ్ సభలో పెను విషాదం


కరూర్‌లో విజయ్ ప్రచార సభలో జనసందోహం, ప్రమాద స్థలి నుంచి బాలికను తరలిస్తున్న దృశ్యం

కన్నీటి కరూర్

తొక్కిసలాటలో 38 మంది దుర్మరణం

- వందమందికి పైగా క్షతగాత్రులు.. పలువురి పరిస్థితి విషమం
- కరూర్‌లో టీవీకే ప్రచార సభ.. ఉదయం నుంచే జనం పడిగాపులు
- 4 గంటలు ఆలస్యంగా వచ్చిన విజయ్.. ఇరుకు రోడ్డులో కిక్కిరిసిన జనం
- సభ ముగియగానే అదుపు తప్పిన పరిస్థితి.. చెట్లపై నుంచి దూకిన జనం
- ఒకరిమీద ఒకరు పడి తొక్కిసలాట.. హుటాహుటిన కరూర్‌కు సీఎం స్టాలిన్
- హైకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ.. నా గుండె బద్దలైంది: విజయ్

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాట పెను విషాదం చోటుచేసుకుంది. ఒక రాజకీయ సభ... మృత్యు వేదికగా మారింది. తమిళ సినీ నటుడు, తమిళ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ శనివారం కరూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మరణ మృదంగం మోగింది. అసలే లెక్కకు మిక్కిలిగా జనం తరలి వచ్చారు. దారులు మొత్తం కిక్కిరిసిపోయాయి. పరిస్థితి అదుపు తప్పి... తొక్కిసలాటకు దారి తీసింది. అధికార వర్గాలు అందించిన సమాచారం ప్రకారం... ఈ విషాదంలో 38 మంది మరణించారు. వంద మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఏడుగురు పిల్లలు, 17 మంది వరకు మహిళలు ఉన్నారు. మరో 12మంది పరిస్థితి విషమంగా ఉందని... మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని తెలుస్తోంది. తమిళ నటుడు విజయ్ టీవీకే పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్రచారం

మిగతా 13వ పేజీలో...

చెప్పాం.. చేసి చూపిస్తున్నాం

- వచ్చే నెల 4న 'ఆటోడ్రైవర్ల సేవ'లో ఒక్కొక్కరికి రూ.15 వేల సాయం
- 2,90,234 మందికి రూ.435 కోట్లు
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన
- మహిళలకు ఉచిత ప్రయాణం, దీపం 2.0
- తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలు
- 4,71,574 మందికి ఉద్యోగావకాశాలు
- కూటమి కలయికతో ఇవన్నీ సాధ్యం
- ఎమ్మెల్యేలు కలసికట్టుగా పనిచేయాలి
- 2029 నాటికి ప్రతి ఒక్కరికీ ఇల్లు: సీఎం



అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 4వ తేదీన ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకం కింద 2,90,234 మంది డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున సాయం చేస్తామని తెలిపారు. ఏదైనా కారణాల వల్ల లబ్ధిదారుల జాబితాలో అర్హులైన వారి పేరు లేకపోతే, సమస్యను పరిష్కరించి జాబితాలో చేరుస్తామని

మిగతా 15వ పేజీలో...

విద్యుత్ చార్జీల్లో భారీ ఊరట!

- తొలిసారి తగ్గనున్న ట్రూఅప్ భారం.. 923 కోట్లు వినియోగదారులకు చెల్లింపు
- 2024-25లో వినియోగించిన యూనిట్‌కు 13 పైసలు చొప్పున వెనక్కి
- నవంబరు నుంచి వచ్చే ఏడాది అక్టోబరు వరకు నెలవారీ బిల్లుల్లో సర్దుబాటు
- విద్యుత్తు కొనుగోళ్ల ఖర్చులు తగ్గిన ఫలితం 14

ఇక నుంచి ట్రూడౌన్

- వైసీపీ హయాంలో అడ్డగోలుగా కొనుగోళ్లు
- వాటిని కట్టడి చేసిన కూటమి ప్రభుత్వం
- త్వరలో మరో 1059.75 కోట్లు ట్రూడౌన్



విద్యార్థులకు ఫీజుల ఉపశమనం

- 400 కోట్లు విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు
- 2023-24, 2024-25 ఫైనలియర్ విద్యార్థులకు త్వరలో చెల్లింపు 14

2027 డిసెంబరు నాటికి పోలవరం రెడీ!

- వచ్చే జూన్ నాటికి ప్రాజెక్టు పనులు ఓ కొలిక్కి 2
- సీఎం చంద్రబాబుకు జలవనరుల శాఖ నోట్

16న కర్నూలుకు ప్రధాని మోదీ!

- జీఎస్టీ సంస్కరణలపై రోడ్‌షోకు హాజరు
- చంద్రబాబు, పవన్‌తో కలిసి భారీ ర్యాలీ 14
- శ్రీశైల మల్లన్నను దర్శించుకోనున్న ప్రధాని


11

పారా ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో శీతల్‌కు స్వర్ణం

- వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో తెలుగు క్రీడాకారిణి దీప్తికి రజత పతకం



2027 డిసెంబరు నాటికి
పోలవరం రెడీ..!

- వచ్చే జూన్ నాటికి ప్రాజెక్టు పనులు ఓ కొలిక్కి
- సీఎం చంద్రబాబుకు జలవనరుల శాఖ నోట్

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు ఓ కొలిక్కి వస్తాయని, 2027 డిసెంబరు నాటికి ఈ ప్రాజెక్టును పూర్తిచేసి గోదావరి జలాలు విడుదల చేస్తామని జలవనరుల శాఖ ధీమా వ్యక్తం చేసింది. పోలవరం ప్రాజెక్టు పనులపై సమగ్ర సమాచారంతో కూడిన నోట్‌ను ఆ శాఖ.. సీఎం చంద్రబాబుకు అందజేసింది. 194.8 టీఎంసీల గోదావరి జలాల నిల్వ సామర్థ్యంతో, 7.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా.. పశ్చిమ గోదావరి జిల్లా రామయ్యపేట వద్ద నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పనులు ఓవరాల్‌గా 57.51 శాతం పూర్తయినట్టు ఆ నోట్‌లో వివరించింది. ఇందులో సివిల్ వర్క్స్ 86.10 శాతం.. భూసేకరణ, సహాయ పునరావాసం పనులు 25.50 శాతం వరకు పూర్తి చేసినట్టు వెల్లడించింది. ఇప్పటికే 80 టీఎంసీల గోదావరి జలాలను పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా నదిలోకి పంపిస్తున్నామంది. ప్రాజెక్టుకు సంబంధించి స్పిల్‌వే, 48 రేడియల్ గేట్ల బిగింపు, పవర్‌హౌస్ తవ్వకం, గ్యాప్-3 కాంక్రీట్ డ్యామ్ పనులు 100 శాతం పూర్తయ్యాయని చెప్పింది. స్పిల్ చానల్, అప్రోచ్ చానల్ పనులు 80 శాతం వరకు పూర్తయ్యాయని పేర్కొంది. ఇప్పటికే డయాఫ్రమ్‌వాల్ పూర్తయిందని, 2020 నాటి వరదలకు ఈ వాల్ దెబ్బతినడంతో సమాంతర గోడ నిర్మాణ పనులు సాగుతున్నాయని తెలిపింది. కొత్త డయాఫ్రమ్ వాల్ పనులు 55 శాతం పూర్తయ్యాయని పేర్కొంది. ఈ ఏడాది డిసెంబరు నాటికి ఈ పనులు పూర్తిచేస్తామంది. శాండ్ రీచ్ పూర్తయిందని, భూమి చదును పనులు జరుగుతున్నాయని, డీప్ సాయిల్ మిక్సింగ్ పనులు ప్రారంభించాల్సి ఉందని పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2024-25లో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ 5,052.71 కోట్లు విడుదలయ్యాయని తెలిపింది. ప్రాజెక్టు కోసం ఈ ఏడాది ఆగస్టు వరకు రూ.24,824 కోట్లు ఖర్చయ్యాయని తెలిపింది.

తీరం దాటిన వాయుగుండం

- 1న మరో అల్పపీడనం..
- కృష్ణా, గోదావరికి పెరిగిన వరద
- మొదటి హెచ్చరిక జారీ.. ఏలూరు జిల్లాలో 23 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శనివారం తెల్లవారుజామున ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపాన తీరం దాటింది. అనంతరం పశ్చిమంగా పయనించి మధ్యాహ్నానికి ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో కేంద్రీకృతమై ఉంది. ఇది ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వైపు పయనించి ఆదివారం ఉదయానికి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడనుంది. ఆ తర్వాత పశ్చిమంగా పయనించి గుజరాత్‌కు ఆనుకుని అరేబియా సముద్రంలోకి ప్రవేశించనుంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. కోస్తా వెంబడి బలంగా గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం సూచించింది. కాగా, ఈనెల 30వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఆవరించనుంది. దాని ప్రభావంతో వచ్చే నెల ఒకటో తేదీన ఉత్తర, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహం ఉధృతంగా ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 3.83 లక్షల క్యూసెక్కులు ఉండటంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తున్నట్లు తెలిపింది. అలాగే, భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరిక(43 అడుగులు) దాటి 44.5 అడుగులకు చేరింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 10.14 లక్షల క్యూసెక్కులు ఉందని, ఇది ఆదివారానికి 11-12 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. వరద ప్రభావిత జిల్లాల యంత్రాంగం అందుబాటులో ఉండి, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించింది. ఆదివారం ఉత్తరాంధ్ర, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

అనూహ్యంగా పెరిగిన గోదావరి వరద

గోదావరిలో శనివారం నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 10,13,149 క్యూసెక్కుల వరద జలాలను 48 గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం స్పిల్‌వే ఎగువన నీటిమట్టం 32.730 మీటర్లు, దిగువన 24.6100 మీటర్లు నమోదైంది. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరు గండి పోశమ్మ ఆలయం, టూరిజం బోట్ పాయింట్లు నీటమునిగాయి. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో పలు రోడ్లు నీట మునడంతో 23 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మండలంలో 200 ఎకరాల్లో మిరప పంట నీటమునిగింది. కుక్కునూరు మండలంలో కుక్కునూరు-దాచారం దారిలో వరద ఉధృతంగా ఉంది.



చాదర్‌ఘాట్ మూసానగర్‌లో నడుంలోతు నీళ్లలో..



అంబర్‌పేటలో బాధితులను బోటులో తరలిస్తున్న సిబ్బంది



నీట మునిగిన ఎంజీబీఎస్ నుంచి ప్రయాణికులను తరలిస్తూ..

కన్ను 'మూసి' తెరిచేలోగా..

- చాదర్‌ఘాట్ కాజ్‌వే బ్రిడ్జిపై నుంచి 6 అడుగుల ఎత్తులో వరద
- మూసారంబాగ్ బ్రిడ్జిపై నుంచి 10 అడుగుల ఎత్తులో ప్రవాహం
- జలదిగ్బంధంలో ఎంజీబీఎస్.. బస్‌స్టేషన్ తాత్కాలికంగా బంద్
- హైదరాబాద్‌లో మూసీ నది విశ్వరూపం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మూసీ నది మహోగ్రంగా ఉప్పొంగింది. ఎక్కడికక్కడ రోడ్లను ముంచెత్తి నదిలో కలిపేసుకుంది. కొన్ని ముందుకు కదలక మొరాయించిన బస్సులు ఆ వరదలో నిండా మునిగాయి. గంధంగూడ నుంచి నాగోలు దాకా గట్టున, ఆ సమీపంలో ఉన్న వేల సంఖ్యలో ఇళ్లనూ వరద ముంచెత్తింది. వరదపోటుకు ఎంజీబీఎస్ నిండా మునిగింది. లంగర్‌హౌస్ వద్ద బాపూఘాట్ వంతెనను తాకుతున్నట్లుగా ప్రవహిస్తూ భయపెట్టిన మూసీ.. చాదర్‌ఘాట్‌లోని కాజ్‌వే బ్రిడ్జ్‌పై నుంచి 6 అడుగుల ఎత్తులో.. మూసారంబాగ్ వంతెనపై నుంచి 10 అడుగుల ఎత్తులో పోటెత్తుతూ గజగజా వణికిస్తోంది. ఆ వరద తీవ్రతకు తీరానికి అనుకొని ఉన్న ఇళ్లలోని జనానికి తేరుకునే సమయమే లేకపోయింది. గత కొన్ని దశాబ్దాల్లో కనీవినీ ఎరుగని రీతిలో మూసీ మహోగ్రరూపమిది. వికారాబాద్, తాండూరులో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి 30వేల క్యూసెక్కుల నీరు వదులుతుండటంతో శుక్రవారం సాయంత్రం మొదలైన మూసీ వరద శనివారానికి మహోగ్రరూపం దాల్చింది. ఒకరంగా 1908 నాటి ప్రళయాన్ని గుర్తుకు తెచ్చింది. హైడ్రా, జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలు హుటాహుటిన చాదర్‌ఘాట్, మూసానగర్ ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాయి. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామని బాధితులు కన్నీళ్లు పెట్టుకున్నారు. చాదర్‌ఘాట్, మూసారంబాగ్ వంతెనలపై రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్లలో చిక్కుకుపోయిన వారికి డ్రోన్ ద్వారా ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఎంజీబీఎస్ బస్‌స్టేషన్‌ను ఎన్నడులేని విధంగా మూసీ వరద ముంచేసింది. నీటి ఉధృతి పెరగడంతో ఎంజీబీఎస్ నుంచి బస్సుల రాకపోకలు ఆర్టీసీ తాత్కాలికంగా నిలిపివేసింది. బస్‌స్టేషన్‌లోని ప్రయాణికులను తాళ్లసాయంతో బయటకు తీసుకొచ్చారు. సూర్యాపేట, నల్లగొండ, విజయవాడ వైపు వెళ్లే బస్సులను ఎల్బీనగర్ నుంచి నడుపుతున్నారు. మహబూబ్‌నగర్, కర్నూలు, బెంగళూరు వైపునకు వెళ్లే సర్వీసులు ఆరాంఘర్ నుంచి నడుపుతున్నారు.

దసరా శుభాకాంక్షలు

అమ్మల గన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాల పెద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి బుచ్చినయమ్మ, దన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గమాయమ్మ కృతాబ్ధి ఇచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్

దసరా శుభాకాంక్షలు

LED TV's, Air Conditioners లపై తగ్గించిన 18% GST తో కొనుగోలుచేయండి,

దానిపైన దసరా ప్రత్యేక తగ్గింపు

సోనోవిజన్ దసరా సేల్

6% పైన అదనపు డిస్కౌంట్ లభించే స్క్రాచ్ కార్డ్ స్కీమ్

ప్రతి ₹ 2000/- కొనుగోలుతో స్క్రాచ్ కార్డ్ పొందండి

₹100/- నుండి ₹1,00,000/- వరకు తక్షణ నగదు బహుమతి అందుకోండి.

(సెలెక్టెడ్ మోడల్స్ పై)

స్క్రాచ్ కార్డ్ పెద్ద మొత్తంలో గెలుచుకొన్న కొనుగోలుదారులు, అందరికి అభినందనలు

రూ. 1,00,000/- విజేత



శ్రీ పన్నాల అనిరుధ్ గారు
బొటానికల్ గార్డెన్, హైదరాబాద్.
7674076393

రూ. 1,00,000/- విజేత



శ్రీ మణి కుమార్ గారు
దేవినగర్, విజయవాడ.
8008109777

రూ. 1,00,000/- విజేత



శ్రీ బి. బాల వెంకటేశ్వర గారు
మాధవధార, విశాఖపట్నం
8885334220

రూ. 1,00,000/- విజేత



శ్రీమతి యం. కృష్ణ వేణి గారు
ఆర్.ఆర్.అప్పారావు స్ట్రీట్, విజయవాడ
9618209926

రూ. 1,00,000/- విజేత



శ్రీమతి పి. కృష్ణ కుమారి గారు
స్నేహపురి కాలని, గాజువాక
8985077199

రూ. 1,00,000/- విజేత



శ్రీ ఆర్. సంతోష్ శివకుమార్ గారు
సాగర్ నగర్, విశాఖపట్నం.
6302643557

రూ. 1,00,000/- విజేత



శ్రీ నక్కా గిరిబాబు గారు
బుచ్చయ్య నగర్, రాజమండ్రి
9347308113

రూ. 1,00,000/- విజేత



శ్రీ పి. శ్రీనివాస్ గారు
సీతమ్మధార, విశాఖపట్నం.
9177701617

రూ. 1,00,000/- విజేత



శ్రీమతి యన్. సింధుచౌదరి గారు
నెహ్రూ నగర్, ఖమ్మం.
7799756667

రూ. 1,00,000/- విజేత



శ్రీమతి ఎ. హేమలత గారు
కింగ్స్ కోర్ట్, నెల్లూరు.
9849072387

రూ. 50,000/- విజేత



శ్రీ బి. దీపక్ గారు
కొయ్యన్‌పేట, విజయనగరం.
9666191965

రూ. 50,000/- విజేత



శ్రీ హర్ష రామినేని గారు
క్రాంతినగర్, జీవకోన, తిరుపతి.
8099084808

రూ. 50,000/- విజేత



శ్రీమతి యం. హేమ గారు
బైపాస్ రోడ్, మంగళగిరి.
8885343511

రూ. 50,000/- విజేత



శ్రీ జి. విజయ్ కుమార్ గారు
కూకట్‌పల్లి, హైదరాబాద్.
9885000727

రూ. 50,000/- విజేత



శ్రీ వి. విట్టల్ గారు
బంస్‌వాడ, నిజామాబాద్.
7661803318

రూ. 50,000/- విజేత



శ్రీ యం. వెంకటేశ్వరరావు గారు
చినపరిమి, తెనాలి
8019999059


LG

Life's Good.

Celebrate Festivities with Reduced Prices

GST

28% >>> 18%*



Festive Offers*

- 3 YEAR WARRANTY (On Select LG TVs)
- Up to 26%* CASHBACK Max ₹26000 ON SELECT CREDIT / DEBIT CARDS
- Up to 30% OFF ON LG SOUNDBAR (With Select 4K TVs)
- FIXED EMI Starting from ₹2999*
- LG BEST Care Ask for AMC Starting from ₹18 per day*

Powered by Microsoft Copilot | α11 4K AI Processor Gen2 | AI Voice ID Chatbot | Dolby VISION·ATMOS | webOS Re:New Program

LG BEST Care | LG 24 x 7 CUSTOMER CARE | 08069379999 | www.lg.com/in/support

LG WhatsApp No. 9711709999

LG Service India Mobile App Available at Google Play

www.facebook.com/lgindiapage/

www.x.com/lgIndia

To know more about LG, visit www.lg.com/in

For Corporate/Institutional enquiries, please write to corp.enquiries@lge.com

Scan to know more about LG AI TV

Regd. Office: LG Electronics India Limited, A-24/6, Mohan Cooperative Industrial Estate, Mathura Road, New Delhi-110044 CIN No. U32107DL1997PLC220109

అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్

మా నూతన ప్రారంభమైన షోరూంల కు ఆహ్వానం

చాకలి బజార్ మెయిన్ రోడ్, ఎనికేపాడు, విజయవాడ. 8712416250, 51, 52.

దుర్గా ప్లాజా, రిలయన్స్ డిజిటల్ ఎదురు, యం.జి. రోడ్, పటమట, విజయవాడ. - 8712417841

విజయవాడ, విజయప్లాజా, ఏలూరు రోడ్, విజయవాడ 9154281648, 649, 650.	విజయవాడ, ఏలూరు రోడ్, రామమందిరం దగ్గర. 9440804182, 9246666202	విజయవాడ, ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట. 9246666664, 9100991701, 9440804184	విజయవాడ, యం.జి.రోడ్, ఆల్ ఇండియా రేడియో ఎదురు. 9246666203, 9154281640

విజయవాడ, పటమట, మోహన్‌దాస్ థియేటర్ దగ్గర. 9246661616, 9100991702	విజయవాడ, కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్ 9440804183, 9246666209	గొల్లపూడి, ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్. 8333924930, 9154281628	విజయవాడ, కానూరు, యం.జి.రోడ్. 8712600536, 8712600537,	శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్డు, విజయవాడ. 8712600531, 32, 33

మెయిన్ రోడ్డు, చికిత్స హాస్పిటల్ దగ్గర, పాయకాపురం. విజయవాడ. ఫోన్ : 8712648704, 05, 06.	ఎనికేపాడు - 1, ఏలూరు రోడ్, విజయవాడ. 9100991703, 9154281626	పోరంకి, మెయిన్ రోడ్ సెంటర్. 9154281645, 46, 47	కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368	గుడివాడ, ఏలూరు రోడ్. 9154281178, 79	మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు. 7331149379, 80, 81

కాకతీయులపై కొత్త వెలుగులు

కోదాడలోని ముస్లిం శ్మశానవాటికలో లభించిన తొమ్మిది గుత్తుల రాగి పలకల మీద రాసివున్న శాసనాల ఆధారంగా కాకతీయ వంశావళిని తిరగ రాయాల్సిన అవసరం ఉంది. ఆ శాసనప్రతులింకా వెల్లడి కాలేదు కానీ, వాటిలోని విశేషాలను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారాను, గత నెల 27న జూమ్ మీటింగులో ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారాను మైసూరులోని ఏఎస్ఐ శాసనాధ్యయన శాఖ డైరెక్టరు కె.మునిరత్నంరెడ్డి వెల్లడించారు. వాటి ద్వారా తెలిసిన శాసనాంశాలను యథార్థమని అంగీకరిస్తే... కాకతీయుల వంశావళిని తిరిగి రాయవలసి వస్తుంది.

కోదాడ మొదటి రాగిశాసనంలో పేర్కొన్నట్టుగా విగ్రహవెట్టి, సకలశ్రీ, గుండ-1, ఎర్ర, అతని కుమారులు గుండ-2, బేతియ, గోనకలు- ఇది తొలి కాకతీయుల వరుస. తర్వాత కాకతీయ వంశక్రమం కాకర్త్య గుండన నుంచి మారలేదు ఇప్పటివరకు. కోదాడ తొలి రాగిశాసనం 'విగ్రహవెట్టి' అని పేర్కొంటే, మాంగల్లు శాసనం 'సామంతవొద్ది సంజ్ఞామ్' అంటున్నది. 'సామంతవిష్టి' అని 2వ బేత(1090) కాజీపేట దర్గా శాసనం కూడా చెప్తున్నది. వెట్టి, వొద్ది, విష్టి సమానార్థకాలు. విష్టి (వెట్టి) వంశం కాదు, అదొక అధికార పదవి. విష్టి అనే పదం రాష్ట్రకూట రాజప్రతినిధి 'శంకరగండరస'కు కూడా ఉంది. వెట్టి చేయించే అధికారులే సామంతవెట్టి.

విష్టి పన్ను వసూలు చేసే రాష్ట్రకూట పాలనా యంత్రాంగం ఉన్నతాధికారులు తమ కుటుంబాలను 'విష్టి' పేరుతో పిల్చుకున్నారు. (ఐఏపీ, వరంగల్: ఆకునూరు శాసనంలో విట్టి నారాయణ, 38) 'విష్టి' విధానం వాకాటక, రాష్ట్రకూట, చాళుక్య శాసనాల ద్వారా తెలుస్తున్నది. ఒకప్పుడు రాజులకు మాత్రమే 'విష్టి' చేయించే అధికారం కాలక్రమేణా సామంతులు, అధికారులు, భూస్వాములు, మంత్రులకు లభించింది.



కాకర్తి గ్రామ నామం 2, 3వ కోదాడ రాగిశాసనాల్లో పేర్కొన్నారు. ఆ గ్రామంలో సకలశ్రీ పేరు మీద సకలేశ్వరాలయం, గుండ-1 పేరు మీద గుండేశ్వర భట్టారకాలయం నిర్మితమైనట్టు ఆ శాసనాల వల్ల తెలుస్తున్నది. కాకర్తి ఎక్కడుందో తేలలేదు. మునిరత్నం జూమ్ మీటింగు వల్ల తెలిసిన వివరాలను బట్టి కోదాడ రాగి శాసనాల్లో పేర్కొన్న దానగ్రామాలు 12 (+4 మధిర గ్రామాలు), వాటి సరిహద్దు గ్రామాలు 77. ఇవి ఎక్కడున్నాయో వెతికిపట్టుకుంటే కొండపల్లి విషయంలో ఏయే గ్రామాలెక్కడున్నాయో తెలుస్తుంది. కొత్త తెలంగాణ చరిత్రబృందం పరిశీలనలో కొన్ని సరిహద్దు గ్రామాలు యాతవాకిళ్ల, ఘట్టికల్లు, కుడకుడ, లోచెరువులు, మూసీనది సూర్యాపేట జిల్లాలోనూ, అలాగే పాలేరు, జువ్విపాడు (జూపెడ) ఖమ్మం జిల్లాలో ఉన్నట్లు తెలిసింది. మిగతా గ్రామాలు ఈ పరిసరాల్లోనే గుర్తించే అవకాశముంది.

ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర-సంస్కృతి సంపుటాలలో 'మధ్యయుగ ఆంధ్రదేశం' (క్రీ.శ. 1000-1324) సంపుటి, పే.108లో నల్గొండ జిల్లా 2వ శాసన సంపుటి, శా.సం.25 క్రీ.శ. 1149నాటి శాసనంలో ఉన్న కొండపల్లి నాడు నేల కొండపల్లి మండలం కూడి ఉన్నటువంటిది. ఈ విభాగం కందూరుచోడుల సిరికొండ రాజ్యంలో భాగంగా ఉండేదని తెలుస్తోంది. అంటే ఈ కొండపల్లి విజయవాడ సమీపంలోని కొండపల్లి కోట కాదనేది విస్పష్టం. కాకతీయుల తొలి నివాసం తెలంగాణలోనే ఉందని చెప్పవచ్చు. కాకతీయుల శాసనాలన్నింటిలోను పేర్కొన్న కాకతిపురం హన్మకొండనే... అందులో విభేదమవసరం లేదు. తొలినాళ్ళ కాకర్తి ఏదన్నది వెతికితే సరిపోతుంది.

పోతే దుర్జయుడు కాకతీయుల మూలపురుషుడా? దుర్జయుడనే పురాణ పురుషుడు భాగవత పురాణాన్ని బట్టి మాంధాత కుడితొడ నుంచి పుట్టినవాడు. దుర్జయ నామం వంశమూలకంగా చెప్పుకుంటున్నవారు అతని వంశపారంపర్యంగా వచ్చిన పాలకులు కాదు. దుర్జయుడు తీరాంధ్రప్రాంతాల పాలకులందరికీ వంశకర్తగా చెప్పుకున్న శాసనాలెన్నో ఉన్నాయి. ఏ దుర్జయుడు? 2వ బేతరాజుకు శైవదీక్షనిచ్చిన గురువులు రాసిన శాసనంలో 'దుర్జయ' నామం వచ్చింది. రెండవసారి మైలమ గురువు ధర్మశంభు రాయించిన బయ్యారం శాసనంలో మళ్ళీ 'దుర్జయ' నామం కనిపించింది. కొలనుపాక శాసనంలో ఇంకొకసారి దుర్జయుని పేరొస్తుంది. మధ్యలో ఎవరి శాసనాల్లోనూ దుర్జయవంశం అని చెప్పుకున్న దాఖలాలు లేవు. దుర్జయుని పేరు కాకతీయులకున్న ప్రశస్తుల్లో అతిశయంగా చెప్పబడ్డదే తప్ప నిజంగా వంశం పేరు కాదనిపిస్తున్నది.

వెన్ననృపుడని చెప్పింది బయ్యారం శాసనం. అది వేయించింది మైలమాంబ. అంతకు ముందు శాసనాలలో వెన్నరాజు పేరెందుకు లేదు? గూడూరు శాసనంలో 'బొఱంటి వెన్నడను సంభవుడయ్యె' అని ఉంది. అతనిని ఎర్ర భూపతి కొడుకుగా పేర్కొన్నారు. ఆధార శాసనాలేవీ అంతకుముందు బయటపడలేదు. ఇప్పుడు కోదాడ శాసనాలు పేర్కొన్న విగ్రహవెట్టే వెన్నడుగా చెప్పబడ్డాడేమో. అయితే అతని కొడుకు ఎర్ర కాదు సకలశ్రీ, అతని కొడుకు 1వ గుండ అని కొత్త శాసనాలు వెల్లడిస్తున్నాయి.

ఊహలెపుడు చరిత్రను నిర్మించలేవు. తేల్చిన ఆధారాలతోనే చరిత్ర మళ్ళీ రాసుకోవాలి. తామెపుడో చెప్పిన సంగతులకే విధేయంగా ఉండనవసరం లేదు. కొత్త చరిత్ర తెలిసినపుడు పాత చరిత్రను తిరిగి రాసుకోవడం చరిత్రకారుల కనీస బాధ్యత.

○ శ్రీరామోజు హరగోపాల్
కన్వీనర్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం

మహిళలతోనే పుస్తకాల భవితవ్యం

అమెరికా రచయిత, ప్రజావక్త, తాత్విక యాత్రికుడు ఎరిక్ వీనర్ 2007లో 'పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఎందుకు చదువుతారు?' (వై ఉమెన్ రీడ్ మోర్ దేన్ మెన్) అనే వ్యాసం రాశారు. 'రెండు సంవత్సరాల క్రితం విఖ్యాత బ్రిటిష్ నవలా రచయిత ఇయాన్ మెక్‌ఈవాన్ ఒక ప్రయోగాన్ని నిర్వహించారు. ఒక మధ్యాహ్నం ఇయాన్, ఆయన కుమారుడు లండన్‌లోని ఒక పార్క్‌లో పిచ్చాపాటీలో ఉన్న జనాల మధ్యకు వెళ్లి పుస్తకాలు ఉచితంగా ఇవ్వడం ప్రారంభించారు. కొద్ది నిమిషాలలోనే తండ్రీ కొడుకులు 30కి పైగా నవలలు ఉచితంగా ఇచ్చివేశారు. తీసుకున్నవారు దాదాపుగా అందరూ మహిళలే. వారందరూ ఎంతో ఉత్సుకతతో ఆ కానుకలు అందుకున్నారు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే పురుషులు మాత్రం ఈ పుస్తక దానంపై కనుబొమలు ముడిచారు. దాతల ఉద్దేశాన్ని సంశయించారు. పుస్తక పఠనంపై అయిష్టతను చాటుకున్నారు' అని వీనర్ ఆ వ్యాసంలో రాశారు. ఆ ప్రయోగానుభవంతో 'మహిళలు చదవడం మానివేసినప్పుడు నవలా రచన అంతమవుతుంది' అనే ఒక అభిప్రాయానికి ఇయాన్ వచ్చారని వీనర్ ముక్తాయించారు. మరి, మహిళలు విశేష చదువరులు అయినా సాహిత్య స్రష్టలయిన విద్యావతుల గురించి మనం మాట్లాడుకోవలసినంతగా ఎందుకు మాట్లాడుకోవడం లేదు?

ఈ ఏడాది కొంతమంది భారతీయ రచయిత్రులకు ప్రపంచ సాహిత్య జగత్తులో విశేష గౌరవాదరాలు లభిస్తున్నాయి. బాను ముస్తాక్ కథా సంకలనం 'హార్ట్ ల్యాంప్'కు అంతర్జాతీయ బుకర్ పురస్కారం లభించింది. దక్షిణ భారతీయ రచయిత్రి ఒకరికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం ఇదే మొదటిసారి. కర్ణాటకలో ముస్లిం మహిళల జీవితాల గురించి కన్నడ భాషలో బాను ముస్తాక్ ప్రతిభావంతంగా రాసిన కథలను అంతే ప్రతిభావంతంగా దీపా భస్తీ ఆంగ్లంలోకి అనువదించారు. బుకర్‌తో లభించిన విశేష గౌరవాదరాలకు రచయిత్రి, ఆమె అనువాదకురాలు పూర్తిగా అర్హులే. వర్తమాన భారతీయ సాహిత్యచరిత్రలో బాను, దీపా కలిసికట్టుగా అంతర్భాగమయ్యారు.

రెండు దశాబ్దాల క్రితమే తన నవల 'The Inheritance of Loss'కు బుకర్ పురస్కారాన్ని పొందిన మరో భారతీయ రచయిత్రి కిరణ్ దేశాయి. ప్రస్తుతం అమెరికాలోని న్యూయార్క్‌లో నివసిస్తున్నారు. ఆమె కొత్త నవల 'The Loneliness of Sonia and Sunny' ఈ ఏడాది బుకర్ పురస్కారానికి అత్యంత అర్హమైన నవలల్లో ఒకటిగా ఉన్నది. ఈ నవలా రచనకు ఆమె రెండు దశాబ్దాల సుదీర్ఘకాలాన్ని తీసుకున్నారు. 'ఏ క్రమశిక్షణతో మీరు ఇరవై సంవత్సరాల పాటు ఈ నవలా రచనలో నిమగ్నమయ్యారు?' అని ఆమెను ప్రశ్నించాను. 'ఇన్ని సంవత్సరాల సృజనాత్మక కృషి మూలంగా నాలో ప్రగాఢంగా అంతస్థగితమైన క్రమశిక్షణనే నేను అనుసరించాను. ప్రతి ఉదయం నేను నేరుగా రచనా వ్యాసంగంలో నిమగ్నమవుతాను. నాకు అదొక ఆధ్యాత్మిక క్రమశిక్షణ. మరింత నిష్ఠగా, మరింత మెరుగ్గా నా సృజనాత్మక కృషికి అది తోడ్పడుతుంది. ప్రతి రోజూ నేను ఒక చీమగా, ఒక తేనెటీగగా, ఒక వానపాముగా పనిచేస్తాను. వాస్తవ జీవితానుభవాలు కళాత్మక జగత్తులోకి పరివర్తనమవుతుంటాయి...'. కిరణ్ దేశాయి తల్లి



ప్రముఖ రచయిత్రి అనితా దేశాయి తాజా నవల 'రోసారిటా' విశేష ఆదరణ పొందుతోంది. తల్లీకూతుళ్ల మధ్య సంబంధాలు, జ్ఞాపకాలు, ఒంటరితనం మొదలైన విషయాలతో ఆసక్తికరంగా చదివించే ఈ నవల గత ఏడాది ప్రచురితమయింది. స్వేచ్ఛ, కళాత్మక జీవితం అన్వేషణలో భారత్ నుంచి మెక్సికోకు వెళ్లిన ఒక మహిళ గాథే 'రోసారిటా'. ఎనిమిదిన్నర దశాబ్దాల పైబడిన వయసులో అనితా దేశాయి సాహిత్య సృజన నుంచి మనమందరమూ స్ఫూర్తి పొందాలి.

బుకర్ పురస్కార గ్రహీతల గురించి మాట్లాడుకుంటున్నప్పుడు మనం తప్పనిసరిగా అరుంధతీరాయ్ గురించి ప్రస్తావించుకోవాలి. బుకర్ పురస్కారాన్ని పొందిన ప్రప్రథమ భారతీయ రచయిత్రి ఆమె. 1997లో ఆమె మొదటి నవల 'ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'కు బుకర్ ప్రైజ్ లభించింది. ఆమె ఇటీవలి పుస్తకం 'మదర్ మేరీ కమ్స్ టు మి' తల్లి మేరీ రాయ్ గురించిన జ్ఞాపకాల సముచ్ఛయం. తన అసాధారణ బాల్యం గురించి అరుంధతి కథనం పాఠకులను ఏకాగ్ర చిత్తంతో చదివిస్తుంది. బహుశా అది ఒక రచయితను సృష్టించడం గురించి కూడా కావచ్చు. అరుంధతి ఇలా రాశారు: 'జీవితంలో చాలా ముఖ్యమైన విషయాలు అయిన లక్ష్యాలు, సంకల్పాలు, కుటుంబ సంబంధాలు, స్నేహితులు, శారీరక, మానసిక ఆరోగ్యం, మనశ్శాంతి మొదలైన వాటికి నా జీవితం ఒక పాదసూచిక మాత్రమేనని భావిస్తున్నాను. నా జీవితం ఎప్పుడూ విషాదమయంగా గడవలేదు. తరచు ఉల్లాసకరంగా సాగింది. బహుశా ఇది నాకు నేను చెప్పుకున్న అబద్ధమూ కావచ్చు.

పవనాలు బలంగా వస్తున్న చోట నా గుడారాన్ని వేసుకున్నాను. ఆ పవనాలు నా హృదయాన్ని నా శరీరం నుంచి నిర్మలం చేస్తాయని ఆశించాను. బహుశా నేను రాయదలుచుకున్నది జీవన ప్రస్థానంలో నాలో రూపొందిన వ్యక్తి నా యువ ఆత్మకు నమ్మక ద్రోహం గురించి.. అదే జరిగివుంటే అదేమీ చిన్న పాపం కాదు. అయితే దాని మంచి చెడ్డల గురించి ఒక నిశ్చిత అభిప్రాయాన్ని వ్యక్తం చేయగల స్థితిలో నేను లేను'.

నేను ఇంతవరకు సాహిత్య సృజన చేస్తున్న మహిళల గురించి ప్రస్తావించాను (ఈ రచయిత్రులు ఇప్పటికే సుప్రసిద్ధులని, వారి గురించి రాయనవసరం లేదని నా స్నేహితుడు ఒకరు వాదించారు. అయితే నేను అతనితో ఏకీభవించలేదు. సాహిత్య రచనలు చేసేవారి గురించి పదేపదే మాట్లాడుకోవల్సి ఉందని నేను విశ్వసిస్తున్నాను). రచయిత్రుల గురించి మాట్లాడుకుంటున్నప్పుడు

> పుస్తక పఠనం, పుస్తక రచన, పుస్తకాల సృష్టి భవిష్యత్తు మహిళలేనా? వారే అయిన పక్షంలో నేను ఒక విషయాన్ని దృఢ విశ్వాసంతో చెప్పగలను: మన జీవితాలను ఆక్రమించుకుంటున్న కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను పుస్తకాలు జయించి చిరకాలం మన భావజగత్తును అలరిస్తాయి.

పుస్తకాలను పాఠకుల వద్దకు తీసుకువెళుతున్న మహిళల గురించి కూడా ప్రస్తావించుకోవడం సముచితంగా ఉంటుంది. దేశవ్యాప్తంగా అనేక నగరాలు, పట్టణాలలో మహిళలు ప్రారంభిస్తున్న స్వతంత్ర పుస్తక దుకాణాలు, గ్రంథాలయాల సంఖ్య పెరిగిపోతోందని నా స్నేహితులు చెప్పారు. ఈ మహిళల లక్ష్యం ఏమిటి? పుస్తకపఠనంపై ఆసక్తి చూపే విద్యావంతులు అందరికీ పుస్తకాలు అందుబాటులో ఉంచడమే వారి ధ్యేయం. ఆన్‌లైన్ కొనుగోళ్ల విషయం ఎలా ఉన్నప్పటికీ వివిధ నగరాలలో చాలా మంది మహిళలు పుస్తకాల కొనుగోలుదారులు, పాఠకులతో సంభాషిస్తూ పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తున్నారు. యువజనులు, వృద్ధులకు కొత్త పుస్తకాలు అందిస్తున్నారు. సృజనాత్మక ఇంద్రజాలంతో సమ్మోగ్గం చేసే పుస్తకాలకు ప్రాచుర్యం కల్పిస్తున్నారు. పుస్తక పఠనం, పుస్తక రచన, పుస్తకాల సృష్టి భవితవ్యం మహిళలేనా? నాకు తెలియదు. వారే అయినపక్షంలో ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలి కుమారుడిగా, మహా చదువరి అయిన ఒక మహిళ భర్తగా నేను ఒక విషయాన్ని దృఢ విశ్వాసంతో చెప్పగలను: మన జీవితాలను ఆక్రమించుకుంటున్న కృత్రిమ మేధ (ఏఐ)ను పుస్తకాలు జయించి చిరకాలం మన భావజగత్తును అలరిస్తాయి.

◆ డెరెక్ ఓబ్రియన్
పార్లమెంటు సభ్యుడు (టీఎంసీ)
(ఇండియన్ ఎక్స్‌ప్రెస్)

మూసీ వరదల సృష్టే హైదరాబాద్

హైదరాబాద్ నగర నిర్మాణానికి ప్రధాన కారణం దాని నిర్మాత ముహమ్మద్ కులీ కుతుబ్‌షాకు తన ప్రియురాలు భాగమతిపై ఉన్న ప్రేమ అనుకుంటారు చాలామంది. కానీ అసలు కారణం వర్షాలు-వరదలు, వాటి వల్ల పేట్రేగిన ప్లేగు మహమ్మారి బారి నుంచి తన ప్రజలను రక్షించుకోవాలనే రాజకాంక్ష. ప్రస్తుతం మూసీ నది మహానగరాన్ని ముంచెత్తుతున్న నేపథ్యంలో ఒకసారి గతాన్ని గుర్తుచేసుకుందాం.

హైదరాబాద్ నగర నిర్మాణ చిహ్నమైన చార్మినార్‌కు ముహమ్మద్ కులీ కుతుబ్‌షా శంకుస్థాపన చేసిన 19 అక్టోబర్ 1591కి కొన్ని నెలల ముందు ఎడతెరిపి లేని వర్షాలు కురిసి గోల్కొండ కోటలోనూ, మూసీ నదీ తీర ప్రాంతాల్లోనూ గత్తర్ (ప్లేగు) ప్రబలి వందలాదిమంది బలి అయ్యారు. అప్పటికే గోల్కొండ అధిక జనాభాతో కిటకిటలాడుతూ, కొత్త నగరం నిర్మాణం

> హైదరాబాద్ నగర నిర్మాణానికి ప్రధాన కారణం దాని నిర్మాత ముహమ్మద్ కులీ కుతుబ్‌షాకు తన ప్రియురాలు భాగమతిపై ఉన్న ప్రేమ అనుకుంటారు చాలామంది. కానీ అసలు కారణం వర్షాలు-వరదలు, వాటి వల్ల పేట్రేగిన ప్లేగు మహమ్మారి బారి నుంచి తన ప్రజలను రక్షించుకోవాలనే రాజకాంక్ష. ప్రస్తుతం మూసీ నది మహానగరాన్ని ముంచెత్తుతున్న నేపథ్యంలో గతాన్ని గుర్తుచేస్తున్న కథనమిది.

గురించి పాలకులు ఆలోచిస్తున్న కాలం అది. మూసీ నది ఒడ్డున ఉన్న చిచిలం (చిన్న శ్రీశైలం) గ్రామస్థులు నాలుగుదారుల కూడలిలో ఒక తాజియా (మహ్మద్ ప్రవక్త మనుమడు హుస్సైన్‌కు సంబంధించిన సమాధి ప్రతిరూపం) ప్రతిష్ఠించి మహమ్మారి బారి నుంచి తమ ప్రాణాలను కాపాడమని ప్రార్థించారు. ఆ సందర్భంలో గోల్కొండ రాజ్య సుల్తాన్ కులీ కుతుబ్‌షా కూడా నేలమీద మోకరిల్లి అల్లాను దయతో తన ప్రజల ప్రాణాలను కాపాడమని ప్రార్థించాడు. ప్లేగు వ్యాప్తి తగ్గిపోతే "ఈ ప్రదేశంలో ఒక మహత్తరమైన స్మారక చిహ్నం నిర్మిస్తాను. దానివల్ల సమస్త ప్రజలు నీ అద్భుత శక్తిని, అపార కరుణను ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటారు" అని ప్రతిజ్ఞ చేశాడు. వెంటనే వర్షాలు తగ్గిపోయాయి, ప్లేగు ఉపశమించింది.

కృతజ్ఞతగా కులీ కుతుబ్‌షా చార్‌మినార్ నిర్మాణాన్ని నగరంలోని నాలుగు దిక్కులను సూచించేదిగా, నగర మధ్య కట్టడంగా మొదలు పెట్టాడు. ప్లేగుపై విజయానికి గుర్తు కాబట్టి ఈ స్మారకంలో ఒక గవాక్షంపై ఎలుక సహజ శత్రువైన పిల్లి విజయదరహాస రూపం చెక్కించారు. అదే పిల్లి జాతికి చెంది, కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై మనుగడ సాగించిన ఈహా మృగం (శిర్దాల్) అనే ఊహా జంతువు రూపాలను మరి కొన్ని గవాక్షాలపై సింహం శరీరంతో, పక్షి ముక్కుతో చెక్కించారు.. చార్మినార్, దాని చుట్టూ ప్రపంచ ప్రసిద్ధమైన నగరం క్రీ.శ. 1597లో అందుబాటులోకి వచ్చాయి.



చార్మినార్ పైకి మెట్ల దారి ద్వారా వెళ్తే ఒక చిన్న మసీదును చేరుకోవచ్చు. ఆ మసీదులోని మిహ్రాబ్ (ప్రార్థనా గవాక్షం) వద్ద అంతకు ముందు వరకూ సంప్రదాయంగా ఉన్న వెలుగుతున్న జ్యోతి ప్రతీక స్థానంలో ఒక అందమైన గులాబీ పువ్వు చెక్కించారు. దీనినే కులీ కుతుబ్‌షాకు తన ప్రియురాలు భాగమతిపై ఉన్న ప్రేమకు చిహ్నమని చెప్తుంటారు. నిజమేనేమో! ఎందుకంటే, ముహమ్మద్ కులీ తన పద్యాలలో ఆమెను తెలంగన్ అని, భాగ్మతి అని, హైదర్ పియారి అని సంబోధించాడు. చార్మినార్ నిర్మించిన ప్రాంతంలో ఉన్న చిచిలం గ్రామస్థురాలు ఆమె. కులీ మనుమడు అబ్దుల్లా కుతుబ్‌షా రాజస్థాన చిత్రలేఖకుడు క్రీ.శ. 1650లో గీసిన చిత్రంలో కూడా చిచిలం ప్రాంతంలో పారే మూసీ నది, దాని ఒడ్డున చిన్న శ్రీశైలం గుడి కనిపిస్తాయి. నగరం నిర్మాణం పూర్తయిన తర్వాత కులీ కుతుబ్‌షా ఇలా ప్రార్థించాడట- "ఓ గొప్ప శ్రోతా! నా ప్రార్థన విను. సముద్రాన్ని చేపలతో నింపినట్టు నా నగరాన్ని ప్రజలతో నింపు". ఈ కొత్త నగరానికి కోటగోడలు లేవు. క్రీ.శ. 1590లలో చిన్న చిన్న సుల్తానులు పోటీలు పడుతూ పరస్పర దాడులు చేసుకుంటున్న కాలంలో ఇలాంటి రక్షణగోడలు లేని నగరం రూపకల్పన జరగడం ఒక విప్లవాత్మక ప్రయోగం.

స్వతంత్రంగా నిలిచిన నాలుగు గవాక్షా (ఆర్చ్)లతో నిర్మితమైన విశాలమైన చార్మినార్, మూసీ నదిపై నిర్మించిన రాతి వంతెన- ఆ నాటి గోల్కొండ రాజ్యశక్తిని ప్రతిబింబిస్తాయి. ఈ నగర నిర్మాణం పూర్తయిన 60 సంవత్సరాలకు నగరానికి వచ్చిన ప్రసిద్ధ యూరోపియన్ ప్రయాణికుడు జీన్ బాప్టిస్ట్ టావెర్నియర్ మూసీ నదిపై ఉన్న రాతి వంతెనను (ఈనాటి పురానా పూల్) పారిస్‌లోని సీన్ నదిపై ఉన్న వంతెనతో పోల్చాడు. అతని సహచరుడు థెవెనాట్ కూడా పారిస్‌లోని లూవ్ర్ రాజసౌధం ముందు ప్రవహించే సీన్ నదిలా మూసీ ఎంతో అందంగా ఉందని ప్రశంసించాడు.

హైదరాబాద్ నగరం పుట్టుకకు హేతువు వర్షాలు-వరదల నుంచి ప్రజల రక్షణ అనే సంక్షేమ కాంక్ష. మరో 311 సంవత్సరాల తర్వాత 1908లో హైదరాబాద్‌లో మళ్ళీ ఎడతెరిపి లేని వర్షాలు కురిసి మూసీ ఉప్పొంగి వేలాది మంది ప్రాణాలు కోల్పోవడం, ఆరవ నిజాం మహబూబ్ అలీ మూసీకి బోనాలెత్తగా వరదలు తగ్గిపోవడం, అనంతరం ఆయన వారసుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలంలో మూసీ, ఈసీ నదులపై ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్ సాగర్ డ్యామ్‌లను కట్టి, వరదలను అరికట్టడమే కాకుండా హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించడం గమనార్హం. అప్పుడు హైదరాబాద్ నగరంలో కట్టిన భూగర్భ డ్రైనేజీలు, మూసీ ఇరువైపుల కరకట్టలను ఇప్పటికీ చూడవచ్చు. అలా హైదరాబాద్ నగరం మూసీనది వరదలను అరికట్టడంతోనే పుట్టి వృద్ధి చెందింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా మూసీ ప్రక్షాళన, దాని చుట్టూ పర్యాటకవృద్ధి ప్రణాళికలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనుకుంటుండడం గమనార్హం.

• ద్యావనపల్లి సత్యనారాయణ

కరేబియన్ 'చక్కెర భూమి'లో భారతీయులు


> 1870ల నాటికి, భారతీయులు ట్రినిడాడ్‌లోని చక్కెర పరిశ్రమకు నిజమైన వెన్నెముకగా పరిణమించారు. ఎస్టేట్ జీవితం ఆకర్షణీయంగా లేనపుడు స్వతంత్ర రైతులుగా మారేవారు. భూ వినిమయ పథకం ద్వారా తమకు మంజూరు అయిన భూముల్లోనో లేదా కొనుగోలు చేసిన భూముల్లోనో వారు స్థిరపడ్డారు. ట్రినిడాడ్‌ను 'చీనీ డాడ్' (భోజ్‌పురి భాషలో చక్కెర భూమి) అని వారు వ్యంగ్యంగా పిలుచుకునేవారు.

కరేబియన్ ద్వీపాలలో ఒకటి ట్రినిడాడ్. తన మూడవ సముద్ర యానంలో క్రిస్టోఫర్ కొలంబస్ 1498లో అక్కడికి చేరుకున్నాక, ఆ ప్రాంతానికి ట్రినిడాడ్ అని పేరు పెట్టాడు. ఈ పేరు క్రైస్తవ త్రిమూర్తులను స్మరించుకునే ట్రినిటీ నుంచి వచ్చింది. ఈ ద్వీపం 4,828 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. కొలంబస్ అక్కడికి చేరకముందే, స్పెయిన్‌కి కూడా వలసరాజ్యం కాక ముందే, టైనో, కాలినాగో తెగల వారు అక్కడ నివసించేవారు. వారిని కరేబ్ ద్వీపవాసులంటారు. ఆ ద్వీపాల సముదాయానికి కరేబియన్ అన్న పేరు వారి మూలంగానే వచ్చింది. దానిని బ్రిటన్ 1797లో స్వాధీనం చేసుకునే వరకూ, స్పానిష్ కాలనీగానే కొనసాగింది. 1962లో స్వతంత్ర దేశంగా అవతరించే వరకూ బ్రిటిష్ చేతుల్లో ఉంది. అత్యంత సారవంతమైన కాలనీగా బ్రిటిష్ వారు దానిని గుర్తించారు.

ఆఫ్రికన్ బానిసత్వం 1834లో పూర్తిగా రద్దయాక, బ్రిటిష్ సామ్రాజ్యంలోని చెరకు తోటలలో పనిచేసేందుకు కార్మికులు దొరకక, అన్ని ప్రాంతాలలోనూ తోటల యజమానులు చెరకు ఉత్పత్తిలో సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. చౌకైన ప్రత్యామ్నాయ, శ్రామిక శక్తి కోసం తోటల యజమానులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మొదట మడైరా, వెనిజులా, తూర్పు కరేబియన్‌ల నుంచి ట్రినిడాడ్‌కు చిన్న సమూహాలుగా కూలీలను తీసుకువచ్చి ప్రయత్నించారు. ట్రినిడాడ్‌లోని వలస పాలన అధికారులు చైనా, భారతీయ కార్మికులతో కూడా ఏకకాలంలో ఈ ప్రయోగాలు చేశారు. భారతీయ కార్మికుల కంటే, చైనా కార్మికులను దిగుమతి చేసుకోవడానికి రెండు రెట్లు ఎక్కువ ఖర్చుతో పాటు, పనికి ఏ మాత్రం సరిపోని ఆ కార్మికుల నుంచి, ఆ వాతావరణానికి ఇమడలేకపోయిన కార్మికుల నుంచి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. యూరోపియన్ ఒప్పంద కార్మికులతో కూడా ఆ పనులేవీ సాధ్యపడలేదు. చివరికి, వారు 1863 నాటికే వలస పాలన స్థాపించిన మరొక కాలనీ, భారతదేశం వైపు పూర్తిగా మొగ్గారు. తోటల యజమానుల దృష్టి కూడా ఇటే పడింది. భారతీయ జనాభాలో 80 శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారు కాబట్టి, బానిసలుగా ఉన్న ఆఫ్రికన్‌లకు సరైన శ్రామిక ప్రత్యామ్నాయాన్ని భారతీయులు ఇవ్వగలరని వారంతా భావించారు.

అప్పటికే ఏర్పర్చిన ఒప్పంద కార్మిక వ్యవస్థలో భాగంగా, బ్రిటిష్ 30 మే 1845 నుంచి పెద్ద సంఖ్యలో భారతీయ కార్మికుల్ని పంపిన మూడవ దేశంగా, ట్రినిడాడ్ & టొబాగోని చేర్చుకుంది. ఆ వ్యవస్థ ఆ సరికే మారిషస్, గయానాల్లో ఉనికిలో ఉంది. కార్మికులను అలా తీసుకువెళ్లిన తొలి నౌక ఫతేల్ రజాక్ 1845 ఫిబ్రవరి 16న కలకత్తా నుంచి బయలుదేరి 1845 మే 30న, 225 మంది కార్మికులతో ట్రినిడాడ్‌కు చేరింది. భారతీయ కార్మికులను 1917 వరకు, అలా క్రమ పద్ధతిలో ట్రినిడాడ్‌కు రవాణా చేయడానికి, మొత్తం 154 నౌకలు కలకత్తా, మద్రాస్, బొంబాయి నుంచి 320 ప్రయాణాలు చేశాయి. 1845-1917ల మధ్య మొత్తం 1,43,939 మంది భారతీయులు ఒప్పంద విధానంలో ట్రినిడాడ్‌కు వలస వెళ్లారు.

ట్రినిడాడ్ ఒప్పంద కార్మికులలో ఎక్కువ మంది ఉత్తర భారతదేశంలోని ఉత్తరప్రదేశ్, బిహార్ ప్రాంతాల వ్యవసాయ, కార్మిక తరగతుల వారే ఉన్నారు. బెంగాల్, దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తక్కువ సంఖ్యలో ఉన్నారు. వలస వెళ్లిన వారిలో దాదాపు 85 శాతం మంది హిందువులు, 14శాతం ముస్లింలు. ఒప్పంద కార్మిక వ్యవస్థ కింద నలిగి కష్టతరమైన పరిస్థితులు అనుభవించినప్పటికీ, దాదాపు 90 శాతం మంది భారతీయ వలసదారులు తమ ఒప్పంద కాల వ్యవధి ముగింపులో, ట్రినిడాడ్‌నే తమ శాశ్వత నివాసంగా మార్చుకున్నారు. వలసదారుల్లో అధికశాతం 20-30 వయస్సు మధ్య వారే.



ఒప్పంద ఐదేళ్ల వ్యవధి ముగింపులో, భారతీయ వలసదారులకు పారిశ్రామిక నివాస ధ్రువీకరణ పత్రం మంజూరు చేయబడేది. ఆ వ్యక్తి ఇక ఒప్పందానికి లోబడి లేడని ధ్రువీకరిస్తూ ఇచ్చిన ఒక విధమైన హామీ అది. అయినా భారతదేశానికి ఉచితంగా తిరిగి వెళ్లే అర్హత సంపాదించడానికి, కార్మికులు మరో ఐదేళ్ల పాటు తిరిగి ఒప్పందాన్ని పొందవలసి వచ్చేది. కాలనీలో పదేళ్ల శ్రమను పూర్తి చేయకుండా భారతదేశానికి తిరిగి రావడానికి ఏకైక ప్రత్యామ్నాయం వారివారి స్వంత ఖర్చుతో పయనమవడం. అది కుదరక దాదాపు 75 శాతం మంది ద్వీపంలో శాశ్వత స్థిరనివాసులుగా ఉండిపోయారు. మిగిలినవారు పొదుపుగా దాచుకున్న దానితో భారతదేశానికి తిరిగి వచ్చారు. అలా దాదాపు 20 శాతం మంది మాత్రమే స్వదేశానికి తిరిగొచ్చారు.

1870ల నాటికి, భారతీయులు ట్రినిడాడ్‌లోని చక్కెర పరిశ్రమకు నిజమైన వెన్నెముకగా నిరూపించుకున్నారు. భారతీయులకు, ఎస్టేట్ జీవితం ఆకర్షణీయంగా లేనపుడు స్వతంత్ర రైతులుగా మారడానికి పెద్ద సంఖ్యలో ఎస్టేట్‌ల నుంచి తరలివెళ్లడం ప్రారంభించారు. భూ వినిమయ పథకం ద్వారా వారికి మంజూరు అయిన భూముల్లోనో లేదా ప్రాంతం నుంచో, వారు కొనుగోలు చేసిన భూముల్లోనో వారు స్థిరపడ్డారు.

1902 నాటికి, ట్రినిడాడ్‌లోని ఉత్పత్తి అయిన చెరకులో సగానికి పైగా స్వతంత్ర చెరకు రైతులతోనే ఉత్పత్తి అయింది. వారిలో అత్యధికులు భారతీయులు. అందుకే వారు ట్రినిడాడ్‌ను 'చీనీ డాడ్' (భోజ్‌పురి భాషలో చక్కెర భూమి) అని వ్యంగ్యంగా పిలుచుకోవడం మొదలుపెట్టారు.

1884 తర్వాత ఒక కొత్త ప్రజా కార్యరూపం అకస్మాత్తుగా అక్కడ ఏర్పడింది. అది కాలనీల ప్రముఖ పత్రికలకు లేఖలు రాయడం రూపంలో బయటకొచ్చింది. భారతీయుల్లో అలా మొదటి లేఖ రాసినవాడు "A Son of India" అనే కలంపేరుతో 1888లో ట్రినిడాడ్‌లోని San Fernando Gazette అనే పత్రికలో రాయడం ప్రారంభించాడు. అది కాలనీలో ప్రముఖమైన క్రియోల్ (నల్లజాతీయులు) పత్రిక. చదువుకున్న క్రియోల్స్, వారి హక్కుల కోసం పోరాడే పత్రిక. ఆ లేఖల్లో ప్రస్తావించిన ప్రధాన అంశాల మూలంగా, 1889 నాటికి, "కూలీ" అనే పదం అవమానకరంగా భావించబడింది. అప్పటికే ఏర్పడ్డ 'కూలీ మిషన్' 'ఈస్ట్ ఇండియన్ మిషన్'గా పేరు మార్చబడింది. ఈ లేఖలు భారతీయ ప్రజా ఉద్యమం, ట్రినిడాడ్‌లో భారతీయ సముదాయ ఉనికిని, విద్య, పౌరసత్వం, సాంస్కృతిక గౌరవం వంటి అంశాల ఆధారంగా ప్రజా వేదికల ద్వారా వ్యక్తీకరించడానికి పునాది వేశాయి.

1881లోనే ట్రినిడాడ్‌లో భారతీయులు 'కాశీ పూరి' ఆలయం నిర్మించుకున్నారు. భారతీయ పేర్లతో మందిరాలు, హోటళ్లు, విద్యాలయాలు, కాలేజీలు ఉన్నాయి. హిందూ పండుగలను సైతం జరుపుకుంటారు. 30 ఏళ్లకు పైగా ప్రజాజీవితంలో ఉన్న ట్రేడ్ యూనియన్ ప్రతిపక్ష నాయకుడు బాస్దియో పాండే అక్కడ ప్రధానమంత్రిగా ఎన్నికైన మొదటి భారతీయుడు. అతడి నేతృత్వంలోని యునైటెడ్ నేషనల్ కాంగ్రెస్ సభ్యురాలు కమలా పెర్సాద్ బిస్సెస్సర్ అటార్నీ జనరల్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు అక్కడి ప్రధానమంత్రిగా ఆమె ఆహ్వానం మీదనే, ఇటీవల మన ప్రధాని మోదీ ట్రినిడాడ్ వెళ్లారు. అప్పటి వారి వారసులు అలా అక్కడ అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. అక్కడి జనాభాలో 38 శాతం భారతీయ వారసులే ఉన్నారు.

కరేబియన్‌లో భారతీయ ఉనికికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ఏకైక వ్యక్తి నవలా రచయిత వి.ఎస్. నైపాల్, 2001లో సాహిత్యానికి ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని గెలుచుకున్నాడు. భారతీయ వారసత్వం, ట్రినిడాడ్ టొబాగో జీవనశైలిలో అంతర్భాగం అయింది. సాహిత్యంలో భారతీయ వారసులు వారి మూలాల్ని మరచిపోలేని రచనలు చేస్తున్నారు. రమాబాయి ఎస్పినెట్ సంపాదకత్వంలో, 'క్రియేషన్ ఫైర్' కరేబియన్ మహిళల కవిత్వ సంకలనంలో 115 మంది కరేబియన్ మహిళా కవయిత్రుల (దాదాపు 200 కవితల) ఉత్తేజకరమైన సంకలనం కూడా వెలువడింది.

కరేబియన్ ద్వీపంలో ట్రినిడాడ్ మాత్రమే, మే 30, 1845న వచ్చిన మొదటి ఒప్పంద కార్మికుల రాకను పురస్కరించుకుని వారసత్వ దినోత్సవాన్ని జరుపుకుంటున్నది. ఒప్పంద కార్మికుల రాకను జరుపుకుంటున్న మరొక దేశం మారిషస్. చాలా మంది నాల్గవ, ఐదవ తరం ఇండో-కరేబియన్లు తమ పూర్వీకుల మూలాలను వెతుక్కుంటున్నారు. భారతదేశంలోని వారి పూర్వీకుల ఇళ్లు/గ్రామాలను సందర్శిస్తున్నారు. కాస్మోపాలిటన్ కరేబియన్‌లో వారు తమను తాము ఎలా పిలుచుకున్నా, అక్కడి వారు తమను ప్రత్యేకమైన వ్యక్తులుగా చూస్తున్నారనే వాస్తవాన్ని మాత్రం తప్పించుకోలేకపోతున్నారు.

■ ముకుంద రామారావు
కవి, వలసజీవితాల చరిత్రకారుడు (99083 47273)



కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ రవినాథ్ తిలహరి, జస్టిస్ నైనాల జయసూర్య, కృష్ణాజిల్లా జడ్జి గుట్టల గోపి, ఎంఎస్‌జే ఎ.సత్యానందం, బార్ ప్రెసిడెంట్ ఏకే షా తదితరులు

2 వరకు బెజవాడ బార్‌లో గాంధీ జయంతి ఉత్సవ్

విజయవాడ లీగల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్‌లో శనివారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు గాంధీ జయంతి ఉత్సవ్ పేరుతో మెగా కార్యక్రమాన్ని చేపట్టారు. బెజవాడ బార్ ప్రాంగణంలో శనివారం సబర్మతి ఆశ్రమ నమూనా ఏర్పాటు చేసి గాంధీ చిత్రపటాలను ప్రదర్శించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిలహరి, జస్టిస్ నైనాల జయసూర్య, కృష్ణాజిల్లా జడ్జి గుట్టల గోపి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందంతో పాటు 31 మంది న్యాయమూర్తులు పాల్గొని సబర్మతి ఆశ్రమాన్ని, ఫొటో గ్యాలరీని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కృష్ణాజిల్లా జడ్జి గోపి మాట్లాడుతూ గాంధీ జయంతి ఉత్సవాలు వారం రోజుల పాటు చేయడం ఎంతో ఆనందించదగ్గ విషయమని, ఈ ఉత్సవాలతో పాటు గాంధీ ఆశయాలను తప్పక పాటించాలని తెలిపారు. జస్టిస్ జయసూర్య మాట్లాడుతూ బెజవాడ బార్ ఆవరణలో సబర్మతి ఆశ్రమం ఏర్పాటు చేసి గాంధీజీ రోజులను గుర్తుచేయడం కొత్తగా అనిపించిందన్నారు. జస్టిస్ రవినాథ్ తిలహరి మాట్లాడుతూ గాంధీజీని గుర్తుచేసుకుంటూ ఈ విధమైన కార్యక్రమాలు చేయడం ఆయనకు ఎంతో గౌరవాన్ని ఇచ్చినట్టవుతుందన్నారు.

నేడే గరుడ వాహన సేవ

- 4 లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనా
- ఒక రోజు ముందే కిటకిటలాడుతున్న తిరుమల కొండ
- శనివారమే నిండిపోయిన మాడ వీధుల్లోని గ్యాలరీలు
- నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తున్న టీటీడీ
- భారీ భద్రతా ఏర్పాట్లు.. 4 వేల సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

తిరుమల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యం గల గరుడ వాహన సేవ ఆదివారం జరుగనుంది. ఈసారి గరుడసేవను తిలకించేందుకు మూడు నుంచి నాలుగు లక్షల మంది భక్తులు తిరుమలకు చేరుకోవచ్చని టీటీడీ అంచనా వేస్తోంది. ఇందుకు తగ్గట్టే శనివారం ఉదయం నుంచే తిరుమలలో రద్దీ పెరిగింది. పవిత్ర పెరటాశి మాసం రెండవ శనివారం గరుడ సేవకు ముందు రోజు రావడంతో తమిళనాడు నుంచి భక్తులు వెల్లువలా వస్తున్నారు. జాతీయ రహదారిపైన వందల కిలోమీటర్ల నుంచి నడిచి వస్తున్న భక్తులు కనిపిస్తున్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాలు కిటకిటలాడుతున్నాయి. వీరంతా మాడ వీధుల్లోని గ్యాలరీల్లోకి చేరారు. శనివారం కల్పవృక్ష వాహన సేవ సమయంలోనే గ్యాలరీలు నిండిపోయాయి. రాత్రి సర్వభూపాల వాహన సేవలోనూ భక్తులు అధికంగా కనిపించారు. వీరంతా ఆదివారం రాత్రి గరుడ వాహన సేవ పూర్తయ్యే వరకు గ్యాలరీల్లోనే కూర్చుంటారని అధికారులు భావిస్తున్నారు. వీరికి టీటీడీ నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తోంది. గరుడ వాహన సేవ రోజు దాదాపు 5,600 మంది పోలీసు, విజిలెన్స్ సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 4 వేల సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. గతేడాది కార్నర్ పాయింట్లలో ఏర్పాటు చేసిన క్యూలైన్ల వద్ద భక్తుల మధ్య తోపులాటలు చోటుచేసుకున్న క్రమంలో ఈసారి క్యూలైన్లు పొడిగించడంతో పాటు అన్నప్రసాదాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించారు. మాడవీధుల ద్వారా 1.90 లక్షల మందికి, మాడవీధుల్లోని నాలుగు కార్నర్ పాయింట్ల ద్వారా 35 వేల మందికి గరుడ వాహన దర్శనం చేయించేలా టీటీడీ ఏర్పాటు చేసింది. గ్యాలరీల్లోకి, క్యూలైన్లలోకి రాలేని భక్తుల కోసం తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో 36 హెచ్‌డీ స్ర్కీన్లను కూడా ఏర్పాటు చేశారు.

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై శ్రీవారి విహారం

తిరుమల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నాలుగోరోజు శనివారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనాలపై మలయప్పస్వామి భక్తులను కటాక్షించారు. వాంఛిత ఫలాలన్నింటినీ ప్రసాదించే కల్పవృక్ష వాహనంలో దేవేరులతో కలిసి శ్రీవారు రాజమన్నార్ అలంకారంలో ఉదయం మాడవీధుల్లో విహరించారు. మధ్యాహ్నం ఆలయంలోని రంగనాయక మండపంలో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కన్నుల పండువగా జరిగింది. 25 వేల తామర పూలు, 5వేల రోజాపూలు, పలు రకాల పండ్లతో మండపాన్ని అలంకరించారు. స్నపనం తర్వాత ఉత్సవ మూర్తులకు కశ్మీరు నుంచి ప్రత్యేకంగా తీసుకు వచ్చిన మూడు కిలోల కుంకుమపువ్వుతో మాలలు అల్లి అలంకరించారు. వాటితోనే కిరీటాలు పెట్టారు. అలాగే శ్రీవిల్లిపుత్తూరు ఆలయం నుంచి వచ్చిన గోదాదేవి మాలలు, చెన్నైకి చెందిన హిందూ ధర్మార్థసమితి తరఫున నూతన గొడుగుల సమర్పణ కార్యక్రమం వేడుకగా జరిగింది. రాత్రికి శ్రీవారు సర్వభూపాల వాహనాన్ని అధిష్ఠించి భక్తులను అనుగ్రహించారు.



సర్వభూపాల వాహనంపై దర్శనమిస్తున్న మలయప్ప



కాత్యాయని అలంకారంలో భ్రమరాంబికాదేవి

శ్రీశైలం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో ఆరో రోజు శనివారం భ్రమరాంబికాదేవి కాత్యాయని అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవారిని హంస వాహనంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. వర్షం కారణంగా గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం అమ్మవారు కాళరాత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవారికి గజవాహన సేవ నిర్వహించనున్నారు.

శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా కనకదుర్గమ్మ



విజయవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ శనివారం శ్రీ లలితా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఏడు గంటల సమయానికి 92,360 మంది అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారు ఆదివారం శ్రీ మహాచండీ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు.

ఆక్వా పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తాం

- రాష్ట్ర ఆక్వా ఎగుమతిదారులకు కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ హామీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని ఆక్వా పరిశ్రమ దేశానికే గర్వ కారణమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. రాష్ట్రంలో ఆక్వా పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహకారం అందించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఆక్వా పరిశ్రమకు చెందిన ఎగుమతిదారులతో శనివారం, ఆయన ఢిల్లీలో భేటీ అయ్యారు. ఆక్వా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై ఓపెన్ హౌస్ నిర్వహించి, ఎగుమతిదారులు, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లపై లోతుగా చర్చించారు. ఈ చర్చలో ముఖ్యంగా ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు, అమెరికా ప్రభుత్వం విధించిన టారిఫ్‌ల వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను ఎగుమతిదారులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమను మరింత బలోపేతం చేసి, ఎగుమతులను పెంచడానికి, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడానికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆఫ్రికా నత్తల బెడదను నివారిద్దాం!

- అవి ఆశించడం వల్ల పంటలకు తీవ్ర నష్టం
- కేరళ వక్క మొక్కల ద్వారా ఇక్కడికి వ్యాప్తి
- ఒక్కో నత్త నెలకు 5 వేల పిల్లల్ని చేస్తాయి
- రైతులు సామూహిక నివారణ చర్యలు చేపట్టాలి
- ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు సూచనలు

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన, వ్యవసాయ పంటలపై ఆశించి, విపరీతంగా నష్టం కలిగిస్తున్న ఆఫ్రికా నత్తల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు సూచించారు. గ్రామాల్లో రైతులంతా సామూహికంగా నత్తల నివారణ చర్యలు పాటిస్తే.. మంచిదని పేర్కొన్నారు. కేరళ నుంచి తెస్తున్న వక్క మొక్కల ద్వారా ఆఫ్రికా నత్తలు వస్తున్నాయని, వాటిని తెచ్చేటప్పుడు ఉద్యాన అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కేరళ ఉద్యానశాఖను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు. మన ప్రాంతంలో ఉండే తెల్ల నత్తల వల్ల పంటలకు నష్టం ఉండదని, ఆఫ్రికా నత్తల వల్లే తీవ్ర నష్టమని చెప్పారు. వీటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను శనివారం ఓ ప్రకటనలో వివరించారు. వందేళ్ల క్రితమే ఆఫ్రికా నుంచి భారత్‌లోకి వచ్చిన ఈ నత్తలు గాలి, వెలుతురు తలగని ప్రదేశాల్లో ఉండి.. జూలై నుంచి ఫిబ్రవరి మధ్య సంతానోత్పత్తి చేస్తాయని, ఐదారేళ్లు జీవించే ఒక్కో నత్త నెలకు 100-400 గుడ్లు పెట్టి, కనీసం 5 వేల పిల్లల్ని చేస్తాయని పేర్కొన్నారు. అరటి, జామ, బొప్పాయి, వక్క, ఆయిల్‌పామ్ తోటల్ని, పత్తి, మొక్కజొన్న, కూరగాయ పంటల్ని ఆశించి, అపార నష్టం కలిగిస్తాయని తెలిపారు. గత మూడేళ్ల నుంచి కొందరు రైతులు కేరళ నుంచి వక్క మొక్కలను తీసుకొచ్చి నాటుకుంటున్నారని, ప్రస్తుతం కృష్ణా, అనంతపురం, అల్లూరి, మన్యం, గోదావరి జిల్లాల్లోనూ వక్క చెట్లు ఉన్నాయని, దీంతో మన రాష్ట్రంలోనూ ఆఫ్రికా నత్తలు వృద్ధి చెందుతున్నాయని చెప్పారు.

ఆఫ్రికా నత్తల నిర్మూలనకు సూచనలు..

- రైతులు పంటలను నిండుగా వేసుకోకుండా.. గాలి, వెలుతురు సోకేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పొలాలు, తోటల్లో తేమతో కూడిన చెత్త, కలుపు తొలగించడంతో పాటు ఎప్పటికప్పుడు అంతర సేద్యం చేయాలి. తోటలకు రాత్రిళ్లు నీరు పారించకుండా, పగటి సమయంలోనే నీరు పెట్టుకోవాలి.
- తోటల్లో బాతులు, కోళ్లను పెంచితే అవి నత్తల్ని నాశనం చేయడంలో ఉపకరిస్తాయి. నత్త పిల్లలను బాతులు, కోళ్లు, ఇతర పక్షులు తింటాయి.
- పొలం గట్లపై కిలో ఉప్పు కలిపిన 4 లీటర్ల నీటిలో ముంచిన గోనె సంచులు పరిస్తే.. నత్తల వలసలు ఆగుతాయి. గోనె సంచిలోని ఉప్పు ఘాడత నత్త శరీరంలో ఉండే నీటిని లాగేస్తాయి. చేతికి గ్లౌజులు వేసుకుని, కనిపించిన నత్తల్ని ఏరి ఉప్పు ద్రావణంలో పడేస్తే చనిపోతాయి.
- 25 కిలోల వరి తవుడు, 100 గ్రాముల థియోడికార్బ్ గుళికలు, 3 కిలోల బెల్లం, 100 గ్రాముల ఆముదం కలిపిన చిన్న ఉండలు, బొప్పాయి, క్యాబేజీ ఆకులను పొలాలు, తోటల్లో అక్కడక్కడా వేస్తే.. నత్తలు తిని, చనిపోతాయి. మెటల్డిహైడ్ గుళికలు ఎకరానికి 5 కిలోలు చల్లితే నత్తలు తిని, చనిపోతాయి.
- సత్వర నివారణకు చిలేటెడ్ కాపర్ 3 గ్రాములు, ఫెరోమేగ్ 3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేస్తే.. నత్తలు వెంటనే చనిపోతాయి. కొన్ని కదలికలో ఉంటే 4 లీటర్ల నీటిలో 5 కిలోల కల్లు ఉప్పు వేసి, కరిగించిన ద్రావణంలో నత్తల్ని పడేస్తే కచ్చితంగా చనిపోతాయి.

'మిట్టల్, నిప్పన్ స్టీల్'కు ప్రజామోదం

- ప్లాంటు ఏర్పాటును స్వాగతించిన అన్ని పార్టీల నాయకులు
- ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో స్థానికులకు ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి

అనకాపల్లి/నక్కపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండల పరిధిలోని విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూముల్లో 'ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్' స్టీల్ కంపెనీ ఏర్పాటుకు స్థానికులు, అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు ఆమోదం తెలిపారు. మండలంలోని చందనాడ పంచాయతీ శివారు పాటిమీద గ్రామంలో కలెక్టర్ కె.విజయ్‌కృష్ణన్ అధ్యక్షతన పర్యావరణం, కాలుష్య నియంత్రణ అంశాలకు సంబంధించి శనివారం ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. కూటమితో పాటు ప్రతిపక్ష, వామపక్ష పార్టీల నాయకులంతా పరిశ్రమఏర్పాటును స్వాగతిస్తున్నామని స్పష్టంచేశారు. స్టీల్ ప్లాంటు నిర్మాణ దశ నుంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో స్థానికులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ఆలయదర్శనం

జై బేతాళ!

మన దేశంలో బేతాళ ఆలయాలు అరుదుగా కనిపిస్తాయి. అయితే బేతాళుణ్ణి పూజించే సంప్రదాయం మయన్మార్‌లోని యాంగూన్ (రంగూన్) తదితర ప్రాంతాల్లో విస్తృతంగా కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అంబాజీపేటలోనూ ఇటువంటి విలక్షణమైన ఆలయం ఉంది. అక్కడ దాదాపు యాభై ఎనిమిదేళ్ళ క్రితం కొలువుతీరిన బేతాళుడు... అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి దోహదం చేసే వేలుపుగా ప్రసిద్ధి చెందాడు.

వివిధ అభీష్టాలు తీరడం కోసం వేర్వేరు దేవతలను పూజించే సంప్రదాయం అన్ని ప్రాంతాలలోనూ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ అంబాజీపేట, పేరూరులకు చెందిన ప్రజలు బేతాళుణ్ణి పూజిస్తారు. దీని వెనుక ఉన్న కథేమిటంటే... కొన్ని దశాబ్దాల క్రితం ఈ ప్రాంతానికి చెందిన కొందరు ఉపాధి కోసం బర్మా (ప్రస్తుతం మయ



న్మార్)కు వెళ్ళారు. అక్కడ అనేక ప్రాంతాల్లో బేతాళుడి ఆరాధనను, ఉత్సవాలను వారు గమనించారు. అక్కడివారు బేతాళుణ్ణి తమ లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి పూజిస్తారని తెలుసుకొని, వారూ దాన్ని అనుసరించారు. తిరిగి స్వదేశం వచ్చిన తరువాత... ఇక్కడ కూడా బేతాళుడి ఆరాధన కొనసాగించారు. ఈ విధంగా 1967 నుంచి బేతాళ ఉత్సవాలను అంబాజీపేట, పేరూరుకు చెందిన ఒక వర్గం వారు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం శరన్నవరాత్రుల సందర్భంగా... కలశ స్థాపనతో ప్రారంభించి, పది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీనికోసం అంబాజీపేట శ్రీనివాసనగర్‌లో... 1982లో శ్రీ విజయ బేతాళ ఆలయాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. అక్కడ విజయ దశమి అనంతరం భారీ స్థాయిలో బేతాళ ఉత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవంలో పదమూడు వాహనాలు ప్రదర్శిస్తారు. సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేస్తారు.

● సి.ఎన్.మూర్తి

సండే సెలబ్రిటీ



"ఈ మధ్యకాలంలో నేను చూసిన మన దేశ సినిమాల్లో 'కశ్మీరీ ఫైల్స్, కేరళ స్టోరీ, యానిమల్' బాగున్నాయి."

రాము 2.0

"'సత్య' సినిమా రీరిలీజ్ తర్వాత నాలో పరివర్తన వచ్చింది. నన్ను నేను సీరియస్‌గా తీసుకుంటున్నా"... రామ్‌గోపాల వర్మ నుంచి ఇలాంటి మాటలు వినిపిస్తే చాలా మందికి షాక్ అనిపిస్తుంది. గత కొన్నేళ్లుగా అనేక రకాల వివాదాల్లో చిక్కుకున్న వర్మ తాజాగా బాలీవుడ్‌లో భారీ సినిమాల ద్వారా పునఃప్రవేశం చేయటానికి రంగం సిద్ధం చేసుకొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను 'నవ్య' పలకరించింది.

రాము 2.0 ఎలా ఉండబోతున్నాడు?

కొన్ని నెలల క్రితం 'సత్య' రీరిలీజ్ అయింది. అది చూసిన తర్వాత నాలో ఒక పరివర్తన వచ్చింది. దాని ఫలితం ఎలా ఉంటుందనేది అందరికీ భవిష్యత్తులో తెలుస్తుంది. నా జీవితంలో మొదటిసారి నన్ను నేను సీరియస్‌గా తీసుకోవాలనుకున్నా! వాస్తవానికి ఇలా చెబుతుంటే... వినటానికి నాకే ఇబ్బందిగా అనిపిస్తోంది. బహుశా అందరికీ ఇలా అనిపిస్తుందేమో కూడా! సినీ రంగంలో ఇప్పటిదాకా ఎవరూ చేయని... ఊహించని సినిమాలను రూపొందించాలని నిర్ణయం తీసుకున్నా. అవి ఎలా ఉంటాయో త్వరలో మీకే తెలుస్తుంది. చాలా పెద్ద ప్రాజెక్టులు వస్తాయి.

ఈ మధ్య మీలో వచ్చిన మార్పేమిటి?

నాకు ఇప్పటిదాకా ఒక లక్ష్యం లేదు. ఏ మూడ్ వస్తే.. ఎప్పుడెలా అనిపిస్తే అలా చేసేవాడిని. ఒక ప్లాన్ ఉండేది కాదు. ఒక గోల్‌ను పెట్టుకొని గాలికి తిరిగినట్లు తిరిగాను. కొన్ని మంచి ఉండచ్చు. కొంత చెడు జరిగి ఉండవచ్చు. నేను ప్రముఖ రచయిత్రి ఐయాన్ రాండ్ ఫ్యాన్‌ని. గత 30 ఏళ్లుగా ఆమె ప్రవచించిన తత్వాన్ని చెబుతూనే ఉన్నాను. కానీ నేను ఎప్పుడూ ఫాలో కాలేదు. మనం చేసే ప్రతి పనికి ఒక లక్ష్యం ఉండాలి. ప్రతి ఆలోచన, పని ఆ లక్ష్యం వైపే ఉండాలి. దానివైపే ప్రయాణం ఉండాలి. ఇప్పుడు నేను మంచి సినిమాలు తీయాలని అనుకుంటున్నాను. అన్నీ సూపర్‌హిట్ అవుతాయని అనుకోవటం లేదు. నా జీవితంలో అనేక సంవత్సరాలు వృథా చేసుకున్న తర్వాత, ఇప్పుడు ఆ దిశలోనే ప్రయాణించటం మొదలుపెట్టా. నా జీవితంలో మిగిలిన కొన్నేళ్ల ఈ ప్రయాణం కొనసాగిస్తా. ఈ మధ్యనే సినీ పరిశ్రమకు చెందిన ఒకరు వచ్చి... "చేతకాని వారు చెత్త సినిమాలు తీస్తారు. తీయడం వచ్చి కూడా అలాంటి సినిమాలు ఎందుకు తీస్తారు" అని అడిగారు.

> గతంలో కన్నా ఇప్పుడు వ్యక్తులను భరించగలుగుతున్నా. ఇద్దరు భిన్నమైన వ్యక్తులు ఒక విషయంపై ఒకే విధమైన అవగాహన, అభిప్రాయాలు కలిగి ఉంటారనుకోవటం తప్పు. ప్రతి వ్యక్తీ ప్రత్యేకమే! ఇతరుల అభిప్రాయాలను గౌరవించటమనేది మానవత్వంలో ఒక పార్శ్వమని నేను నమ్ముతాను.

'శివ'ను రీరిలీజ్ చేస్తున్నారు కదా..

చాలామంది నమ్మకపోవచ్చు... కానీ 35 ఏళ్ల క్రితం 'శివ' రిలీజ్ తర్వాత మళ్లీ దానిని ఎప్పుడూ చూడలేదు. అక్కడక్కడ సీన్స్ చూశానేమో! ఈ మధ్య ఆ సినిమా పూర్తిగా చూసినప్పుడు కొత్తగా అనిపించింది. సాధారణంగా సినిమా తీస్తున్నప్పుడు మనం ఆ జర్నీలో నిమగ్నం అయిపోతాం. సినిమా పూర్తయిన తర్వాత దానిపై ఇతరులు ఎలాంటి కామెంట్స్ చేస్తున్నారనే విషయంపైనే శ్రద్ధ పెడతాం. అంతే తప్ప నిష్పాక్షికంగా చూడం. ఆ సినిమాను చూసినప్పుడు ఒక ఫిల్మ్‌మేకర్‌గా ఇప్పుడు చాలా పరిణితి వచ్చిందనిపించింది.

మీ ఉద్దేశంలో 'శివ' పాత్ర గొప్పతనమేమిటి?

శివ పాత్రలోని ఆర్ద్రత.. అది నేను డిజైన్ చేసి తీసింది కాదు. 1970, 80లలో వచ్చిన అమితాబ్ సినిమాలలో ఉండే మధ్యతరగతి కోపాన్ని.. 'గాడ్‌ఫాదర్' వంటి సినిమాలో ఉండే కొన్ని లక్షణాలను తీసుకొని ఆ పాత్రను రూపొందించా. నా ఉద్దేశంలో అలాంటి హీరో పాత్ర గత 35 ఏళ్లలో ఏ సినిమాలోనూ రాలేదు.

'రంగీల'కు 30 ఏళ్లు .. ఎలా అనిపిస్తోంది?

రహమాన్, ఊర్మిళ... నేను ఆ సినిమా తీయటానికి ప్రధానమైన కారణాలు. సాధారణంగా నాకు లవ్ స్టోరీలంటే ఎక్కువ ఇష్టం ఉండదు. కానీ ఆ సమయంలో సౌండ్ ఆఫ్ మ్యూజిక్ వంటి సినిమాల ప్రభావం నాపై బాగా ఉండేది. ఈ సినిమా తీయటానికి ఇది కూడా ఒక కారణం.

> "నన్ను ఎవరైనా పొగిడితే ఇష్టపడను. ఎందుకంటే నేనేమిటో నాకు తెలుసు. ఎవరైనా ఎక్కువ పొడిగితే- అతనిని వెధవ అనుకుంటాను. అవసరమైన దానికన్నా ఎక్కువ తిట్టినా వెధనుకుంటాను"

తప్పొప్పులు ఉండవు...

నా ఉద్దేశంలో తప్పొప్పులు అనేవి ఉండవు. ఒక తప్పువల్ల ఇంకో ఒప్పు జరగవచ్చు. ఒక సంఘటన చెబుతాను. నేను సంజయ్‌దత్‌తో 'నాయక్' మొదలుపెట్టా. ఆయన జైలుకు వెళ్లటంతో ఆ సినిమా ఆగిపోయింది. దీంతో నేను తెలుగులో... 'అనగనగా ఒక రోజు' తీశా. అది సూపర్‌హిట్ అయింది. సంజయ్‌దత్ బయటకు వచ్చాక... "నాయక్ వద్దు.. అనగనగా ఒక రోజులాంటి సినిమా తీద్దాం" అన్నాడు. దాంతో 'దౌడ్' తీశా. కానీ అది ఫ్లాప్ అయింది. ఇలా ఒక సంఘటన మరొక దానికి కారణమవుతూ ఉంటుంది.



దర్శకులలో మీకు స్ఫూర్తి ఎవరు?

కె.బాలచందర్ గారు అంటే నాకు చాలా ఇష్టం. చిన్న డైలాగ్స్, ఎడిటింగ్ కట్స్ నాపై చాలా ప్రభావం చూపాయని ఈ మధ్యనే అర్థమయింది. ఆయన తీసిన ఒక బ్లాక్ అండ్ వైట్ సినిమా చూస్తుంటే ఆయన నాపై చూపిన ప్రభావం ఏంటో తెలిసింది. ఇక దాసరి గారి సినిమాల్లో పాత్రల రూపకల్పన చాలా బాగుంటుంది. 'చిల్లరకొట్టు చిట్టమ్మ, శివరంజని' వంటి పాత్రలు చాలా అరుదుగా వస్తాయి. ఇక హీరోల విషయానికి వస్తే నాపై తీవ్రమైన ప్రభావం చూపించిన నటుల్లో అమితాబ్ ఒకరు. ఆయన నటించిన 'జంజీర్, దివార్' వంటివి ఒక తరం ప్రేక్షకులపై ప్రభావం చూపించాయి.

మీ సినిమాల్లో పాత్రలు ఎలా పుడతాయి?

ఆ పాత్రలన్నీ మన మధ్యలోనే ఉంటాయి. విజయవాడలో ఉన్నప్పుడు స్టూడెంట్ పాలిటిక్స్ చూశా. ఆ తర్వాత మా సినిమా ఆఫీసుల్లో పాలిటిక్స్ చూశా. ఒక అసిస్టెంట్ డైరక్టర్ నా వెనకే నా గురించి మాట్లాడేవాడు. మళ్లీ దానిని వచ్చి కొందరు చెప్పేవారు. వాటి నుంచి కొన్ని పాత్రలు పుట్టాయి. ఇక 'కంపెనీ' లాంటి సినిమాలు అండర్ వరల్డ్‌లో ఏం జరుగుతోందో తెలుసుకొని తీసినవి. నా ఉద్దేశంలో అండర్ వరల్డ్‌లోనైనా.. ఆఫీసుల్లోనైనా పాలిటిక్స్ ఒకటే! ఆఫీసుల్లో ఉద్యోగం తీసేస్తారు. అక్కడ కాల్చేస్తారు.

సినీ పరిశ్రమలో హిపోక్రసీ ఎక్కువ కదా!

హిపోక్రసీ భయంవల్ల వస్తుంది. లోపల నమ్మింది బయట అనలేకపోవటానికి కారణం అదే. అయితే దీనిని నెగిటివ్‌గా తీసుకోకూడదనేది నా ఉద్దేశం. ఒక వ్యక్తి అలా మాట్లాడటం వెనక అనేక కారణాలుంటాయి. నాకు ఫ్యామిలీ లేకపోవటం వల్ల నేను హిపోక్రటిక్‌గా మాట్లాడకపోవచ్చు. ఇక ఇండస్ట్రీ అంటారా... ఇంకొకళ్ల సినిమా ఫ్లాప్ అయితే ఆనందపడతారు. ఇంకోళ్ల ఫ్లాప్ మన హిట్‌లా ఉంటుంది. చాలా మంది ఎక్కువ ఎంజాయ్ చేసేది అదే! అయితే ఇది ఇండస్ట్రీలోనే కాదు... చాలా చోట్ల ఉంటుంది.

● సీవీఎల్ఎన్ ప్రసాద్

దుర్గా నవరాత్రులు



శ్రీ మహాచండీ దేవి

నేటి అలంకారం శ్రీ మహాచండీదేవి

ఆశ్వయుజ శుద్ధ షష్ఠి, ఆదివారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఈ రోజున విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ మహాచండీదేవిగా దర్శనమిస్తారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మహాలక్ష్మీ, మహాకాళీ, మహాసరస్వతీ త్రిశక్తి స్వరూపిణిగా శ్రీమహాచండీ అమ్మవారు ఉద్భవించింది. శ్రీచండీ అమ్మవారిలో అనేకమంది దేవతలు కొలువై ఉన్నారు. శ్రీమహాచండీ అమ్మవారిని ప్రార్థిస్తే సకల దేవతలను ప్రార్థించినట్టే. అమ్మవారి అనుగ్రహం వల్ల విద్య, కీర్తి, సంపదలు లభిస్తాయని శత్రువులు మిత్రులుగా మారతారని పెద్దలు చెప్పారు. ఏ కోరికలతో అమ్మవారిని ప్రార్థిస్తారో ఆ కోరికలన్నీ నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

నైవేద్యం : కదంబం, చక్కెర పొంగలి, పులిహోర, లడ్డు, రవ్వకేసరి, కట్టె పొంగలి

అలంకరించే చీర రంగు : ఎరుపు

అర్చించే పూల రంగు: ఎరుపు

పారాయణ చెయ్యాల్సినవి: చండీ సప్తశతి, లలితా సహస్రనామాలు, ఖడ్గమాల

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది గేమ్	తమిళ చిత్రం	అక్టోబర్ 02
అమెజాన్ ప్రైమ్		
మదరాసీ	తమిళ చిత్రం	అక్టోబర్ 01
ప్లే డర్టీ	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 01
సోనీ లివ్		
థర్టీన్త్	హిందీ సిరీస్	అక్టోబర్ 01
ఈటీవీ విన్		
లిటిల్ హార్ట్స్	తెలుగు చిత్రం	అక్టోబర్ 01

పాలతో బర్ఫీ చేస్తారు. ఆ బర్ఫీకి మామిడి పండు రసం కలిపి.. పైపొరగా వైట్ చాకెలెట్‌ను పూస్తే? మ్యాంగో చాక్‌లెట్ బర్ఫీ అవుతుంది. ఇలా ఇప్పటి దాకా సంప్రదాయ బద్ధంగా తయారవుతున్న రకరకాల స్వీట్స్ కొత్తరూపం సంతరించుకుంటున్నాయి. ఫ్యూజన్ స్వీట్స్ గా విస్తృతప్రచారం పొందుతున్న వీటి తయారీలో స్వీట్స్ స్టోరీస్ అనే సంస్థ ముందుంది. ఇటీవల జరిగిన ఐపీఎల్ సీజన్‌లో సన్ రైజర్స్‌కు ఫుడ్ పార్టనర్‌గా కూడా వ్యవహరించింది. తెలుగువారి రుచులను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లటమే తమ లక్ష్యమనే స్వీట్ స్టోరీస్ యజమాని శ్రీరామ్‌ను 'నవ్య' పలకరించింది.



> నువ్వులు, బెల్లం, నేతితో చేసి లడ్డులు ప్రతి రోజు తింటే మనకు ఒక రోజుకు సరిపడిన ఐరన్ కంటెంట్ దొరుకుతుంది. ఇదే విధంగా శనగపిండిలో చాలా ప్రొటీన్ ఉంటుంది. కానీ దీనిని బాగా డీప్ ఫ్రై చేయటం వల్ల దానిలో ఉన్న పౌష్టికవిలువలు పోతాయి. అలా కాకుండా శనగ పిండి, బెల్లం, నేయ్యిలతో లడ్డులు తయారుచేస్తే చాలా ఆరోగ్యకరమనే చెప్పాలి. నువ్వుల అరిసెలు కూడా ఆరోగ్యమైనవే!

ఫ్యూజన్ స్వీట్స్‌దే భవిష్యత్!



"తెలుగు ప్రజలు అన్ని రకాల పండగలను సెలబ్రేట్ చేసుకుంటూ ఉంటారు. వాటి కోసం చాలా మంది ఇళ్లలోనే స్వీట్స్‌ను తయారుచేసుకుంటారు. అయితే ఈ పండగలే కాకుండా పుట్టిన రోజులు.. పెళ్లి రోజులు వంటి ముఖ్యమైన రోజులు కూడా అనేకం ఉంటాయి. సాధారణంగా ఇలాంటి రోజుల్లో కూడా ఇంటికి ఎవరో ఒకరు వస్తూ ఉంటారు. అలాంటప్పుడు వారికి ఏం పెట్టాలనే విషయంపై చాలా మందికి సందిగ్ధత ఉంటుంది. సమోసాలు, కేక్ వంటివి పెడుతూ ఉంటారు. అలాంటి రోజుల్లో కూడా అందరూ ఇష్టపడే స్వీట్స్‌ను అందించాలనేది మా ఉద్దేశం. దాని కోసమే "ఫ్యూజన్ స్వీట్స్" అనే కాన్సెప్ట్‌ను తీసుకువచ్చాం. దీనికి ఒక ఉదాహరణ చెబుతాను. 'కాజూ కతిలి' అందరూ ఎక్కువగా తినే స్వీట్. కానీ పుట్టిన రోజుల వంటి సమయాల్లో దీనిని తినాలంటే పిల్లలు, యువత ఎక్కువగా ఇష్టపడరు. అందుకోసం మేము 'స్ట్రాబెర్రీ కాజు కతిలి విత్ వైట్ చాక్‌లెట్'ను తయారు చేశాం. కాజు కతిలీలోనే స్ట్రాబెర్రీ పల్ప్ వేసి తయారుచేసి.. దానిపై మళ్లీ ఇంకో పొర వైట్ చాక్‌లెట్ వేస్తాం. దీని వల్ల దానికి ఒక కొత్త రూపు వచ్చింది. అంతే కాకుండా స్ట్రాబెర్రీ ఇష్టం ఉన్నవారు.. చాక్‌లెట్ ఇష్టం ఉన్న వారు కూడా వీటిని బాగా ఆదరించటం మొదలుపెట్టారు. దీని ఆదరణ చూసి పైనాపిల్, హార్లిక్స్, మామిడిపండులతో తయారుచేశాం. ఇదే విధంగా బెల్లంతో కూడా వీటిని తయారుచేస్తున్నాం. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పాలి. ఇప్పుడు తరం వారు ఎక్కువ స్వీట్స్‌ను తినటం లేదు. ఎక్కువగా చాట్‌లను ఇష్టపడుతూ ఉంటారు. వారు ఆదరించకపోతే ఏ బిజినెస్ అయినా నడవటం కష్టం. ఈ మధ్యకాలంలో బ్లూబెర్రీస్, కెన్‌బెర్రీస్ వంటివి కూడా అందరికీ అందుబాటులోకి వస్తున్నాయి. డ్రైఫ్రూట్స్‌ను తప్పనిసరిగా తినమని పౌష్టికాహార నిపుణులు చెబుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని మేము బ్లూబెర్రీ డిలైట్ వంటి ఫ్యూజన్ స్వీట్స్‌ను తయారుచేశాం. దీనిలో కేవలం బ్లూబెర్రీలు, డ్రైఫ్రూట్స్ మాత్రమే ఉంటాయి. మా దగ్గర ఉన్నవాటిలో అత్యంత ఆరోగ్యకరమైన స్వీట్స్‌లో ఇది కూడా ఒకటి. దీనిలో చక్కెర ఉండదు. ఇతర పదార్థాలు ఏమి ఉండవు. తినటానికి కూడా చాలా బావుంటుంది. ఈ తరహా కొత్త కొత్త ఆలోచనలతోనే యువతను ఆకట్టుకోగలుగుతాం.

మనం తినేవన్నీ నేతి స్వీట్స్ కావు..



భారతీయ ఆహారంలో నెయ్యి అనేది చాలా ముఖ్యమైనది. నెయ్యి వల్ల అనేక ఆరోగ్యప్రయోజనాలు కూడా ఎన్నో ఉన్నాయి. పూర్వ కాలం స్వీట్స్‌ను కేవలం నేతితోనే చేసేవారు. నూనెలు మన జీవితంలో ప్రవేశించిన తర్వాత నూనెలతో కూడా స్వీట్స్‌ను తయారుచేయటం మొదలుపెట్టారు. కానీ స్వచ్ఛమైన నేతితో స్వీట్స్‌ను తయారుచేయాలంటే ఎక్కువ ఖరీదు అవుతుంది. అందువల్ల మనకు మార్కెట్లో దొరికే నేతి స్వీట్స్‌లో ఎక్కువ శాతం నూనెతో తయారు చేసినవే! స్వీట్‌ను నేతితో తయారుచేసిన తర్వాత పైన నేతితో పూత పూస్తారు. అందువల్ల తినగానే నేతి వాసన వస్తుంది. పెద్ద పెద్ద బ్రాండ్స్ కూడా ఇలాగే తయారుచేస్తుంటాయి. మేము మా సంస్థను ప్రారంభించే ముందు కొన్ని ట్రైల్స్ వేశాం. దీని కోసం పెద్ద సంస్థలకు చెందిన చెఫ్‌లు వచ్చారు. వాళ్లకు కావాల్సిన పదార్థాలు ఇచ్చినప్పుడు వాళ్లు షాక్ అయ్యారు. "ఇంత నెయ్యి వాడితే మనకు కిట్టుబాటు అవదు" అన్నారు. కానీ సరైన నెయ్యిని వాడకపోతే స్వీట్స్‌కు నిజమైన రుచి రాదు. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పాలి. నేయ్యిల్లో కూడా అనేక రకాలున్నాయి. అన్నింటినీ వేయించటానికి వాడకూడదు. శుద్ధమైన దేశీ నెయ్యిని వేయించటానికి వాడాలి. పూసలు పూసలుగా ఉండే నేతిపై పైన పూతగా రాయటానికి మాత్రమే వాడాలి. ఒకో రకమైన స్వీట్‌కు ఒకో రకమైన నెయ్యిని వాడాలి. ఈ విషయం చాలా మందికి తెలియదు. ఒక ఆసక్తికరమైన సంఘటనను ఇక్కడ పంచుకుంటా. ఐపీఎల్ జరిగేటప్పుడు ఆటగాళ్లు మాత్రమే కాకుండా చాలా పెద్ద టీం వస్తుంది. వాళ్ల ముందే వస్తారు. ఆహారపదార్థాల తయారీలో వారువాడే ముడిసరుకుల విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉంటారు. ఒక రోజు మేము వాళ్లకు అల్పాహారంలో నేతితో చేసిన బెల్లం జిలేబీని పెట్టాం. ఆ టీమ్‌కు చెందిన ఒక పెద్ద అధికారి దానిని తిన్నారు. ఆయన నన్ను వెతుక్కుంటూ వచ్చి - "ఇలాంటి జిలేబీ నేను ఎప్పుడూ తినలేదు. సాధారణంగా ఉత్తరభారత దేశంలో మంచి జిలేబీ దొరుకుతుందంటారు.. అక్కడ కూడా ఇంత రుచి లేదు.. కారణమేమిటి" అని అడిగాడు. "కల్తీ లేని శుద్ధ దేశీనేతితో తయారుచేశాం" అని ఆయనకు సమాధానమిచ్చాను. నా ఉద్దేశంలో ప్రజల్లో తాము తినే ఆహారం పట్ల అవగాహన పెరుగుతోంది. కొత్త కొత్త రుచులను తినటానికి ఇష్టపడుతున్నారు. వాటిని మనం తప్పనిసరిగా అందించాలి. అలాంటప్పుడు ఫ్యూజన్ స్వీట్స్‌దే భవిష్యత్తు అనిపిస్తుంది. అంతే కాకుండా.. మన తెలుగువారికి అద్భుతమైన ఆహార సంస్కృతి ఉంది. దీనిని అంతర్జాతీయ వేదికలపై తీసుకువెళ్లాలనేది మా లక్ష్యం.



లెహరాయీ.. నవరంగ్ లెహంగా..

నీతా అంబానీ అనగానే ప్రత్యేకమైన అవుట్‌ఫిట్స్, అందమైన జ్యువెలరీ కళ్ల ముందు కదలాడతాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆమె ధరించిన బెనారసీ లెహంగా చోళీ పలువురిని ఆకట్టుకుంటోంది. నవరాత్రి గుర్తుగా అమ్మవారి రూపాలకు ప్రతీకగా తొమ్మిది రంగులతో దీన్ని తీర్చిదిద్దారు. దీనికి జతగా గులాబీ రంగు ఎంబ్రాయిడరీ బ్లౌజ్(చోళీ), లెహరియా దుపట్టా ధరించి అందంగా మెరిసిపోయారు నీతా. సాదా మేకప్, చక్కని హెయిర్ స్టయిల్, రాజసం ఉట్టిపడే ఆభరణాలు ఆమెకు మరింత శోభనిచ్చాయి. అమ్మవారిని ఆరాధిస్తూ, గర్బా డ్యాన్స్ చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నీతా ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి. దసరాకి ఈ తరహా లెహంగా కోసం ప్రయత్నాలు మొదలుపెట్టేశారు అమ్మాయిలు.

నవరంగ్ లెహంగా...

● ఇది మోనిక, కరిష్మా రూపొందించిన జేడ్ అవుట్‌ఫిట్. లెహంగా మొత్తాన్ని రంగు రంగుల ప్యూర్ బెనారసి బ్రొకెడ్ క్లాత్‌తో రూపొందించారు. ఒక్కో రంగు మీద కూర్చిన ప్యాచ్ వర్క్‌లు, జరీ వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ వర్క్‌లు అందంగా అమరాయి. లెహంగా అంతటా పరుచుకున్న భారీ లేస్ వర్క్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ లెహంగాకు గులాబీ రంగు బ్లౌజ్ (చోళీ) చక్కగా జతకూడింది. ఈ బ్లౌజ్ మెడ, చేతుల మీద బంగారు, కాంస్య జరీ డిజైన్లను ఒద్దికగా తీర్చిదిద్దారు. సంప్రదాయ టై అండ్ డై పద్ధతిలో రూపొందించిన గులాబీ, నారింజ రంగుల లెహరియా దుపట్టా.. డ్రెస్ అందాన్ని పెంచింది. ఈ దుపట్టా మీద ఉన్న మోటిఫ్‌లు అంచులకు ఉన్న జరీ డిజైన్ కలిసి రాజసాన్ని ఒలికించాయి. ఎంతో ప్రత్యేకంగా రూపొందిన ఈ నవరంగ్ లెహంగా చోళీ ధరించి గుజరాతి సంప్రదాయాన్ని కళ్ల ముందు నిలిపారు నీతా.




సొగసైన సింగారం...

● నీతా పెట్టుకున్న అరుదైన ఆభరణాలు.. పండుగ శోభను ఆవిష్కరించాయి. లెహంగాకు మ్యాచ్ అయ్యేలా వజ్రాలు, పచ్చలు పొదిగిన మూడు వరుసల పెండెంట్ల హారాన్ని ఆమె ధరించారు. హారానికి తగ్గట్టుగా చెవులకు పెద్ద జుంకాలు, పాపిడి మొదట్లో మాంగ్ టిక్కా, చిన్న ముక్కు పుడక, చేతులకు బంగారు కంకణాలతో పాటు గులాబీ రంగు గాజులు, వేళ్లకు పెద్ద ఉంగారాలు అలంకరించుకుని ఎలిగెంట్ రాయల్ లుక్‌తో నిండుగా కనిపించారామె.

● మధ్య పాపిడి తీసిన బన్ హెయిర్ స్టయిల్, నుదుటిమీద ఎర్రని బొట్టు, మస్కారా, ఐ లైనర్, కోల్ ఐడ్, న్యూడ్ లిపిస్టిక్, రేడియంట్ హైలైటర్, లేత గులాబీ రంగు నెయిల్ పాలిష్‌తో ఆమె చేసుకున్న సొగసైన సింగారానికి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

నేటి అలంకారం మహా చండీదేవి





కనకదుర్గానగర్‌లో ఆదిదంపతుల నగరోత్సవం (ఇన్‌సెట్‌లో) లలితా త్రిపురసుందరి దేవిగా దుర్గమ్మ ఉత్సవమూర్తి



క్యూల్లో బారులు తీరిన భక్తులు

ఓవైపు జైభవానీ అంటూ భక్తుల జేజేలు.. మరోవైపు పండితుల మంత్రోచ్చారణలు.. అటువైపు కుంకుమార్చనల ధగధగలు.. ఇటువైపు విద్యుల్లతా హారాల విగనిగలు.. అటుచూస్తే వలంటీర్ల సేవాస్ఫూర్తి.. ఇటుచూస్తే సాంస్కృతిక కార్యక్రమాల దీప్తి, ముత్తయిదు వాయినాలు, సువాసినీ పూజలు, వేదసభలు, నివేదనలు, అన్నప్రసాదాలు, హోమాది క్రతువులు.. ఒక్కటేమిటి.. తెలుగునాట భక్తిభావమంతా ఇంద్రకీలాద్రి వ్యాపితమైందా అన్నట్టుగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం లలితా వదనారవిందాన్ని చూసి తరించేందుకు భక్తులు క్యూ కట్టారు. రాకపోకల్లో హెచ్చుతగ్గులు కనిపించినప్పటికీ దర్శనం మాత్రం సాఫీగానే సాగిపోయింది.

శ్రీలలిత శివజ్యోతి

లలితాత్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ దర్శనం



కుంకుమార్చనలో పాల్గొన్న ఉభయదాతలు



నగరోత్సవంలో కేరళ డ్రమ్స్

ఘనంగా అర్చకసభ

- దర్శనానికి విచ్చేసిన వీఐపీలు.. సినీ ప్రముఖులు
- ఒక్కరోజే లక్షమంది భక్తుల రాక.. రికార్డు
- నేటి నుంచి మరింత పెరిగే అవకాశం
- తగినట్టుగా అధికార యంత్రాంగ ఏర్పాట్లు



అర్చకుల సాధకబాధకాలపై ప్రత్యేక చర్చ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ శనివారం శ్రీలలితా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన డ్యాష్ బోర్డు గణాంకాల ప్రకారం రాత్రి 7 గంటల వరకు 92,360 మంది దుర్గమ్మను దర్శించుకున్నారు. అన్నప్రసాదాన్ని 20,895 మంది స్వీకరించారు. 2,125 మంది కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించారు. 1,74,720 లడ్డూల కొనుగోలు జరిగింది. అమ్మవారిని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, శాప్ చైర్మన్ రవినాయుడు, గాయని సునీత దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ ఆదివారం మహాచండీగా దర్శనమిస్తారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సింగర్ సునీత సందడి

ఎమ్మెల్యే బాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేశినేని శివనాథ్, ముత్తవరపు మురళీకృష్ణ, వసంత కృష్ణప్రసాద్



కళలకు పుట్టినిల్లు కృష్ణాజిల్లా

విజయవాడలో ఉత్సవాలు ఎంతో ఆనందదాయకం

గొల్లపూడి ఎగ్జిబిషన్ ప్రారంభ సభలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం/గొల్లపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనేక కళల పుట్టినిల్లు అయిన భారతదేశం ఒక గొప్ప కళాఖండమని, దేశ నలుమూలలకు భారతఖ్యాతిని ఇనుమడింపజేసిన అనేక మంది కళాకారులకు జన్మస్థలమని ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. విజయవాడ ఎక్స్‌పో (గొల్లపూడి ఎగ్జిబిషన్)ను శనివారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను పునరుద్ధరించడానికి, వాటి ఔన్నత్యాన్ని నేటితరానికి తెలియజేయడానికి విజయవాడ ఉత్సవ్ గొప్ప వేదికైందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా కళలకు పుట్టినిల్లు అన్నారు. సినిమాలకు కేంద్రమైన విజయవాడలో ఇలాంటి కార్యక్రమాలు జరుపుకోవడం మిగతా 8లో..

సరదాగా సంగీతోత్సవ్

విజయవాడ ఉత్సవ్‌లో సుస్వరాల ఝరి



పున్నమిఘాట్‌లో పాటలు పాడుతున్న సమీర భరద్వాజ్

- ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మార్మోగిన సింగర్ సునీత
- పున్నమిఘాట్‌లో సమీరా భరద్వాజ్ పాటల హోరు
- ఘంటసాల కాలేజీలో సాంస్కృతిక సందడి



గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బేతాళ కళాకారులు

విజయవాడ సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మధురమైన పాటలతో 'విజయవాడ ఉత్సవ్' సుస్వరాల ఝరిగా మారింది. గొల్లపూడి ఎగ్జిబిషన్ ప్రాంగణంతో పాటు పున్నమిఘాట్, ఘంటసాల సంగీత కళాశాల పలు సంగీత, నృత్య కార్యక్రమాలకు వేదికలుగా మారాయి. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సింగర్ సునీత బిగ్ మ్యూజిక్ లైవ్ షో జరిగింది. సునీత పాడిన పాటలు యువతను హుషారెత్తించాయి. పున్నమి ఘాట్‌లో సమీరా భరద్వాజ్ మ్యూజిక్ షో, గరగ ఉత్సవ్, దాండియా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముక్కామల గ్రామానికి చెందిన 12 మంది బృందం వేదికపై చేసిన గరగలు ఆశ్చర్యపరిచాయి. మధ్యలో ఇంద్రజాల విద్యను కూడా ప్రదర్శించారు. దుర్గాపురంలోని ఘంటసాల సంగీత, నృత్య కళాశాలలో సైతం సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కనువిందు చేశాయి.



సంగీత కళాశాలలో తోలుబొమ్మలాట



హెలీరైడ్.. యమా క్రేజ్

ఈ దసరాలో ప్రత్యేకంగా..

- నగర సుందర దృశ్యాల వీక్షణ
- రోజుకు 20 ట్రిప్పుల వరకు బుకింగ్
- టికెట్ ధర ఒకరికి రూ.5 వేలు

10


అర్చకుల సంక్షేమానికి కృషి

- దుర్గగుడిలో జరిగిన అర్చక సభలో ఈవో శీనానాయక్

8

పెరుగుతున్న వరద

ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక



శనివారం రాత్రి ఘాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

- భక్తుల భద్రత కోసం పటిష్ఠ ఏర్పాట్లు
- స్నానఘాట్లలో రెండంచెల బారికేడ్లు

విజయవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీకి వరద పెరుగుతోంది. శనివారం రాత్రి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తెలంగాణలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో పెరిగింది. బ్యారేజీకి 3,93,000 క్యూసెక్కుల నీరు వస్తోంది. బ్యారేజీ 69 గేట్లను పూర్తిస్థాయిలోకి ఎత్తి 3.60 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలకు 8,836 క్యూసెక్కుల మిగతా 8లో..



కనులారా వీక్షించి..

- శ్రీలలితా త్రిపుర సుందరీ దేవికి భక్త నీరాజనం
- అమ్మవారి సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రి శనివారం భక్త సంద్రమైంది. శ్రీలలితా త్రిపురసుందరీ దేవిగా కొలువుదీరిన కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ ఎక్కడా క్యూలో భక్తులు వేచి ఉండకుండా ముందుకు కదలడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని కనులారా వీక్షించి తరించారు. వీఐపీల కట్టడితో సామాన్య భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు.
(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

కనకమహాలక్ష్మీ ఆలయం నుంచి కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాలు



కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కనకమహాలక్ష్మీ దేవాలయం ఈవో శోభారాణి, ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి దేవాలయం ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దసరా మహోత్సవాలను పురస్కరించుకుని కనకదుర్గమ్మకు విశాఖపట్నంలో కొలువైన కనకమహాలక్ష్మీ దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. కనకమహాలక్ష్మీ దేవాలయం ఈవో కె.శోభారాణి ఆలయ అధికారులు, అర్చకులతో కలిసి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. ఈవో శోభారాణి మాట్లాడుతూ, ఉత్సవాల సమయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే సత్సంప్రదాయం కొనసాగాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పెద్ద ఎత్తున అధికార యంత్రాంగం చర్యలు చేపట్టినందుకు అభినందనలు చెబుతున్నానన్నారు

ద్వారకా తిరుమల నుంచి..

ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు శనివారం పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ప్రధానాచార్యులు పీపీ సింగరాచార్యులు, వేదపండితుడు వెంకటేశ్వరశర్మ తదితరులతో కలిసి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. ఈవో మూర్తి మాట్లాడుతూ, ద్వారకా తిరుమలలో అక్టోబరు 2 నుంచి పదో తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఆరో తేదీన స్వామివారి కల్యాణం, ఏడో తేదీన రథోత్సవం జరుగుతాయని తెలిపారు.

జల్లుస్నానాల వద్ద అంతరాయం

పాత రాజరాజేశ్వరిపేట : దసరా ఉత్సవాల్లో శనివారం జల్లు స్నానాల వద్ద అంతరాయ ఏర్పడింది. శనైశ్చర స్వామి గుడి ఘాట్ వద్ద ఉదయం 7.40 గంటల నుంచి 8.50 వరకు పైపుల నుంచి నీళ్ల రాకపోవడంతో స్నానాలకు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు మరమ్మతులు నిర్వహించడంతో భక్తులు తిరిగి జల్లు స్నానాలు చేశారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

విజయవాడ (ఇంద్రకీలాద్రి) : ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలలో ఆరో రోజైన శనివారం కనకదుర్గమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికా రు. మీడియా పాయింట్ వద్ద బాలకృష్ణ మాట్లాడుతూ, జగజ్జనని దుర్గమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నానన్నారు. గాయని సునీత అమ్మవారిని దర్శించుకుని వేద ఆశీర్వచనం పొందారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే లు బత్తుల రామకృష్ణ, కూనరవికుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, బ్రాహ్మణ కార్పొరేషన్‌చైర్మన్ బుచ్చి రాం ప్రసాద్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారు స్త్రీ శక్తికి ప్రతీక అని ఎన్‌టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి బాలాత్రిపుర సుందరి రూపంలో ఉన్న కనకదుర్గమ్మవారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. స్త్రీ శక్తి పథకం అమలు చేయడం వల్ల మహిళలు ఆనందంగా అమ్మవారిని దర్శించుకుంటున్నారన్నారు. ప్రజలందరినీ ఆదరించమని, కనికరించమని వేడుకున్నట్లు తెలిపారు.



అమ్మవారి సేవలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, గాయని సునీత, మాట్లాడుతున్న నెట్టెం రఘురాం

ఐదో రోజు ఆదాయం రూ.37.17 లక్షలు

ఇంద్రకీలాద్రి : దసరా మహోత్సవాలలో ఐదో రోజైన శుక్రవారం దుర్గమ్మ దేవస్థానానికి రూ. 37,17,378 ఆదాయం వచ్చినట్లు ఈవో శీనానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లడ్డు ప్రసాద ఒక్కోటి విక్రయం ద్వారా రూ.4,58,676, ఒక్కో ప్యాక్ రూ.100ల లడ్డు ప్రసాదం విక్రయం ద్వారా రూ. 30,42,700 వచ్చినట్లు తెలిపారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన సేవ ద్వారా రూ.33 వేలు (టికెట్ రూ.3000), పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన ద్వారా రూ 5,000 ద్వారా (టికెట్ రూ.5000), చండీ హోమంద్వారా రూ.12 వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన ద్వారా రూ.35,812, పుస్తకాలు, ఫొటోలు, కాలెండర్ల ద్వారా రూ.13,350, తలనీలాల సమర్పణ రుసుం ద్వారా రూ.1,12,840, ఇతరత్రా ఆదాయం రూ.4,000 చొప్పున ఆదాయం వచ్చిందన్నారు.

వినాయకుడి గుడి వద్ద చెప్పుల స్టాండ్



పాయకాపురం : దసరా ఉత్సవాల్లో భాగంగా నగర పాలక సంస్థ అధికారులు వినాయకుడి గుడి వద్ద చెప్పుల స్టాండ్ ఏర్పాటు చేశారు. గుడి వద్ద నుంచే క్యూలైన్లు ప్రారంభం కావడంతో దర్శనానికి వచ్చే భక్తులు అక్కడే రోడ్లపై చెప్పులను వదిలి వెళ్తుండటంతో రోడ్లపై అన్నీ చెప్పులే కనిపిస్తున్నాయి. దీంతో అధికారులు గుడి వద్ద ఏ టు ఎఫ్ ఏడు బ్లాక్‌లుగా చెప్పుల స్టాండ్‌ను ఏర్పాటు చేశారు.

దర్జాగా రోడ్లపై వాహనాల పార్కింగ్

ఎవరు ఏమన్నా మేము ఇక్కడే వాహనాలను పార్క్ చేస్తామంటున్నారు వాహనదారులు. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా పోలీసు అధికారులు రో డ్లపై ఎక్కడా వాహనాలను పార్క్ చేయనివ్వడం లేదు. శనివారం మోడల్ గెస్ట్ హౌస్ వద్ద మాత్రం కొంత మంది దర్జాగా వాహనాలను రోడ్లపై పార్క్ చేశారు

అర్చకుల సంక్షేమానికి కృషి

- వేద మహాసభలో ఈవో శీనా నాయక్



అర్చకులను సత్కరించి మాట్లాడుతున్న దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అర్చకుల సంక్షేమానికి కృషి చేస్తానని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో శీనానాయక్ చెప్పారు. దసరా మహోత్సవాలలో సంప్రదాయంగా జరిగే అర్చక సభ, అర్చక సత్కార కార్యక్రమాలను శనివారం ఆలయంలో నిర్వహించారు. ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ ఎటువంటి ప్రముఖ వ్యక్తి అయినా సరే ఆలయాలకు వస్తే తొలుత సంప్రదించేది అర్చకుడినేనని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ అర్చకులు సాధక బాధలను తెలుసుకోడానికి, వ్యవస్థను మరింత మెరుగ్గా తీసుకురావడానికి ఇటు వంటి సభలు దోహదం చేస్తాయన్నారు. కాలానుగుణ వస్తుల మార్పులు కారణంగా అర్చకత్వం తీసుకోవడానికి చాలా మంది సుముఖత చూపడం లేదన్నారు. విదేశీ సంస్కృతితో మన సంస్కృతి దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అర్చకులదేనని తెలిపారు. దసరాలలో అమ్మవారికి అలంకారాలను నిర్వహిస్తున్న కోట రవికుమార్‌ను సభికులు ప్రశంసించారు. రవి కుమార్ మాట్లాడుతూ. 2009 నుంచి అర్చక సభను నిర్వహిస్తున్నామని, ఇందుకు ఆనాటి పెద్దలు సహకరించారని వారిని గుర్తు చేసుకున్నారు. భద్రాచలం స్థానాచార్యుడు కె.ఈ ఎస్.సాయి మాట్లాడుతూ, అర్చకులకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలని కోరారు. యాదగిరి గుట్ట ప్రధాన అర్చకుడు దోర్భల శ్రీధర శర్మ మాట్లాడుతూ, అమ్మవారి కృప వల్ల అర్చక సభ ఇక్కడ విజయవంతంగా జరుగుతోందన్నారు. తెలంగాణాలో కూడా ఇటువంటి సభ జరగాలని ఆకాంక్షించారు. శ్రీశైల దేవస్థాన ముఖ్య అర్చకులు మాట్లాడుతూ అక్కడ వేద సభ జరుగుతోందని, ఇకపై కూడా జరగాలని ఆకాంక్షించారు. దుర్గగుడి స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, దుర్గగుడి బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ప్రధాన అర్చకుడు ఎల్ దుర్గా ప్రసాద్, ఉపప్రధాన అర్చకులు కోట ప్రసాద్, వై.నాగరాజు శాస్త్రి, ఎంవీ శాస్త్రివి శ్రీధర్‌తదితరులు కార్యక్రమ నిర్వహణ లో సహకరించారు

పోలీసుల అత్యుత్సాహం

దసరా ఉత్సవాలకు ఇతర ప్రాంతాల నుంచి విధులకు హాజరైన కొందరు పోలీస్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఉద్యోగుల వద్ద ఐడీ కార్డులు(పాసులు) ఉన్నప్పటికీ డ్యూటీలకు వెళ్లనీయకుండా అడ్డుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. శనివారంఆలయ ఏఈవోలు, డీఈలు, వీఐపీలకు ఇచ్చే లడ్లు తీసుకుని సిబ్బంది, ఇతర విభాగాలకు చెందిన సుమారు 20 మంది మహా మండపం దిగువన లిఫ్టులు నుంచి కొండపైకి వెళ్లడానికి ప్రయత్నించారు. అయితే అక్కడ విధుల్లో ఉన్న డీఎస్పీ దినేష్ వారిని పైకి వెళ్లకుండా అడ్డుకున్నారు.

పెరుగుతున్న వరద

(7వ పేజీ తరువాయి)

నీటిని వదులుతున్నారు.

భక్తులు నదిలోకి దిగొద్దు : కలెక్టర్ లక్ష్మీశ

ఎగువ నుంచి వరద ప్రవాహం వస్తున్న నేపథ్యంలో దసరా ఉత్సవాలకు వచ్చే భక్తుల భద్రతకు పగడ్బందీ చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శనివారం రాత్రి ఆయన దుర్గా ఘాట్, భవానీ ఘాట్, సీతమ్మ వారి పాదాలు తదితర ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు సూచనలు చేశారు. భక్తుల భద్రతకు తీసుకోవాల్సిన అదనపు చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఘాట్లలో రెండంచెల బారికేడింగ్ ఏర్పాట్లు చేశామని, జల్లుస్నానాలు చేసేందుకు అన్ని వసతులతో ఏర్పాట్లు ఉన్నాయన్నారు. ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తులు కూడా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సూచనలను పాటించాలని, వరదనీటిలో దిగే సాహసం చేయొద్దని సూచించారు.

కిలారుడీ సీతయ్య

- లండన్‌లో పీహెచ్‌డీ..ప్రొఫెసర్‌గా వృత్తి
- కలెక్టర్ కావాలన్న కలలు కల్లలు
- ఉద్యోగం మానేసి బెట్టింగ్ యాప్స్‌పై దృష్టి
- నకిలీ ఆఫర్ లెటర్లతో నిరుద్యోగులకు మోసం
- ప్రొఫెసర్లకు రూ.2.46 కోట్ల మేర మోసం
- పెదకమ్మవారిపాలెంలో అరెస్టు





పోలీసుల అదుపులో నిందితుడు సీతయ్య

నందిగామ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యనభ్యసించి ఆచార్యుడిగా జీవితం ప్రారం భించిన యువకుడు అడ్డదారిలో అక్రమార్జనకు దిగి కటకటాల పాలయ్యాడు. కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన కిలారు సీతయ్య చిన్నతనం నుంచి విద్యలో చురుకుగా ఉండేవాడు. లండన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన తిరిగి వచ్చిన సీతయ్య కొంత కాలం హైదరాబాద్‌లో ప్రొఫెసర్‌గా పని చేశాడు. కలెక్టర్ కావాలన్న ఆశయంతో సివిల్స్ వైపు దృష్టి సారించిన సీతయ్య మొదటి పర్యాయమే ఇంటర్వ్యూ వరకూ వెళ్లి సెలెక్ట్ కాకపోవడంతో మనస్తామని గురై చేసే ఉద్యోగం కూడా వదలేశాడు. ఈ క్రమంలోనే కుటుంబ కలహాలు ఏర్పడడంతో పూర్తిగా కుంగిపోయిన సీతయ్య వీడియో గేమ్స్, బెట్టింగ్ యాప్స్ వైపు మళ్లాడు. అక్కడ నుంచే అతని పతనం మొదలైంది. యాప్‌ల ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడడం మొదలెట్టాడు. జాబ్ పోర్టల్ నుంచి అభ్యర్థుల వివరాలు సేకరించి నకిలీ ఆఫర్ లెటర్స్ పంపిస్తూ వారి వద్ద నుంచి భారీగా డబ్బు గుంజాడు. వీటిపై 2023లోనే అతనిపై కేసు నమోదై జైలు వెళ్లి వచ్చాడు. బయటకు వచ్చిన తర్వాత కూడా అతని తీరు మారలేదు. పూణేలోని ప్రముఖ విశ్వవిద్యాలయం వీసీ, ప్రొఫెసర్ లను మభ్యపెట్టి తాను ఐఐటీ బాంబే ప్రొఫెసర్‌నని, పూణె యూనివర్శిటీకి రూ.28 కోట్లు ఫండ్ ఇస్తానని నమ్మబలికి తొలుత రూ.2.46 కోట్లను తన అకౌంట్‌కు జమ చేయించుకున్నాడు. కేసు నమోదు కావడంతో పూణే పోలీసులు సీతయ్యను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా ఈనెల 22న కమ్మవారిపాలెంకు తీసుకువచ్చి ఇక్కడి బ్యాంక్ అకౌంట్‌లు, ఇతర ఆస్తుల వివరాలు తెలు సుకున్నారు. సీతయ్యతో పాటు ఆయన తండ్రిని కూడా అదుపులోకి తీసుకొని పూణే తరలించారు. ఈ ఘటనతో నందిగామ ప్రాంతం ఉలిక్కిపడింది. సీతయ్య వంటి మేధస్సు ఉన్న వ్యక్తులు మోసాలకు పాల్పడం విస్మయాన్ని కలిగిస్తుందని గ్రామస్థులంటున్నారు.

కళలకు పుట్టినిల్లు కృష్ణాజిల్లా

(7వ పేజీ తరువాయి)

ఆనందదాయకమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, వాటిని అధిగమించేందుకు సీఎం చంద్రబాబు రోజుకు 24 గంటల పనిచేస్తున్నారని చెప్పారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కేన్సర్ చిక్సితను తక్కువ ధరకు అందించేందుకు తుళ్లూరులో బసవతారకం కేన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. విజయవాడ ఉత్సవ్ కమిటీ చైర్మన్ ముత్తవరపు మురళీకృష్ణ, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సినీ, రాజకీయ, సేవారంగాల్లో బాలకృష్ణ విశేష సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. 50 ఏళ్లుగా హీరోగా నటిస్తూ గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించడం గర్వకారణమన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్‌లో గొల్లపూడిని భాగస్వామ్యం చేయడం ఆనందదాయకమన్నారు. 70 ఏళ్ల నుంచి ఇక్కడి భూమిని కౌలు చేసుకుంటున్న రైతులు.. అడిగిన వెంటనే 10 నిమిషాల్లో స్థలం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. గ్రేటర్ విజయవాడలో భాగంగా వచ్చే దసరా ఉత్సవాల నాటికి కొండపల్లి వరకు విజయవాడలో కలుస్తుందన్నారు. అమ్మవారి సన్నిధిలోకి గొల్లపూడే కాకుండా మైలవరం నియోజకవర్గం కూడా వస్తుందని చెప్పారు.

దక్షిణ భారతదేశంలోనే విజయవాడ ఓ మంచి నగరం అవుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. చంద్రబాబు, లోకేశ్ కృషితో విజయవాడ ఉత్సవాలు రానున్న రోజుల్లో మరింత వన్నె తెస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, శ్రీరామ్ రాజగోపాల్, కూటమి నేతలు కొమ్మారెడ్డి పట్టాభి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బొమ్మసాని సుబ్బారావు, జంపాల సీతారామయ్య, నల్లా వాసు, నూతలపాటి బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి గోపాలకృష్ణారావుకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందిస్తున్న ఆలయ పర్యవేక్షకులు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు

మోపిదేవి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి వి.గోపాలకృష్ణారావు కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు న్యాయమూర్తి దంపతులకు అందజేశారు. తహసీల్దార్ ఎం.హరనాథ్ వెంటఉన్నారు.

అభయాంజనేయ స్వామి సేవలో హైకోర్టు జడ్జి మల్లిఖార్జునరావు



స్వామిని దర్శించుకుంటున్న జడ్జి మల్లిఖార్జునరావు దంపతులు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి తల్లాప్రగడ మల్లిఖార్జునరావు దంపతులు శనివారం జంక్షన్ అభయాంజనేయ స్వామిని దర్శనం చేసుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మారపల్లి సీతారామానుజాచార్యులు అర్చనలు జరిపారు. న్యాయమూర్తి దంపతులను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జంక్షన్ ఎస్సై వి.సురేష్, సిబ్బంది న్యాయమూర్తికి సాదర స్వాగతం పలికారు.

మాదకద్రవ్యాల విక్రేత అరెస్టు


పాయకాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగర శివార్లలో మాదకద్రవ్యాలు అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుణదలకు చెందిన తుప్పలపూడి దుర్గారావు(27) టైల్స్ పని చేస్తుంటాడు. బెంగుళూరు నుంచి డ్రగ్స్ (ఎండీఎంఏ) తెచ్చి నగర శివారు ప్రాంతాల్లో విక్రయాలు జరుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ కృష్ణమోహన్ తన సిబ్బందితో అతనిపై నిఘా పెట్టారు. పాయకాపురం శివారులో శనివారం ఎండీఎంఏను విక్రయించేందుకు వచ్చిన దుర్గారావును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద సుమారు రూ.లక్ష విలువ చేసే 13 గ్రాములు ఎండీఎంఏ డ్రగ్ గుర్తించి కేసు నమోదు చేశారు. డ్రగ్‌ను బెంగుళూరు నుంచి తెచ్చి నగర శివారుల్లో విక్రయిస్తున్నట్లు గతంలో కూడా విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు.



మీన్స్ కమ్ మెరిట్ మెటీరియల్, కౌశల్-25 పోటీల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ బాలాజీ, డీఈవో రామారావు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ పరీక్షకు విద్యార్థులు హాజరు కావాలి : కలెక్టర్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్షకు విద్యార్థుల హాజరు కావాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. జాతీయ అవార్డు గ్రహీత ఎం.శ్రీనివాసరావు రూపొందించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష మెటీరియల్‌ను ఆయన ఆవిష్కరించారు. భారతీయ విద్యా మండలి, ఏపీ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కౌశల్-2025 పోటీల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. డీఈవో పి.వి.జె.రామారావు మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు కౌశల్- 2025 క్విజ్, పోస్టర్ల పోటీలు నవంబరు 27న 8, 9 తరగతుల విద్యార్థులకు, 28న 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. తాళ్లపాలెం టీచర్ ఝాన్సీలక్ష్మీబాయి, జిల్లా సైన్స్ ఆఫీసర్ జకీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



ఒడిశా, యూపీకి చెందిన పాత నేరస్థులను విచారిస్తున్న ఏడీసీపీ ఎం.రాజారావు

దుర్గగుడి పరిసరాల్లో ప్రత్యేక నిఘా

- పోలీసుల అదుపులో పాత నేరస్తులు

సత్యనారాయణపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి పరిసరప్రాంతాల్లో నేరాలు నిరోధించేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. కనకదుర్గానగర్‌లో అడిషనల్ డీసీపీ (క్రైమ్) ఎం.రాజారావు నేతృత్వంలో పోలీసులు మఫ్టీలో ఉండి అనుమానాస్పదంగా ఉన్న వారిని మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ (ఎమ్ఎస్‌సీడీ) ద్వారా ఫింగర్ ప్రింట్ తీసుకొని చెక్ చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వినాయకుడి గుడి వద్ద శనివారం పాత నేరస్తులు ఒడిశాకు చెందిన రాజీవ్ మహారణ, యూపీకి బలరాం ప్రజాపతి, తిరుమలలో టూటౌన్‌లో రెండు కేసులు తిరుపతికి చెందిన మురళీకృష్ణను, నేరాలకు పాల్పడే యువతిని అదుపులోకి తీసుకున్నారు. వీరందరినీ కనకదుర్గానగర్ పోలీసు పోస్టు వద్ద విచారణ చేస్తున్నారు.

అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

విజయవాడస్పోర్ట్స్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌ను బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్‌తో కలసి శాప్ చైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. రెండు పలు జిల్లాల నుండి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

ఆసియా చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ డబుల్స్ కాంస్య పతక విజేత ఎస్.అనుష, జూనియర్ నేషనల్స్ బంగారు పతక విజేత ఆరోన్‌లను సత్కరించారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ



భారతీనగర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): లిటిల్ హోప్ ట్రస్ట్, మణికొండ జోన్స్ ఆధ్వర్యంలో రూ.25వేలతో కొనుగోలు చేసిన స్కూల్ బ్యాగ్‌లను శనివారం ఆటోనగర్ సమీపంలో, మధురానగర్, గిరిపురం తదితర ప్రాంతాల్లో ఉంటున్న పేద విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ దేవినేని అపర్ణ పాల్గొని విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను అందజేశారు.

ఆటోనగర్‌లో రూ. 3.10 కోట్ల ఆస్తిపన్ను వసూలు

● ఐలా కమిషనర్ కె. బాబ్జీ

ఆటోనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జవహర్ ఆటోనగర్‌లో ఈఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ. మూడు కోట్ల పది లక్షలు ఆస్తిపన్ను వసూలు చేసినట్లు ఐలా సర్వీస్ కమిషనర్ కె. బాబ్జీ చెప్పారు. శనివారం ఆయన జవహర్ ఆటోనగర్‌లోని తన కార్యాలయలో విలేకరులతో మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 4.82 కోట్లు ఆస్తిపన్ను డిమాండ్ ఉందని, పాతబకాయిలు రూ. 2.45కోట్లు కలిసి మొత్తం రూ. 7.27కోట్లు ఆస్తిపన్ను రావాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు రూ. 3.10కోట్లు ఆస్తిపన్ను అనగా 43 శాతం వసూలైందని తెలిపారు. లబ్ధిదారులు పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను చెల్లించాలని కోరారు. ఈఏడాది మొదటి అర్థసంవత్సరానికి అపరాధ రుసుం లేకుండా పన్ను చెల్లించేందుకు తుది గడువు జూన్‌తో ముగిసిందని, నెలకు రెండు శాతం చొప్పున అపరాధ రుసుంతో హౌస్‌హోల్డర్స్ ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉందన్నారు.
రెండవ అర్థసంవత్సరమైన అక్టోబరు నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ఆస్తిపన్నును అపరాధ రుసుం లేకుండా ఈఏడాది డిసెంబరులోపు చెల్లించాలని ఐలా కమిషనర్ బాబ్జీ తెలిపారు. లేకుంటే అపరాధ రుసుంతో పన్ను చెల్లించాలని ఆయన చెప్పారు.

భారతీనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలోని పలు దేవాలయాలలో ఆరో రోజు శనివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు దేవాలయాల వద్ద బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గుణదల పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని శ్రీమద్దిరావమ్మ తల్లి దేవస్థానంలో, కరెన్సీనగర్ దాసాంజనేయ స్వామి ఆలయంలో, ఆర్‌ఆర్ గార్డెన్‌లోని శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ వేడుకలు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ● పటమట దర్శిపేటలోని శ్రీరాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కమిటీ అధ్యక్షుడు ఆవుల నాసరయ్య ఆధ్వర్యంలో అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. కానూరు బసవ పున్నారావు, ధనలక్ష్మీ దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పటమట దత్తపీఠంలోని శ్రీమరకత రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి 1008 చీరలతో పూజ నిర్వహించారు. **ఆటోనగర్:** ఆటోనగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి పూజలు, దీపాలంకణ సేవ నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రాణిగారితోట: రాణిగారితోటలోని మహాశక్తి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్పొరేటర్ అడపా శేష ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. **కృష్ణలంక:** త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారు భక్తులకు లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ● కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. **మొగల్రాజపురం:** మొగల్రాజపురం ధనకొండ అమ్మవారిని శ్రీ లలితా త్రిపురా సుందరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా వేడుకల్లో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. అమ్మవారికి నీలం రంగువస్త్రంతో అలంకరణ చేశారు. సాయంత్రం లలితాపారాయణం, హారతులు సమర్పించారు. అనంతరం అమ్మవారిని గాయత్రీనగర్, మొగల్రాజపురంలో ఊరేగించారు. శుక్రవారం వేదిక అలంకార దాతగా శ్రీధర్ సీసీఈ వారు, స్వర్ణాభరణ అలంకరణ దాత బొంబే జ్యూయలర్స్ వారు ఉన్నారు. **రామలింగేశ్వర నగర్:** పటమట ఎన్‌ఎస్‌ఎం స్కూల్ పక్కన కొండిన్యనగర్‌లో దేవీ భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారు శీ కాత్యాయనీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు లడ్డూ ప్రసాద వితరణ, తీర్థ ఆశీర్వచనాలు, సాయంత్రం కుంకుమ పూజ నిర్వహించారు.

లలితా త్రిపుర సుందరీ దేవిగా జగజ్జనని



ఆటోనగర్‌లో, కరెన్సీనగర్‌లో, గుణదలలో, పటమట దర్శిపేటలో, దత్తపీఠంలో లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు



సిద్ధార్థ హోటల్ మేనేజ్ మెంట్ కళాశాల మైదానంలో



త్రిశక్తిపీఠంలో, కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో, రాణిగారితోటలో, మొగల్రాజపురం ధనకొండ అమ్మవారు, దేవీభక్త బృందం ఆధ్వర్యంలో

నేటి నుంచి జాతీయ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్

మొగల్రాజపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి నాలుగు రోజుల పాటు 6వ జాతీయ జూనియర్(14 నుంచి 18), సీనియర్-సీ (45 నుంచి 55) జాతీయ యోగాసన చాంపియన్ షిప్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. కళాశాల ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యోగాసన భారత్ అధ్వర్యంలో రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 618 మంది క్రీడాకారులు, వంద మంది కోచ్‌లు మేనేజర్‌లు పాల్గొంటారని చెప్పారు. పోటీల నిర్వహణకు వంద మంది వలంటీర్‌లు, అఫీషియల్స్ విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ పోటీల నుంచి అంతర్జాతీయ యోగాసన పోటీల్లో పాల్గొనే జట్టును ఎంపిక చేస్తామని చెప్పారు. అనంతరం పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రయోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షురాలు ఎ.రాధిక, కార్యదర్శి పి.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్ రెడ్డి, యోగాసన భారత్ స్పోర్ట్స్ కన్సల్టెంట్ శ్రేయాస్ మార్కండేయ, భారత్ స్వాభిమాన్ ట్రస్టు ఉపాధ్యక్షుడు డి.దుర్గారావు, జిల్లా యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షుడు కొంగరసాయి, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ తదితరులు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆయుధ పూజ



కళాశాలలో పూజ చేస్తున్న విభాగాధిపతులు, సిబ్బంది

భారతీనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల్లో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.విజయ సారథి ఆధ్వర్యంలో దుర్గా దేవి, సరస్వతిదేవికి కుంకుమ పూజ, వర్క్‌షాప్‌లోని యంత్రాలకు ఆయుధపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం తదనంతరం విద్యార్థులు తయారు చేసిన బంకర్ బెడ్స్‌ని ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు ఏ.శివప్రసాద్, వెంకటేశ్వర్‌రెడ్డి, కట్లయ్య, పద్మసుభాషిణి, బాబూరావు, శైలజ, వర్క్‌షాప్ సూపరింటెండెంట్ బి.బి.ఆర్.కే.ప్రసాద్, రాంబాబు, నాగరాజు, సత్యనారాయణ, నాగార్జున, రవి, విద్యార్థులు, వర్క్‌షాప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే కలలను సాధించొచ్చు

విద్యార్థులకు సినీ నటుడు బాబుమోహన్ హితవు



సినీ నటుడు బాబుమోహన్‌ను సత్కరిస్తున్న కరస్పాండెంట్ రెక్స్ ఏంజెలో, ప్రిన్సిపాల్ మెల్చియర్

భారతీనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యువత సృజనాత్మకతో పాటు పోటీ ప్రపంచాన్ని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడానికి ధైర్యంగా ఉండాలని సినీనటుడు పి. బాబుమోహన్ తెలిపారు. ఆంధ్ర లయోలా కళాశాల వార్షిక సాంస్కృతిక, సాహిత్య ఉత్సవ స్ఫూర్తి 2కె25 కార్యక్రమం శనివారం ఫాదర్ దేవయ్య ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బాబుమోహన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి తాను కనే కలను కష్టపడితే సాధించవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. క్విజ్, నృత్యం, సంగీతం, పెయింట్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రెక్స్ ఏంజెలో, ప్రిన్సిపాల్ మెల్చియర్, ఫాదర్ జాన్, స్టూడెంట్ యాక్టివిటీస్ డీన్ డాక్టర్ ఎల్. శుభ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు కౌన్సెలింగ్ రేపు

భారతీనగర్,సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2025-26/27కు నాల్గో విడత అడ్మిషన్ల కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 29 ఉదయం 8గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో చేరదలచిన అభ్యర్థులు సర్టిఫికెట్లలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ పొందిన అభ్యర్థులలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మినహా మిగిలిన కేటగిరి అభ్యర్థులు రూ.60 కాషన్ డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు టెన్త్ మార్కుల జాబితా, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆర్థికంగా బలహీనమైన విభాగం (ఈడబ్ల్యూఎస్ పత్రం), ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్స్, అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 0866-2475575, 9490639639, 7780429468 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వాంగ్‌చుక్‌ను తక్షణమే విడుదల చేయాలి

గాంధీనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రామన్ మెగసెస్ అవార్డు గ్రహీత సోనం వాంగ్‌చుక్‌పై దేశద్రోహం చట్టం కింద అరెస్టు చేయడాన్ని పలువురు వక్తలు తీవ్రంగా ఖండించారు. తక్షణమే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లడఖ్ ప్రజాస్వామ్య ఉద్యమ సంఘీభావ సమావేశం ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమ్‌ఆద్మీ పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ నేత నేతి మహేశ్వరరావు మాట్లాడుతూ వాంగ్‌చుక్‌ను దేశద్రోహం కింద అరెస్టు చేయడం ప్రజల గొంతు నొక్కడమేనని అన్నారు. దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ వాంగ్‌చుక్ అరెస్టు దేశ ప్రజాస్వామ్య పతనానికి సూచిక అన్నారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నేత హరిబాబు మాట్లాడుతూ ఆయన విడుదల అయ్యేంత వరకు బౌద్ధులు శాంతియుతంగా సంఘీభావం ప్రకటిస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ నేత కొసనం రాము, ఆప్ నేత పర్వతనేని హరికృష్ణ, జైభీమ్‌రావు భారత్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలి

వ్యవస్థాపక అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు

ధర్నాచౌక్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు బేడ (బుడ్గ)జంగం కులానికి ఆన్‌లైన్‌లో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 1950 నుంచి తమ కులం ఎస్సీ జాబితాలోనే కొనసాగుతుందని, గత వైసీపీ ప్రభుత్వం తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో ఎస్సీ రిజర్వేషన్లు అనుభవిస్తున్నామని అభియోగాలు మోపి 2023 నుంచి ఆన్‌లైన్‌లో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు నిలుపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

కాళికామాత ఆలయంలో చిన్నారుల నాట్య ప్రదర్శన

వన్‌టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బస్టాండ్ సమీపంలోని కాళికామాత గుడి (త్రిశక్తిపీఠం)లో దసరా ఉత్సవాల సందర్భంగా శనివారం నవదుర్గా నాట్యధార్మిక సంస్థ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అకుల శ్రీనివాస కుమార్ చిన్నారులను ప్రశంసించారు. వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. నాట్యాచార్యులు ఎస్‌కే విశ్వనాథశాస్త్రి, ఎస్.సుధారాణి, దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ అల్లం పూర్ణచంద్రరావు, రెడ్డిపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు





- పున్నమిలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు
- ఘంటసాలలో అలరించిన పౌరాణికాలు
- తుమ్మలపల్లిలో ఘల్లుమన్న జానపదం
- సంగమంలో ఆకట్టుకున్న కోలాట ప్రదర్శనలు





ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ /విజయవాడ కల్చరల్: సాంస్కృతిక ఆనందం పతాక స్థాయికి చేరింది. ఆకాశమే హద్దుగా ఆనందం ఉప్పొంగింది. విజయవాడ ఉత్సవ్ జోష్ సరికొత్త రూపం సంతరించుకుంది. పున్నమిఘాట్‌లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు, దాండియా ఓలలాడించగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జానపదాలు ఝల్లుమన్నాయి. సంగీత కళాశాలలో పౌరాణిక నాటకాలు రక్తికట్టించగా పవిత్రసంగమంలో కోలాట నృత్యాలు సందడి చేశాయి కనక దుర్గానగర్‌లో దేవీస్తుతి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పున్నమిఘాట్‌లో..

విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా శనివారం రాత్రి పున్నమిఘాట్ సందడిగా మారింది. పవిత్ర కృష్ణాతీరం వద్ద జరిగిన సాంస్కృతిక విందు ఆధ్యాత్మికత, కళ, వినోదం ప్రేక్షకులను అలరించింది. నలందా టీమ్ మహిళా బృందం ప్రదర్శించిన 'అయిగిరి నందిని' నృత్యం వేదికను మంత్రముగ్ధం చేసింది. శక్తి స్వరూపిణి మహాదేవి వైభవాన్ని ప్రతిబింబిస్తూ ఆ బృందం సమన్వయంతో చేసిన ఆరాధనాత్మక నృత్యం ఘాట్ వాతావరణాన్ని ఆధ్యాత్మికతతో నింపింది. చిన్నా పెద్దా అందరూ కలిసి ఆడిపాడుతూ వేదికను భక్తిరసంతో నింపారు. కృష్ణా తీరం మీద ఆకాశాన్ని వెలుగులతో అలరించిన డ్రోన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.స్థానిక కళాకారులు ప్రదర్శించిన గరగల నృత్యం సంప్రదాయ కాంతిని చాటింది. తాళం, లయ, శక్తి సమన్వయంతో సాగిన ఈ నృత్యం ఉర్రూతలూగించింది. ప్రముఖ గాయని సమీరా భరద్వాజ్ లైవ్ పెర్ఫార్మెన్స్ ఘాట్ సందడిని మరింత పెంచింది. ఆమె అద్భుతమైన గాత్రంతో భక్తి, సినీ పాటలు పాడగా ప్రేక్షకులు ఉత్సాహంగా ఆలకించి చప్పట్లతో అభినందించారు.

పవిత్ర సంగమంలో..

పవిత్ర సంగమంలో జానపదం ఘల్లుమంది. కొండపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో దసరా నవరాత్రుల పురస్కరించుకొని నిర్వహిస్తున్న విజయనర్తనంలో భాగంగా 6వ రోజు శనివారం ఆరు బృందాలు జానపద ప్రదర్శనలిచ్చి ప్రేక్షకులను తన్మయులను చేశారు. నగరానికి చెందిన సుభద్ర, శాంభవి బృందం ప్రదర్శించిన కోలాటం ఉర్రూత లూగించింది. కళాక్షేత్ర డాన్స్ అకాడమీ బృందం ప్రదర్శించిన నాట్యాలు ఆకట్టుకున్నాయి. అనురాధ శిష్య బృందంచే కూచిపూడి, జానపదం అలరించగా, మంజుల పద్మజా హైదరాబాద్ బృందం గరిమెల్ల పద్మప్రియ వరంగల్ బృందం కూచిపూడి జానపదం నృత్యాలు ప్రదర్శించి మైమరపించారు. కళాకారులను కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ రమ్య కీర్తన సత్కరించారు.

ఘంటసాల సంగీత కళాశాలలో..

హైదరాబాద్‌కు చెందిన కళాక్షేత్రం బృందం ఆంధ్ర నాకెంతో కుంభహారతి ఆనంద నర్తన గణపతి అష్టదిక్పాలక, దశావతారాలు అంశాలతో అలరించారు. తదుపరి ఉషామాధవి కూచిపూడి నాట్యం నర్తించారు. తదుపరి రాజమండ్రి చెందిన సుబ్బలక్ష్మి బుర్రకథ గానం చేశారు. దక్ష యజ్ఞం కథను గానం చేస్తుండగా శ్రీనివాసరాజు, లోవరాజు వంతకులుగా సహకరించారు. కాకినాడ ఏవీ సుబ్బారావు ప్రదర్శించిన తోలు బొమ్మలాట ఆకట్టుకుంది. చివరిగా ప్రదర్శించిన శ్రీకృష్ణ తులాభారం పౌరాణిక నాటకం రక్తి కట్టించింది.



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

దళిత సింధూరి సోలో నాట్యంతో సంధ్య తాండవం చేయగా, ఆగిరిపల్లికి చెందిన దేవీ భవాని తన బృందంతో గణపతి స్తుతి బాలా త్రిపుర సుందరి కీర్తనలకు నయనానందకర నర్తించి అలరించారు. సత్యనారాయణపురం ఘంటసాల సంగీత కళాశాల విద్యార్థుల బృందం వీణ వాదనతో శ్రోతలను పరవశింపజేశారు. త్యాగరాజ కృతులను అత్యంత మాధురీయంగా వేణువాదలతో వినిపించారు. కోనసీమకు చెందిన వీబీఎస్‌వీ కుమార్ ఆలయ సంప్రదాయ నృత్యం అయిన గరగలతో బృంద నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. విశాఖపట్నా చెందిన అత్తరు హౌస్సెస్ మ్యాజిక్ షో ప్రేక్షక ప్రశంసలు అందుకుంది. రాజమండ్రికి చెందిన అనపర్తి భీమన్న తోలుబొమ్మలాట రామాయణం అంశంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఇంద్రకీలాద్రిపై..

దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కొండ దిగువన ఏర్పాటు చేసిన కళా వేదికపై కళా బృందాలు తమ కళలను ప్రదర్శిస్తూ జగన్మాతకు కళా నీరాజనాలు సమర్పిస్తున్నారు. ఉదయం 10 నుంచి కృష్ణాజిల్లా చల్లపల్లికి చెందిన బీ సామా జ్యం బృందం తాళం భజన, తూర్పు గోదావరి జిల్లా అన్నవరం వెంపటి లలితా నాగమణి బృందం భక్తి సంగీతం, విజయవాడకు చెందిన పీ సాత్విక్ మహాదేశ్వర్ భక్తి రంజని కార్యక్రమం, వీ నీరజ బృందం గాత్ర కచేరి హృద్యంగా సాగాయి. మధ్యాహ్నం విశాఖపట్నానికి చెందిన తులసి భాగవతారిణి గానం చేసిన రుద్రాక్షమహిమ అనే హరికథ భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఎం పార్వతి, సౌందర్య, పూజ శ్రీ, విజయ గౌరీ, పావనీ లత, లలితా దేవి బృందాలు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి.

విజయవాడ ఉత్సవ్‌లో నేటి ప్రదర్శనలు

విజయవాడ: విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా 7వ రోజు ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాలు

గొల్లపూడిలో ఆదివారం సాయంత్రం ప్రముఖ సింగర్ రామ్ మిరియాల లైవ్ మ్యూజిక్ కన్సర్ట్, **పున్నమిఘాట్‌లో** కాళిక వేషాల ప్రదర్శన, కాంతార పెర్ఫామెన్స్, సందీప్ నారాయన్ లైవ్ మ్యూజిక్ షో, దాండియా డీజే, **తుమ్మలపల్లి వేదికగా..** సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌కు చెందిన నాట్యాచారిణి స్నేహలత బృందంతో కూచిపూడి నాట్య ప్రదర్శన, 6.30 గంటలకు సంగీత కచేరి, రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన లేఖ్యభరణి కూచిపూడి నృత్యప్రదర్శన, 7.30 గంటలకు వెంకట్ మ్యాజిక్ షో, 8 గంటలకు కోనసీమ జిల్లాకు చెందిన పీబీసీకే కుమార్‌తో గరగలు ప్రదర్శన, 8.30 గంటలకు పెద్దాపురానికి చెందిన వనపర్తి కోటేశ్వరరావు బృందంతో తోలుబొమ్మలాట, 9 గంటలకు ఆయాచితల కల్చరల్ ఫౌండేషన్, విజయవాడ వారి సాంఘిక హాస్య నాటిక పెళ్లి

ఘంటసాల ప్రభుత్వ కళాశాల వేదికగా..

సాయంత్రం 6 గంటలకు నగరానికి చెందిన యామిని సిస్టర్స్ శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, 6.30 గంటలకు జీవీఆర్ సంగీత, మ్యూజిక్ కచేరి, రాత్రి 7 గంటలకు బి.వెంకట రామశర్మ కూచిపూడి నృత్య ప్రదర్శన, 7.30 గంటలకు నెల్లూరుకు చెందిన డి.హరిబాబు హాస్యవల్లరి, 8 గంటలకు తాడేపల్లిగూడెంకు చెందిన వై.విజయ్‌కుమార్ ఫోక్‌సాంగ్స్, 8.30 గంటలకు శ్రీ సమతా నాటక గురుకుల నాట్యమండలి, గుంటూరు వారిచే చారిత్రక నాటకం పల్నాటి యుద్ధం.



ఆకట్టుకున్న మహిషాసుర మర్దినీ నృత్య రూపకం

ఇబ్రహీంపట్నం, సెపెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడి ఎగ్జిబిషన్‌లో సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా సత్య మాస్టర్ బృందం చేసిన మహిషాసురమర్దిని నృత్య రూపకం భక్తులను, వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మహిషాసురిడ్ని వధించే తీరు కళాకారులు కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ నృత్యరూపకం చూసిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అలాగే కాళికామాత వేషధారణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. డప్పు వాయిద్యాల మధ్య కాళికామాత వేషధారణలో ఉన్న కళాకారులు చేసిన నృత్యంతో ఎక్స్‌పో ప్రారంభమైంది. నిర్వాహకులు శ్రేయస్ శ్రీనివాస్‌ను కళాకారులు ఆశీర్వదించారు. ఎక్స్‌పోకు వస్తున్న ముఖ్య అతిథులకు, వీవీఐపీలకు, వీఐపీలకు, ప్రతి ఒక్కరికీ స్వాగతం పలికేందుకు స్వాగత ద్వారం వద్ద ఉంచిన దసరా వేషగాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఊపేసిన సింగర్ సునీత పాటలు

- జన్మనిచ్చిన భూమి విజయవాడ అంటూ భావోద్వేగం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎక్స్‌పో (గొల్లపూడి ఎగ్జిబిషన్) శనివారం సింగర్ సునీత లైవ్ మ్యూజిక్ షో భక్తులను, యువతను విశేషంగా ఆకట్టుకుంది. తొలి పాటగా తన సహచర సింగర్ ధనుంజయ్‌తో ఆమె పారాణి పాదాల బాలాకృతి పరమందు కొలువైన పరమేశ్వరి అని అమ్మవారిపై పాడిన పాటతో వీక్షకులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. దసరా వచ్చిందయ్యా సరదా తెచ్చిందయ్యా, ఓంకార నాదాలు సంధానమో గానమే, మధుర మధుర మీనాక్షి అనే భక్తి పాటలు పాడారు. అనంతరం యువత కోసం అందంగా లేనా అసలేం బాలేనా, చిన్ని చిన్ని ఆశ చిన్నదని ఆశ ముద్దు ముద్దు ఆశ ముత్యమంత ఆశ, కమ్మనీ ప్రేమ లేఖనే రాసింది హృదయమే, అవును నిజం నువ్వంటే నాకిష్టం పాటలు పాడారు. మొత్తం 30 పాటల వరకు పాడి యువతను, ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.

నా జన్మస్థలం విజయవాడ

నేను పుట్టి పెరిగి సంగీతం నేర్చుకున్న విజయవాడలో గానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని సింగర్ సునీత భావోద్వేగానికి గురయ్యారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని, విజయవాడలో ఉండి ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకుంటున్న మీరంతా అదృష్టవంతులన్నారు. నాలా ఎందరో సింగర్స్ విజయవాడ నుంచి రావాలని ఆకాంక్షించారు.

హెలీరైడ్.. యమా క్రేజ్

విజయవాడ కల్చరల్: విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా నగరంలో నిర్వహిస్తున్న హెలికాప్టర్ రైడ్స్‌కు యమా క్రేజ్ నెలకొంది. హెలికాప్టర్ ఎక్కేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సెప్టెంబర్ 22 నుంచి ప్రారంభమైన ఈ రైడ్స్ అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నారు. కృష్ణానది, ప్రకాశం బ్యారేజ్, భవానీ ద్వీపం, దుర్గగుడి ప్రాంతం, గాంధీహిల్ మీదుగా నగర సుందర, పర్యాటక దృశ్యాలను ఆకాశం నుంచి ఆస్వాదించే అవకాశాన్ని అందిస్తున్నాయి. రోజుకు 17 నుంచి 20 ట్రిప్‌ల వరకు బుకింగ్‌లు జరుగుతున్నాయి. శనివారం, ఆదివారం అయితే ఈ ట్రిప్పుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని నిర్వాహకులు సూర్య తెలిపారు. ప్రతి రైడ్‌లో పైలట్ తప్ప 6 మంది ప్రయాణికులు పాల్గొనవచ్చునన్నారు. వాతావరణం పరిస్థితుల్ని బట్టి రోజుకు 45 ట్రిప్పుల వరకు వేయగల సామర్థ్యం ఉందన్నారు. 6 నుంచి 7 నిమిషాల వరకు హెలీ రైడ్ ఉంటుంది. స్టేడియం నుంచి ప్రారంభమౌతాయి. టికెట్ ధర ఒక్కొక్కరికి రూ.5వేలుగా నిర్ణయించారు.



హస్తకళలను కాపాడుకోవాలి

- సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి

విద్యాధరపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతిలో భాగమైన హస్తకళలను కనుమరుగు కాకుండా కాపాడుకోవాలని సీఆర్‌మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ అన్నారు. భవానీపురంలోని బెరంపార్కులో శనివారం హస్తకళాకారులకు నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో భిన్న జాతులు, సంస్కృతుల మధ్య ఏకత్వానికి హస్తకళారూపాలు, నాట్య, సంగీత, సాహిత్యాలు తోడ్పతాయన్నారు. వెనకటి తరాల నుంచి వారసత్వంగా వచ్చిన కళను భావితరాలకు అందించాల్సి ఉందన్నారు. అమెజాన్ వంటి సంస్థల ద్వారా మన కళారూపాలు దేశ, విదేశాల్లో ఖ్యాతి పొందేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకు దోహదం చేయడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి వర్క్‌షాపులు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రొఫెసర్ ఎం ఆదినారాయణ పలు సూచనలు చేశారు. ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ సీనియర్ కన్సల్టెంట్ పీ సుధీర్ కుమార్, సీఆర్ మీడియా అకాడమీ మేనేజర్ ఎం భాస్కర నారాయణ పాల్గొన్నారు.

న్యాయవాదుల డెత్ బెనిఫిట్ పెంపును స్వాగతించిన ఐలూ

విజయవాడ లీగల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల డెత్ బెనిఫిట్‌ను రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షలకు, మెడికల్ బెనిఫిట్‌ను రూ.1.50 లక్షల నుంచి 2.50 లక్షలకు పెంచుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్ణయం తీసుకోవడంపై అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) రాష్ట్ర అధ్యక్షుడు కే కుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవరావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్‌ను రూ.9లక్షలకు పెంచేలా, ప్రభుత్వం నుంచి రావాల్సిన డెత్ బెనిఫిట్ బకాయిలను మృతిచెందిన సుమారు 1,175 మంది న్యాయవాదుల కుటుంబాలకు తక్షణం చెల్లింపులు చేసేలా ప్రభుత్వంపై బార్ కౌన్సిల్ ఒత్తిడి తేవాలని ఐలూ డిమాండ్ చేసింది. ఎన్టీఆర్ ఆరోగ్య భరోసా స్కీంను న్యాయవాదులకు వర్తించేలా, అర్హులైన జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ చెల్లించేలా, ఇళ్లస్థలాలు కేటాయించేలా ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ఐలూ నేతలు డిమాండ్ చేశారు.

పరిష్కారం కాని అమరావతి రైతుల సమస్యలు

- విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి

వన్‌టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి రైతుల సమస్యలు ఇంతవరకు పరిష్కారం కాలేదని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి శనివారం అసెంబ్లీ సమావేశంలో జీరో అవర్‌లో ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా ఇంతవరకు రైతుల పెండింగు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ ప్రస్తావన తెచ్చానని, స్పీకర్ చర్చ పెడదామన్నారు కానీ అమలు కాలేదన్నారు. రుషికొండ నిర్మాణంలో పర్యావరణ అనుమతుల విషయంలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. దీనిపై 15 నెలల క్రితమే స్పీకర్‌కు 3 పేజీల లేఖ రాశానన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను అక్రమంగా విధుల నుంచి తొలగించి ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలిగించిన సాయి ప్రసాద్‌కు ప్రస్తుత ప్రభుత్వం పదోన్నతి ఇచ్చి కీలక పదవికి పోస్ట్ చేసినట్టు తెలిసింది. ఇది వాస్తవమైతే ఆయన్ను ఎన్నికల విధుల నుంచి దూరంగా ఉంచి చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో ఆయన కోరారు.

దివ్యాంగులకు కొండంత కష్టం..!

- ఇంద్రకీలాద్రిపై దివ్యాంగులకు ఇబ్బందులు
- బ్యాటరీ కారు ఉన్నా తప్పని కష్టాలు

ఆంధ్రజ్యోతి - విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దివ్యాంగులకు కష్టాలు తప్పడం లేదు. అమ్మవారి దర్శనానికి వచ్చిన వారికి ఓం మలుపు నుంచి కష్టాలు మొదలవుతున్నాయి. దివ్యాంగులు, వృద్ధులకు దేవస్థానం అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. బస్సులో ఎక్కిన వారిని ఘాట్ రోడ్డు మీదుగా ఓం మలుపు వద్దకు తీసుకువెళ్లి అక్కడ దింపేస్తున్నారు. అక్కడి నుంచి వికలాంగులను డోనార్స్ సెల్ వరకు తీసుకెళ్లడానికి దేవస్థాన అధికారులు బ్యాటరీ కారు నడుపుతున్నారు. ఓం మలుపు వద్ద వారిని ఎక్కించుకుని డోనార్స్ సెల్ వరకు తీసుకెళ్తుంది. అక్కడి నుంచి పోలీసు సేవాదళ్ సేవకులు వీల్‌చైర్‌లో వారిని దర్శనానికి తీసుకెళ్తారు. అధికారులు ఒక బ్యాటరీ కారును మాత్రమే నడుపుతుండడంతో దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఓ దివ్యాంగుడు ఇద్దరు పిల్లలతో దర్శనానికి వచ్చాడు. బ్యాటరీ కారు కోసం ఓం మలుపు వద్ద చాలాసేపు వేచి చూశాడు. ఎంతకీ రాకపోవడంతో ఆయన తన ఇద్దరు పిల్లలతో పాకుతూ వెళ్లాడు. అతడి వెనుక నుంచి న్యాయశాఖకు చెందిన రెండు వాహనాలు వెళ్లాయి. బ్యాటరీ కారు చార్జింగ్ అయిపోవడంతో నడపలేదని సిబ్బంది చెప్పినట్టు ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. దసరా ఉత్సవాలు ముగిసే వరకు ఓం మలుపు వద్ద మరో బ్యాటరీ కారును ఏర్పాటు చేయాలని దివ్యాంగులు, వృద్ధులు కోరుతున్నారు. దీనితోపాటు వీల్‌చైర్లను డోనార్స్ సెల్ దగ్గరే కాకుండా ఓం మలుపు వద్ద ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సినీనటుడు అవసరాల శ్రీనివాస్

సాహిత్యంతో సమాజ గమనంలో మార్పు

- నటుడు, దర్శకుడు, రచయిత అవసరాల శ్రీనివాస్

నందిగామ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజ గమనంలో సాహిత్యం మార్పు తీసుకువస్తుందని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు, రచయిత అవసరాల శ్రీనివాస్ అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త సూర్యదేవర రామకృష్ణ రచించిన ఐదు రచనలను శనివారం ఆయన నందిగామలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, ఆరోగ్య అంశాల్లో ప్రజలకు అవగాహన కల్పించేలా సూర్యదేవర రచనలన్నాయన్నారు. సూర్యదేవర రచనలు సాహితీ ప్రేమికులనే కాకుండా సమాజానికి దిశా నిర్దేశం చేస్తాయన్నారు. రచయిత సూర్యదేవర రామకృష్ణ మాట్లాడుతూ రచనలలో సారం వివరిస్తూ భావోద్వేగానికి లోనై పూర్తిగా అధ్యయనం చేసి ఈ కావ్యాలు రచించినట్టు చెప్పారు. తన జీవితకాల పర్యంతం ప్రజాహితానికి దోహదపడే కవితలు రాయాలన్న సంకల్పంతో ఉన్నట్టు చెప్పారు. అనంతరం ఆయన రచించిన సమాజ హితం కోసం, అవసరాలకు మించి తినడం, ఆధునిక మనిషి దుస్థితి, దేవుని పూజలో నేటి హంగులు- ఆర్భాటాలు, హ్యూమానిటీ వర్సెస్ గాడ్, పీస్ ఆఫ్ మైండ్, నేటి రాజకీయాలు ఐక్యతకు విఘాతం అనే రచనలను ఆవిష్కరించారు. నందిగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాలాప్రసాద్, కోయ మహేష్ పాల్గొన్నారు.

కొత్త బస్సులు కొనుగోలు చేయండి

- మంత్రి అచ్చెన్నాయుడుకు యూనియన్ నేతల విజ్ఞప్తి

బస్టేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం సమర్థ అమలుకు కొత్త బస్సులను కొనుగోలు చేయాలని ప్రజారవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు మంత్రి అచ్చెన్నాయుడుకు తెలిపారు. శనివారం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, సీసీఎస్ పాలకవర్గ సభ్యుడు అనంతరాములు, వినోద్‌కుమార్ బృందం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా స్త్రీ శక్తి పథకం అమలులో సహకరిస్తున్నందుకు కృతజ్ఞతగా మంత్రిని సత్కరించారు. అనంతరం ఆయనకు వివిధ సమస్యలను వివరించారు. స్త్రీ శక్తి పథకం అమలుకు కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, వాటి నిర్వహణ ఆర్టీసీ కిందే ఉంచాలని కోరారు. అలాగే ఉద్యోగ నియామకాల ప్రక్రియను చేపట్టాలని కోరారు. ఏపీఎస్‌ఆర్‌టీసీ క్రెడిట్ కోఆపరేటివ్ స్టోర్స్‌ను చక్కగా నిర్వహిస్తున్నందుకు సీసీఎస్ కమిటీని మంత్రి అభినందించారు. 2022 సెప్టెంబరు నెలలో ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేసిన రూ 61.20 కోట్లను సీసీఎస్‌కు జమచేసేలా చూడాలన్నారు. మంత్రి స్పందిస్తూ గతంలోనూ ఈ అంశం తన దృష్టికి వచ్చిందని, ఆ వివరాలను తెలుసుకోవాలని తన పీఏను ఆదేశించారు. ఇదే సమయంలో నేతలిచ్చిన వినతి పత్రాలపై ఎండార్స్ చేశారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ప్రజా రవాణా సంస్థ ఎన్‌ఎంయూ నేతలు

కృష్ణా మిల్క్ యూనియన్‌లో
అక్రమాలపై చర్యలు తీసుకోండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్‌లో జరుగుతున్న అక్రమాలపై తక్షణమే విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ వర్షాకాల సమావేశాల్లో భాగంగా శనివారం పలు అంశాలపై అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీ మ్యాక్స్ చట్టం ప్రకారం పలు డివిజన్లుగా పనిచేస్తోందని కృష్ణాజిల్లాలో కృష్ణా మిల్క్ యూనియన్‌గా సహకార రంగంలో ఉన్నట్టు వివరించారు. కృష్ణా మిల్క్ యూనియన్ దాణా కర్మాగారం నిర్మించేందుకు బాపులపాడు మండలం వీరవల్లిలో పొలం కొనుగోలు చేయగా అక్కడ పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీ నిర్మించారన్నారు. భూమి కొనుగోలులో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని యార్లగడ్డ సభ దృష్టికి తెచ్చారు. 2019లో ఎన్నికల ఫలితాలు వెలువడే ఒకరోజు ముందు యూనియన్ చైర్మన్‌గా ఎన్నికైన వ్యక్తి తనకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదని తాను పాలపార్టీగా ప్రకటించుకుంటూ వైసీపీ నేతలు, కార్యకర్తలకు కంపెనీలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇవ్వటమే కాకుండా పాల బూత్‌లు సైతం వైసీపీ వాళ్లకే ఇచ్చారని ఆరోపించారు. వీటన్నింటిపై 6 నెలల క్రితమే పూర్తి ఆధారాలు అందజేశానన్నారు. రాష్ట్రంలోని పురావస్తుశాఖ ఆధీనంలోని ద్రాక్షారామం, భీమేశ్వరాలయం, గుడిమల్లం తదితర శైవ ఆలయాల్లో అనునిత్యం పంచామృత అభిషేకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు.

చర్యలు తీసుకుంటాం: మంత్రి అచ్చెన్నాయుడు

యూనియన్ అక్రమాలపై యార్లగడ్డ విజ్ఞప్తికి స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు సదరు ఆరోపణలపై విచారణ జరుగుతుందని నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నాటికి జనసేన బలోపేతం

- ఎమ్మెల్సీ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

విద్యాధరపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నాటికి జనసేన బలోపేతం కానున్నదని ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో శనివారం ఆయన జనసేన జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ బలోపేతమవుతుందని ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా ఉంటాయన్నారు. డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సహాయ సహకారాలతో తాను పాల్గొన్నానన్నారు. కూటమి పార్టీలతో పొత్తు ధర్మం పాటిస్తూనే జనసేనను బలోపేతం చేస్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానుతో పార్టీలోని అన్నివిభాగాల వారు, కేడర్లు సమన్వయం చేసుకోవాలన్నారు. ఉదయభాను మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో క్రమశిక్షణ కలిగిన జన సైనికులు జిల్లా అంతటా ఉన్నారన్నారు. కూటమి అధికారంలో ఉన్న కారణంగా ఐక్యంగా కొనసాగుతూనే పార్టీని ముందుకు తీసుకుని పోవాలన్నది పవన్ కల్యాణ్ లక్ష్యమన్నారు. పంచకర్ల సందీప్, చల్లపల్లి శ్రీనివాసరావు, తమ్మిరెడ్డి శివశంకర్, పాపారావు, బండి రామకృష్ణ, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, అక్కలగాంధీ, మహదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, పెదబాబు, తంబళ్లపల్లి రమాదేవి, రావి సౌజన్య, మల్లెపు విజయలక్ష్మి, తిరుపతి అనూష భారీగా కార్యకర్తలు పాల్గొన్నారు

వెస్టిండీస్‌కు నేపాల్ షాక్

తొలి టీ20లో 19 పరుగులతో గెలుపు

షార్జా: పసికూన నేపాల్ జట్టు అంతర్జాతీయ క్రికెట్‌లో పెను సంచలనం సృష్టించింది. బలమైన వెస్టిండీస్‌కు షాకిచ్చింది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో నేపాల్ 19 పరుగులతో విండీస్‌ను చిత్తుచేసింది. దీంతో ఐసీసీ సభ్య దేశంపై తొలి గెలుపును అందుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట నేపాల్ 20 ఓవర్లలో 148/8 స్కోరు చేసింది. కెప్టెన్ రోహిత్ పౌడెల్ (38), కుశాల్ మల్లా (30), గుల్షన్ ఝా (22) సత్తా చాటారు. హోల్డర్ 4, నవీన్ బిదిశీ 3 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 129/9 స్కోరుకే పరిమితమైంది. నవీన్ బిదిశీ (22) టాప్ స్కోరర్. అమీర్ (19), ఫాబియన్ (19), కెప్టెన్ అకీల్ హొసేన్ (18), కార్టీ (16), అకీమ్ (15) రాణించినా.. క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకోవడంతో విండీస్‌కు పరాభవం తప్పలేదు. కుశాల్ 2 వికెట్లు తీశాడు. రోహిత్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

వరల్డ్ రికార్డు ముంగిట అభిషేక్

భారత్-పాక్ ఫైనల్లో అభిషేక్ శర్మ ప్రపంచ రికార్డు సాధించే అవకాశముంది. అతనిప్పటికే టీ20ల్లో వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో 30 ప్లస్ స్కోర్లు సాధించి రోహిత్, రిజ్వాన్ సరసన చేరాడు. ఫైనల్ మ్యాచ్‌లో కూడా అభిషేక్ 30 ప్లస్ స్కోరు చేస్తే ప్రపంచ రికార్డు అవుతుంది.

నక్వీ ఇస్తే..ట్రోఫీ తీసుకుంటారా?

దుబాయ్: ఆసియాకప్ ఫైనల్లో గెలిచిన జట్టుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మొహిసిన్ నక్వీనే ట్రోఫీ అందిస్తాడు. ఎందుకంటే అతనే ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్. ఈనేపథ్యంలో ఒకవేళ భారత్ విజేతగా నిలిస్తే ఏసీసీ చైర్మన్ హోదాలో నక్వీ చేతుల మీదుగా కెప్టెన్ సూర్యకుమార్ కప్‌ను తీసుకుంటాడా? నక్వీకి షేక్‌హ్యాండ్ ఇస్తాడా? అనే చర్చ జరుగుతోంది. భారత్‌తో పాటు బీసీసీఐని కూడా బాహాటంగా విమర్శించే నక్వీ పాకిస్థాన్ ప్రభుత్వంలో మంత్రిగానూ కొనసాగుతున్నాడు.

కెప్టెన్ల ఫొటోషూట్ రద్దు

ఏదైనా టోర్నీ ఫైనల్‌కు ముందు ఇరు జట్ల కెప్టెన్లు ట్రోఫీతో ఫొటో దిగడం పరిపాటి. అయితే ఈసారి ఫొటోషూట్‌ను రద్దు చేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. పాక్‌తో వేదిక పంచుకునేందుకు భారత జట్టు నిరాకరించినట్టు సమాచారం.

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



'పాకిస్థాన్ మాకు పోటీయే కాదు..' అని భారత కెప్టెన్ సూర్యకుమార్ ధీమాగా చెప్పాడు. అయినా.. యుద్ధభూమిలోనే కాదు, క్రికెట్ మైదానంలోనూ ఆ జట్టును చిత్తుగా ఓడిస్తే తనివితీరా చూసి ఆనందించాలన్నది అభిమానుల ఆకాంక్ష. అందుకే పాక్‌తో ఆడే ప్రతీ మ్యాచ్‌నూ వారు భావోద్వేగంతో తిలకిస్తుంటారు. పైగా ఈసారి కరచాలన వివాదం, రెచ్చగొట్టే చేష్టల వ్యవహారం సరేసరి.. ఈ నేపథ్యంలో ఆదివారం ఇరు జట్ల మధ్యే ఆఖరి సమరం జరుగబోతోంది. ఈ కీలక మ్యాచ్‌లోనూ 'ఫైనల్' పంచ్ తమదే అవ్వాలని టీమిండియా భావిస్తోంది. అటు గతమెలా ఉన్నా ఈసారి మాత్రం ప్రత్యర్థికి చాన్స్ ఇవ్వకూడదని పాక్ కసితో ఉంది.

మూడోసారీ మోతెక్కించాలి!

ఆసియాకప్

నేడు పాక్‌తో భారత్ టైటిల్ ఫైట్

తీవ్ర ఒత్తిడిలో దాయాది ● హార్దిక్ ఆడేనా?

దుబాయ్: దాదాపు ఏకపక్ష మ్యాచ్‌లతో.. అక్కడక్కడా ఉత్కంఠభరిత క్షణాలతో సాగిన ఆసియాకప్ ఆఖరి అంకానికి చేరుకుంది. 41 ఏళ్ల టోర్నీ చరిత్రలో భారత్-పాక్ జట్లు తొలిసారి ఫైనల్లో తలపడబోతున్నాయి. దీంతో ఆదివారం జరిగే ఈ హైవోల్టేజి సమరంపై ఆసక్తి రెట్టింపయ్యింది. టోర్నీలో భారత్ ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఓటమనేదే లేకుండా తుది పోరుకు అర్హత సాధించగా, అటు పాక్ ఓడిన రెండు మ్యాచ్‌లు భారత్ పైనే కావడం గమనార్హం. ఏదిఏమైనా ఆపరేషన్ సిందూర్ ప్రభావం ఈ ఆసియాకప్‌పై గట్టిగానే పడిందని చెప్పవచ్చు. కరచాలనం నిరాకరణతో పాటు గ్రూప్ మ్యాచ్‌లో పాక్‌ను ఓడించాక కెప్టెన్ సూర్య తమ విజయాన్ని సైనికులకు అంకితమిచ్చాడు. దీనికి ప్రతిగా అన్నట్టు సూపర్-4 మ్యాచ్‌లో ఫర్హాన్ గన్‌ఫైర్ సంబరాలు, రౌఫ్ 6-0 సంకేతాలు భారత అభిమానుల భావోద్వేగాలను రెచ్చగొట్టినట్టయ్యింది. ఇరు బోర్డుల పరస్పర ఫిర్యాదులతో ఐసీసీ జరిమానాలు కూడా విధించింది. వ్యవహారం ఇంతవరకూ వచ్చాక ఫైనల్లో ఆ ప్రభావం ఎలా ఉండబోతున్నదనే సందేహం అందరిలో నెలకొంది. ఓవరాల్‌గా టీ20ల్లో ఆడిన 15 మ్యాచ్‌ల్లో భారత్ 11-3తో పాక్‌పై స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. ఓ మ్యాచ్ టైగా ముగిసింది. అదే ఆసియా కప్‌లో ఆడిన ఐదు టీ20 మ్యాచ్‌ల్లోనూ 4-1తో భారత్‌దే పైచేయి.

గాయాలతో ఆందోళన

ఫైనల్‌కు ముందు భారత్‌ను గాయాల బెడద వేధిస్తోంది. శ్రీలంకతో మ్యాచ్‌లో హార్దిక్ తొడకండరాలు పట్టేయడంతో ఒక్క ఓవర్‌కే పరిమితమై మైదానం వీడాడు. దీంతో ఫైనల్లో అతడు బరిలోకి దిగడం సందేహంగా మారింది. ఆదివారం ఉదయం పాండ్యాపై ఓ అంచనాకు రానున్నట్టు బౌలింగ్ కోచ్ మోర్కెల్ తెలిపాడు. అభిషేక్ సైతం కండరాల నొప్పితో శ్రీలంక ఇన్నింగ్స్ పదో ఓవర్‌లో గ్రౌండ్‌ను వీడి తిరిగి రాలేదు. అయితే తను బాగానే ఉన్నట్టు మోర్కెల్ ప్రకటించడం సానుకూలాంశం కానుంది. ఎందుకంటే అభిషేక్ భీకర ఫామ్‌ను చూసే పాక్ జట్టు భయపడుతోంది. భారత్ కూడా అతడి మెరుపు ఆరంభాలపైనే అతిగా ఆధారపడింది. గిల్, కెప్టెన్ సూర్య అంచనాలను అందుకోలేకపోతున్నారు. ఒకవేళ అభిషేక్ విఫలమైతే పరిస్థితి ఏమిటనేది జట్టు ఆలోచించాల్సిన విషయం. లంకపై శాంసన్, తిలక్‌లకు మాత్రం తగిన మ్యాచ్ ప్రాక్టీస్ లభించింది. ఇద్దరూ స్వేచ్ఛగా ఆడగలిగారు. మరోవైపు బౌలింగ్‌లో మరింత ప్రభావం చూపాల్సిన అవసరం ఉంది. ఇప్పటిదాకా ఆడిన మ్యాచ్‌ల్లో భారత బౌలర్లు 60 వికెట్లకు 41 మాత్రమే తీయగలిగారు. యూఏఈ, బంగ్లా జట్లను మాత్రమే ఆలౌట్ చేయగలిగారు. స్పిన్నర్ కుల్దీప్ 13 వికెట్లతో నిలకడగా రాణిస్తున్నా అతడికి సహకారం కరువైంది. స్పిన్ పిచ్‌లపైనా వరుణ్ ఐదు, అక్షర్ నాలుగు వికెట్లతో సరిపెట్టుకున్నారు. అటు పేసర్ బుమ్రా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు తీసినా అతడి నుంచి జట్టు మరింతగా ఆశిస్తోంది. ఫైనల్లో తన సత్తాకు తగ్గట్టు రాణిస్తే పాక్‌ను కట్టడి చేయవచ్చు. దూబే స్థానంలో అర్ష్‌దీప్‌నే కొనసాగిస్తారా? అనేది వేచిచూడాల్సిందే.

బ్యాటింగ్‌లో రాణిస్తేనే..

పాకిస్థాన్ బ్యాటింగ్ ఆర్డర్‌లో నిలకడైన బ్యాటర్ కనిపించడం లేదు. బుమ్రాను దీటుగా ఎదుర్కొన్న ఓపెనర్ ఫర్హాన్ కాస్త మినహాయింపు. సయీమ్ అయూబ్ 6 మ్యాచ్‌ల్లో 23 పరుగులే చేయగా ఇందులో 4 డకౌట్లున్నాయి. తలత్, కెప్టెన్ సల్మాన్ స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తడబడుతున్నారు. చివర్లో షహీన్ అఫ్రీది బ్యాటింగ్ మెరుపులే ఆ జట్టుకు కీలక పరుగులు అందిస్తున్నాయి. అయితే పేసర్లు షహీన్, రౌఫ్ ఆకట్టుకుంటున్నారు. వీరు భారత టాపార్డర్‌ను ఆరంభంలోనే దెబ్బతీస్తే లో స్కోరింగ్ మ్యాచ్‌కు అవకాశం ఉంటుంది. సయీమ్ బౌలింగ్‌లో మాత్రం రాణిస్తూ 8 వికెట్లు తీయగలిగాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, శాంసన్, హార్దిక్, అక్షర్, కుల్దీప్, వరుణ్, బుమ్రా, అర్ష్‌దీప్/దూబే.

పాకిస్థాన్: ఫర్హాన్, ఫఖర్ జమాన్, సయీమ్ అయూబ్, సల్మాన్ ఆఘా (కెప్టెన్), తలత్, మహ్మద్ హారిస్, నవాజ్, సుఫియాన్, షహీన్ అఫ్రీది, హారిస్ రౌఫ్.

వావ్.. శీతల్



పారా ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణంతో చరిత్ర

మొత్తం 3 పతకాలతో అదరగొట్టిన కశ్మీర్ ఆర్చర్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): భారత ఆర్చర్ శీతల్ దేవి చరిత్ర సృష్టించింది. ప్రపంచ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో ఆమె పసిడి పతకం కొల్లగొట్టింది. తద్వారా ఈ టోర్నీ కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం గెలిచిన చేతులు లేని తొలి మహిళా ఆర్చర్‌గా శీతల్ రికార్డు నెలకొల్పింది. 18 ఏళ్ల శీతల్ హోరాహోరీ ఫైనల్లో 146-143తో వరల్డ్ నెం.1 ఆర్చర్ ఒజ్నూర్ క్యూర్ గిర్డి (టర్కీ)ని చిత్తుచేసి ప్రపంచ టైటిల్ అందుకుంది. అంతేకాదు..మిక్స్‌డ్, మహిళల టీమ్ విభాగాల్లోనూ పతకాలు సాధించి మొత్తం మూడు మెడల్స్‌తో అదరగొట్టింది. జమ్మూ కశ్మీర్‌కు చెందిన శీతల్ పాదాలు, భుజం ఉపయోగించి బాణాలు సంధిస్తుంది. టోర్నీలో చేతులు లేకుండా పోటీపడుతున్న ఏకైక ఆర్చర్ దేవినే కావడం విశేషం. పారా ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో గతంలో చేతులులేని ఆర్చర్ పతకం గెలవడం పురుషుల విభాగంలో చోటుచేసుకుంది. ఇక, తాజా టోర్నీ పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత ఆర్చర్ తోమన్ కుమార్ పసిడి పతకంతో మెరిశాడు. ఫైనల్లో భారత్‌కే చెందిన రాకేశ్ కుమార్ పోటీ నుంచి వైదొలగడంతో తోమన్‌కు స్వర్ణం దక్కింది. పసిడితో చరిత్ర సృష్టించిన శీతల్.. తోమన్ జతగా కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్యం అందుకుంది. కాంపౌండ్ మహిళల టీమ్ కేటగిరీ ఫైనల్లో ఓటమి చవిచూసిన శీతల్/సరిత జోడీ రజతంతో సరిపెట్టుకుంది.



దీప్తికి రజతం

ప్రపంచ పారా అథ్లెటిక్స్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో తెలంగాణకు చెందిన దీప్తి జీవాంజి రజతంతో మెరిసింది. శనివారం జరిగిన మహిళల 400 మీటర్ల టీ20 విభాగం రేసులో దీప్తి 55.16 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచింది. వరంగల్ జిల్లాకు చెందిన 22 ఏళ్ల దీప్తి గతేడాది ఈ టోర్నీలో విజేతగా నిలిచింది. కానీ, ఈసారి రజతానికే పరిమితమైంది. ఇక, నిరుడు రన్నరప్‌గా నిలిచిన టర్కీ రేసర్ ఐసెల్ ఆండర్ 54.96 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం సొంతం చేసుకొంది. కాగా, పురుషుల హైజంప్ టీ63 కేటగిరీలో విజేతగా నిలిచిన శైలేష్ కుమార్ ఈ టోర్నీలో భారత్‌కు తొలి పసిడి పతకాన్ని అందించాడు. భారత్‌కే చెందిన వరుణ్ సింగ్ భాటి కాంస్యం దక్కించుకొన్నాడు. 1.91 మీటర్ల ఎత్తు దూకిన శైలేష్ చాంపియన్‌షిప్స్ ఆసియా రికార్డును బద్దలుకొట్టాడు. భాటి, ఎజ్రా ఫ్రెంచ్ (అమెరికా) 1.85 మీటర్లతో సమంగా నిలిచారు. కానీ, కౌంట్ బ్యాక్‌లో ఎజ్రాకు రజతం, భాటికి కాంస్యం దక్కాయి.

అల్‌కాబీ ప్రపంచ రికార్డు: యూఏఈ అథ్లెట్ తెక్రా అల్ కాబీ మహిళల 100 మీ టీ71 ఫ్రేమ్ రన్నింగ్ ఈవెంట్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 19.89 సెకన్లలో రేస్‌ను పూర్తి చేసిన అల్‌కాబీ..ఈ ఏడాది బెల్లా మార్కస్ (లిథువేనియా-20.08 సె) రికార్డును అధిగమించింది.

రష్మిక జోడీకి స్వర్ణం

షూటింగ్ జూ. వరల్డ్‌కప్

న్యూఢిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు టాప్-2తో అదరగొట్టగా.. స్కీట్‌లో రైజా ధిల్లాన్ రజతం సాధించింది. శనివారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో సహచర భారత జోడీల మధ్య జరిగిన ఫైనల్లో రష్మిక సెహగల్-కపిల్ జంట 16-10తో వన్షిక చౌదరి-ఆంథోనీ జొనాథన్ జంటపై గెలిచి స్వర్ణం సాధించింది. మహిళల స్కీట్ ఫైనల్లో ధిల్లాన్ రజతంతో సరిపెట్టుకొంది. మాన్సీ రఘువంశీ కాంస్యం దక్కించుకొంది. దీంతో భారత్ మూడు స్వర్ణాలు సహా 11 పతకాలతో అగ్రస్థానంలో ఉంది.

'శాఫ్' విజేత భారత్

కొలంబో: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 చాంపియన్‌షిప్‌ను భారత్ గెల్చుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో యువ భారత్ 4-1తో పెనాల్టీ షూటౌట్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించింది. నిర్ణీత సమయానికి ఇరుజట్లు స్కోర్లు 2-2తో సమంగా ఉన్నాయి. కాగా, ఈ టైటిల్ నెగ్గడం భారత్‌కిది ఏడోసారి.

బిజినెస్ ప్లస్

ఇరాక్‌లో 'అపోలో' వైద్య సేవలు


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్స్ తన వైద్య సేవలను ఇరాక్‌కు విస్తరిస్తోంది. ఇందుకోసం ఆ దేశానికి చెందిన అంతర్గత మంత్రిత్వ శాఖతో ఒక వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా అపోలో హాస్పిటల్స్.. ఇరాక్ అంతర్గత భద్రతా దళాల హాస్పిటల్ నిర్వహణ చేపట్టడంతో పాటు ఆ దేశ భద్రతా దళాలు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అత్యాధునిక వైద్య సేవలు అందిస్తుందని అపోలో జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు. కాగా 'హీల్ ఇన్ ఇండియా, హీల్ బై ఇండియా, హీల్ ఫ్రమ్ ఇండియా' అనే తమ నినాదంలో భాగంగా తమ వైద్య సేవలను ఇరాక్‌కు విస్తరిస్తున్నట్టు అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు.

ఎన్‌టీపీసీ రూ.3,248 కోట్ల తుది డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి దిగ్గజం ఎన్‌టీపీసీ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.3,248 కోట్ల తుది డివిడెండ్‌ను అందించింది. ఎన్‌టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్.. విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్‌కు ఈ డివిడెండ్ చెక్‌ను అందజేశారు. కాగా గత ఏడాది నవంబరులో రూ.2,424 కోట్లు, ఈ ఏడాది ఫిబ్రవరిలో మరో రూ.2,424 కోట్ల మధ్యంతర డివిడెండ్స్‌ను అందించింది. దీంతో గడచిన ఆర్థిక సంవత్సరంలో ఎన్‌టీపీసీ మొత్తం రూ.8,096 కోట్ల డివిడెండ్‌ను చెల్లించినట్లయింది.

ఎన్‌పీఎస్ మరింత ఆకర్షణీయం

పూర్తి ఈక్విటీ పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్ ● అక్టోబరు నుంచే అమలు



వచ్చే నెల 1 నుంచి నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పలు మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. ఈ మార్పుల్లో భాగంగా మదుపరులకు పెట్టుబడుల విషయంలో అనేక ఐచ్ఛికాలు, వెసులుబాట్లు లభించబోతున్నాయి. ఈ మార్పులు, చేర్పులు ఏమిటో ఒక లుక్కేద్దాం.

ప్రభుత్వేతర ఉద్యోగుల రిటైర్‌మెంట్ ప్రయోజనాల కోసం 2009లో ప్రవేశపెట్టిన ఎన్‌పీఎస్ పథకం అనేక మంది ఆదరణ చూరగొంది. ప్రైవేటు రంగంతో పాటు స్వయం ఉపాధిలో ఉన్న అనేక మంది వృత్తి నిపుణులకూ ఈ పథకం చక్కటి రిటైర్‌మెంట్ ఇన్వెస్ట్‌మెంట్ మార్గంగా మారిందంటే ఆశ్చర్యం లేదు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ పథకంలో ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేస్తోంది. అక్టోబరు 1 నుంచి ఈ పథకంలో అనేక మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. అవేమిటంటే?

ఈక్విటీ పెట్టుబడుల ఆప్షన్

ప్రస్తుత ఎన్‌పీఎస్ నిబంధనల ప్రకారం మదుపరులు తమ వయసు ఆధారంగా 25 నుంచి 75 శాతం పెట్టుబడులను ఈక్విటీ షేర్లలో పెట్టుబడి పెట్టే ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. అక్టోబరు 1 నుంచి ఎన్‌పీఎస్‌లోని ప్రభుత్వేతర ఉద్యోగులు తమ వయసుతో సంబంధం లేకుండా మల్టిపుల్ స్కీమ్ ఫ్రేమ్‌వర్క్ (ఎంఎస్ఎఫ్) ద్వారా 100 శాతం ఈక్విటీ పెట్టుబడి ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. రిటైర్‌మెంట్ తర్వాత ఆర్థిక భద్రతకు ఢోకా లేని మదుపరులకు మాత్రమే ఈ ఆప్షన్ మేలు చేస్తుంది. మార్కెట్ ఆటుపోట్లకు తట్టుకోలేని స్థిర ఆదాయం కోరుకునే మదుపరులు ఈ ఆప్షన్ జోలికి పోకపోవడమే మంచిది.

ఎంఎస్ఎఫ్ అంటే?

ఇప్పటి వరకు ఒక పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నంబర్ (ప్రాన్) కింద ఒక స్కీమ్‌ను మాత్రమే అనుమతించేవారు. అక్టోబరు 1 నుంచి కొత్తగా ఎంఎస్ఎఫ్ అమల్లోకి వస్తోంది. దీంతో ఇక ఒకే సమయంలో వివిధ సెంట్రల్ రికార్డ్ ఏజెన్సీ (సీఆర్ఏ)ల ద్వారా ఒకే 'ప్రాన్'తో మన పెట్టుబడి స్కీమ్‌లను నిర్వహించుకోవచ్చు. దీని వల్ల మదుపరులకు తమ పెట్టుబడుల నిర్వహణకు సంబంధించి మరింత వెసులుబాటు, చాయిస్‌లు ఏర్పడతాయి.

ఇతర ప్రతిపాదిత మార్పులు

అక్టోబరు 1 నుంచి ఎన్‌పీఎస్ పెట్టుబడుల ఎగ్జిట్, విత్‌డ్రాయల్స్ మరింత సులభతరం కానున్నాయి. దీనికి సంబంధించి పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) ఇటీవల మారిన నిబంధనలతో ఒక ముసాయిదా పత్రం కూడా విడుదల చేసింది.

ప్రభుత్వేతర ఉద్యోగుల ఎగ్జిట్

ఇప్పటి వరకు 60 ఏళ్ల వయసు లేదా ఎక్కువ కాలం ఎన్‌పీఎస్‌లో ఉన్న ప్రభుత్వేతర ఉద్యోగులకు మాత్రమే ఎగ్జిట్ ఆప్షన్ ఉంది. అక్టోబరు 1 నుంచి ఎన్‌పీఎస్‌లో 15 ఏళ్లు పూర్తయిన ప్రభుత్వేతర ఉద్యోగులూ ఎగ్జిట్ ఆప్షన్ ఎంచుకోవచ్చు. మధ్యలో నగదు అవసరమైన ఖాతాదారులకు ఈ మార్పు ఎంతో మేలు చేయనుంది.


విత్‌డ్రాయల్స్

మారిన కొత్త నిబంధనల ప్రకారం రిటైర్‌మెంట్ నాటికి ఎన్‌పీఎస్‌లో పోగైన మొత్తం రూ.5 లక్షలకు మించి ఉంటే, అందులో 60 శాతాన్ని, రూ.5 లక్షల లోపు ఉంటే పూర్తి మొత్తాన్ని ఒకేసారి వెనక్కి తీసుకోవచ్చు. జమ అయిన మొత్తం రూ.2.5 లక్షలు లేదా అంతకంటే తక్కువగా ఉండి మధ్యలోనే వెనక్కి తీసుకోవాలనుకుంటే మాత్రం పోగైన మొత్తంలో 80 శాతంతో యాన్యుటీ కొనుగోలుతో మిగతా మొత్తం వెనక్కి తీసుకోవచ్చు. ఒకవేళ ఖాతాదారులు చనిపోతే మాత్రం వారి వారసులు రూ.2.5 లక్షల మొత్తాన్ని పూర్తిగా వెనక్కి తీసుకోవచ్చు.

'అండమాన్'లో ఆయిల్ ఇండియాకు జాక్‌పాట్

గ్యాస్ నిక్షేపాలు కనుగొన్న సంస్థ

295 మీటర్ల లోతులోనే సహజవాయువు జాడ



న్యూఢిల్లీ: అండమాన్ తీర ప్రాంత సముద్ర గర్భంలోనూ సహజ వాయువు (గ్యాస్) నిక్షేపాలు బయట పడుతున్నాయి. అండమాన్ దీవుల తూర్పు ప్రాంతంలో తీరానికి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్రంలో ప్రభుత్వ రంగ కంపెనీ ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్)కి సహజ వాయువు నిక్షేపాల జాడ లభించింది. ఈ ప్రాంతంలో తవ్విన ఒక అన్వేషణాత్మక బావిలో 295 మీటర్ల లోతులో గ్యాస్ నిక్షేపాల జాడ లభించినట్టు ఓఐఎల్ వెల్లడించింది. అయితే ఈ బావి నుంచి రోజుకు ఎంత మొత్తంలో గ్యాస్ లభించే అవకాశం ఉందనే విషయంపై కంపెనీ ఇంకా ఒక అంచనాకు రాలేదు. నిర్దిష్ట 2,650 మీటర్లు తవ్వితే గానీ దీనిపై ఒక అంచనాకు రాలేమని అధికార వర్గాలు చెప్పాయి. ఆంధ్రప్రదేశ్, కాకినాడలోని లేబొరేటరీలో జరిపిన పరీక్షలో ఈ గ్యాస్‌లో 87 శాతం వరకు మిథేన్ ఉన్నట్టు తేలినట్టు ఆయిల్ ఇండియా తెలిపింది.

భారీగానే నిక్షేపాలు

అండమాన్ దీవులకు సమీపంలో మయన్మార్, ఇండోనేషియా తీరాల్లో ఇప్పటికే భారీ చమురు, గ్యాస్ నిక్షేపాలు బయటపడ్డాయి. దీంతో అండమాన్, నికోబార్ దీవులు, వాటి తీర ప్రాంతంలోనూ భారీగానే చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉండే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఇటీవల వెలువడిన 'ఇండియా హైడ్రోకార్బన్ రిసోర్స్ అసెస్‌మెంట్ స్టడీ' నివేదిక ప్రకారం చూసినా, ఈ ప్రాంతంలో దాదాపు 37.1 కోట్ల టన్నుల చమురుకు సమానమైన చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ, ఓఐఎల్ కంపెనీలు రూ.3,200 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత సముద్ర జలాల్లో చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషణ ప్రారంభించాయి. కాగా కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి కూడా అండమాన్ ప్రాంతంలో భారీగానే చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉండే అవకాశం ఉందని ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే.

భారత వృద్ధికి అమెరికా సుంకాలే పెద్ద ముప్పు: క్రిసిల్

కోల్‌కతా: భారత ఆర్థిక వృద్ధికి అమెరికా విధించిన భారీ సుంకాలే పెద్దముప్పుగా పరిణమించే ప్రమాదముందని క్రిసిల్ ఇంటలిజెన్స్ హెచ్చరించింది. డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు.. దేశీయ ఎగుమతులు, విదేశీ పెట్టుబడులు రెండింటిపైనా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఒక నివేదికలో వెల్లడించింది. అయితే ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం, వడ్డీ రేట్ల తగ్గింపు కారణంగా దేశీయ వినియోగం మాత్రం వృద్ధికి తోడ్పాటునందిస్తుందని అంచనా వేసింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గవచ్చని అంచనా వేస్తున్నట్లు క్రిసిల్ వెల్లడించింది.

● పండగ సీజన్‌లో ద్విచక్ర వాహనాలకు రికార్డు స్థాయిలో డిమాండ్ పెరిగిందని హీరో మోటోకార్ప్ వెల్లడించింది. జీఎస్‌టీ తగ్గింపుతో 100 సీసీ, 125 సీసీ విభాగంలో వాహనాలను కొనుగోలు చేసేందుకు కస్టమర్లు మక్కువ చూపుతున్నట్లు తెలిపింది.

● ఇమేజింగ్ టెక్నాలజీ సంస్థ ఓఎం సిస్టమ్.. భారత మార్కెట్లోకి ఓఎం-5 మార్క్-2 ఇంటర్‌చేంజబుల్ లెన్స్ కెమెరా, ఎం.జుకో డిజిటల్ ఈడీ 50-200 ఎంఎం ఎఫ్2.8 ఐఎస్ ప్రొ లెన్స్ కెమెరాలను విడుదల చేసింది. వీటి ధరలు వరుసగా రూ.1,39,990, రూ.3,29,990గా ఉన్నాయి.

● మహీంద్రా ట్రాక్టర్స్.. మార్కెట్లోకి సరికొత్త మహీంద్రా యువో టెక్ ప్లస్ 475 డీఐ ట్రాక్టర్‌ను తీసుకువచ్చింది. రైతుల వ్యవసాయ, వ్యవసాయేతర అవసరాలు తీర్చే విధంగా ఈ 42 హెచ్‌పీ ట్రాక్టర్‌ను రూపొందించింది. ఈ ట్రాక్టర్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మహీంద్రా ట్రాక్టర్స్ డీలర్‌షిప్స్‌లో అందుబాటులో ఉండనుంది.

● అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నా.. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథంలో సాగుతుందని పీఎల్ క్యాపిటల్ వెల్లడించింది. విధానపరమైన సంస్కరణలు, ప్రభుత్వ పెట్టుబడులు, ద్రవ్యోల్బణం, ఈక్విటీ మార్కెట్ల ఔట్‌లుక్ సానుకూలంగా ఉండటం వృద్ధికి కలిసొచ్చే అవకాశాలని తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,15,480 ▲	1,05,850 ▲	1,56,000 ▲
విజయవాడ	1,18,500 ▲	1,11,500 ▲	1,43,000 ▲
విశాఖపట్నం	1,15,470 ▼	1,05,850 ▲	1,59,000 ▲
రాజమండ్రి	1,15,470 ▲	1,05,850 ▲	1,47,100 ▲
ప్రొద్దుటూరు	1,19,000 ▲	1,09,480 ▲	1,47,500 ▲
ముంబై	1,13,262 ▼	1,03,748 ▼	1,38,100 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	550
వరంగల్	502	గోదావరి	540
చిత్తూరు	558	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	117
వరంగల్	105	గుంటూరు	120
కరీంనగర్	105	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	95
కర్నూలు	105	నెల్లూరు	100
విశాఖపట్నం	122	అనంతపురం	100
గోదావరి	117		



గాంధీ కొండపై కొనసాగుతున్న జంబో లిఫ్ట్ నిర్మాణ పనులు

గాంధీ కొండకు లిఫ్ట్!

- 2న సీఎం రాక నేపథ్యంలో శరవేగంగా నిర్మాణం
- స్మారక స్తూపం వరకు ఎలివేటెడ్ పాత్‌వే కూడా

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

విజయవాడలోని గాంధీకొండను సందర్శించేవారి కోసం భారీ లిఫ్ట్ సిద్ధమవుతోంది. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఇక్కడకు వస్తున్న నేపథ్యంలో జంబో లిఫ్ట్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కొండపైనున్న స్మారక స్తూపం వద్దకు చేరుకునేందుకు ఇది దోహదపడనుంది. గాంధీహిల్ సొసైటీ సౌజన్యంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. గాంధీహిల్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు, గాంధీ ఇండియా ఇంటర్నేషనల్ ప్రాజెక్టులను ప్రారంభించటంతోపాటు సభలో సీఎం పాల్గొననున్నారు. చంద్రబాబు పర్యటన తర్వాత జంబో లిఫ్ట్ శాశ్వతంగా సందర్శకులకు అందుబాటులోకి రానుంది. గాంధీ కొండపైకి ఘాట్ రోడ్డు ఉన్నప్పటికీ అది కొండపై వరకు లేదు. కొండ శిఖరాగ్రంలో ఉన్న గాంధీ స్మారక స్తూపం వరకు చేరుకోవాలంటే మెట్లమార్గం ఒక్కటే దిక్కు. దీంతో కొండకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని నిర్వాహకులు నిర్ణయించారు. కొండ మిడిల్ డౌన్ నుంచి స్మారక స్తూపం వరకు జంబో లిఫ్ట్ నిర్మిస్తున్నారు. లిఫ్ట్ పైభాగం నుంచి 25 మీటర్ల దూరంలోని గాంధీ స్మారక స్తూపం వరకు ఎలివేటెడ్ పాత్‌వే కూడా నిర్మిస్తున్నారు. చంద్రబాబు తొలిసారిగా గాంధీ స్మారక స్తూపం నుంచి విజయవాడ అందాలను వీక్షించనున్నారు.

జీసీసీ అరకు కాఫీకి అవార్డు



కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరి నుంచి అవార్డు అందుకుంటున్న జీసీసీ ఎండీ కల్పన

విశాఖపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'బిజినెస్ లైన్' చేంజ్ మేకర్ అవార్డ్స్-2025లో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) అరకువేలీ కాఫీకి 'ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్' విభాగంలో 'చేంజ్ మేకర్ ఆఫ్ ది ఇయర్-2025' అవార్డు లభించింది. ముంబైలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరి చేతుల మీదుగా జీసీసీ ఎండీ, వైస్ చైర్‌పర్సన్ కల్పన కుమారి ఈ అవార్డు అందుకున్నారు. ఆమె మాట్లాడుతూ అరకులోయ కాఫీ ఒక బ్రాండ్ మాత్రమే కాదని, గిరిజనుల గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వం ద్వారానే ఇది సాధ్యమైందని చెప్పారు.

మరోసారి ఏపీ చాంబర్స్ అధ్యక్షునిగా పొట్లూరి



అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) అధ్యక్షునిగా పొట్లూరి భాస్కరరావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండేళ్లుగా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న భాస్కరరావు మరో రెండేళ్లపాటు ఈ పదవిలోనే కొనసాగనున్నారు. శనివారం విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్‌లో వివిధ రంగాలకు చెందిన వ్యాపార, పారిశ్రామిక ప్రముఖులతో ఏపీ చాంబర్స్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా బి.రాజశేఖర్, జనరల్ సెక్రటరీగా రావూరి సుబ్బారావు, కోశాధికారిగా ఎస్.అక్కయ్యనాయుడు, ముగ్గురు జోనల్ వైస్ ప్రెసిడెంట్లు, 8 మందిని మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విజయవాడ ఎక్స్‌పో అదరహో!

- ప్రారంభించిన నటుడు బాలకృష్ణ
- ఉర్రూతలూగించిన సింగర్ సునీత పాటలు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎక్స్‌పో (గొల్లపూడి ఎగ్జిబిషన్)ను శనివారం హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. అనంతరం జరిగిన సింగర్ సునీత లైవ్ మ్యూజిక్ షో ఉర్రూతలూగించింది. ప్రారంభ సభలో బాలకృష్ణ మాట్లాడుతూ.. కళల పుట్టినిల్లు భారతదేశం ఒక గొప్ప కళాఖండమని, దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన ఎందరో కళాకారులు ఇక్కడ జన్మించారన్నారు. అంతరిస్తున్న కళలను పునరుద్ధరించడానికి, వాటి ఔన్నత్యాన్ని నేటి తరానికి తెలియజేయడానికి విజయవాడ ఉత్సవ్ గొప్ప వేదికైందన్నారు. రాత్రి జరిగిన సునీత లైవ్ మ్యూజిక్‌షో విశేషంగా ఆకట్టుకుంది. సింగర్ ధనుంజయ్‌తో కలిసి అమ్మవారిపై పాడిన 'పారాణి పాదాల బాలాకృతి పరమందు కొలువైన పరమేశ్వరి' తదితర పాటలతో వీక్షకులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. 30 సినిమా పాటల వరకు పాడి యువతను, ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.

సునీత భావోద్వేగం

'నేను పుట్టి పెరిగి సంగీతం నేర్చుకున్న విజయవాడలో గానం చేయడం నాకు ఎంతో ఆనందంగా ఉంది' అని సింగర్ సునీత భావోద్వేగానికి గురయ్యారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయవాడలో అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు. విజయవాడలో ఉండి రోజూ అమ్మవారిని దర్శించుకుంటున్నవారంతా అదృష్ట వంతులన్నారు. ఇంకా తనలాంటి ఎందరో సింగర్స్ విజయవాడ నుంచి రావాలని ఆకాంక్షించారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న బాలకృష్ణ, సింగర్ సునీత లైవ్ మ్యూజిక్ షో



ప్రత్యేక ఆకర్షణగా ఈఫిల్ టవర్ నమూనా

పర్యాటకానికి స్వర్గధామం.. ఏపీ

- కుంభమేళా తరహాలో కార్యక్రమాలు
- టూరిజంకు ఇండస్ట్రీ హోదా ఇచ్చాం
- రాష్ట్రంలో హీలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 'హెల్త్ టూరిజం'ను ప్రోత్సహిస్తాం
- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో సీఎం చంద్రబాబు



సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

> "పీపీపీ అంటే ఏంటో తెలియని వాళ్లే విమర్శిస్తున్నారు. స్థలాలను మొత్తంగా అమ్మేస్తే ప్రైవేటీకరణ అవుతుంది. కానీ, స్థలాలను లీజుకు మాత్రమే ఇస్తున్నాం. అమ్మేయడానికి, లీజుకు ఇవ్వడానికి మధ్య ఉన్న తేడా కొంతమందికి తెలియకపోవడం మన దౌర్భాగ్యం." - సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యాటకానికి ఏపీ స్వర్గధామమని, దేశంలోనే ఉత్తమ పర్యాటక ప్రాంతంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పర్యావరణం, సంస్కృతి, వనరులను కాపాడుకుంటూ సుస్థిర మార్పు తీసుకువచ్చినప్పుడే పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, "గత పాలకులు తమ సొంత అవసరాలు తీర్చుకునేందుకు విశాఖలోని రుషికొండపై రూ.451 కోట్లు ఖర్చు చేసి ప్యాలెస్ నిర్మించుకున్నారు. ఆ నిధులను పర్యాటక రంగంపై ఖర్చు చేసి ఉంటే లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేవి" అని తెలిపారు. అవగాహన లేక గత ప్రభుత్వం పర్యాటకం మీద ఒక్క పైసా ఖర్చుపెట్టలేదని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీసిందని దుయ్యబట్టారు. అద్భుతమైన కట్టడాలను కూల్చేసిందన్నారు. "ఆరోగ్య వంత జీవనానికి రాష్ట్రంలో హీలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి హెల్త్ టూరిజం ప్రాజెక్టులను ప్రోత్సహిస్తాం. అన్ని ఇజాల కంటే టూరిజం భవిష్యత్తులో నిలబడుతుందని నేను గతంలోనే చెప్పా. ప్రస్తుతం అదే నిజమైంది. టూరిజం అభివృద్ధి వల్లే మకావ్, మాల్దీవ్, హాంకాంగ్ లాంటి చిన్నదేశాలు అభివృద్ధి చెందుతున్నాయి" అని అన్నారు.

పరిశ్రమ హోదా ఇచ్చాం

తమ ప్రభుత్వం రాగానే పర్యాటక రంగానికి పారిశ్రామిక(ఇండస్ట్రీ) హోదా కల్పించామని చంద్రబాబు తెలిపారు. పర్యాటకుల అభిరుచులు, ఆలోచనలు మారుతున్నాయని, నేటితరం యువత.. వారసత్వ సంపద, పూర్వీకుల సంస్కృతి వైపు మళ్లడానికి ఇష్టపడుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశాలను ఉపయోగించుకుంటూ ఒకరోజు పర్యటనకు వచ్చిన వాళ్లను సైతం మూడు, నాలుగు రోజులు ఉండేలా సంస్కృతికి ప్రాధాన్యమివ్వాలని సీఎం సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను కుంభమేళా తరహాలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర సాధించాలంటే హరిత, పర్యాటకం, స్వచ్ఛత విషయాల్లో రాష్ట్రం మెరుగుపడాలన్నారు.

10 వేల హోం స్టేలు

అరకు, పాడేరు, విశాఖ, తిరుపతి, రాయలసీమ తదితర ప్రాంతాల్లో 10 వేల హోం స్టేలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని సీఎం తెలిపారు. వచ్చే మూడేళ్లలో 50 వేల హోటల్ రూమ్‌లను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సంస్కృతి, సంప్రదాయలను ఉపయోగించుకుని అనుభూతి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుద్ధిస్ట్ ప్రాంతాలతో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల్లో కుంభమేళా తరహా కార్యక్రమాలు నిర్వహిస్తామని, అరకు చలి ఉత్సవం, ఫ్లెమింగో ఫెస్టివల్ వంటివి నిర్వహిస్తామని తెలిపారు. ప్రపంచంలో అరకు లాంటి కాఫీ ఎక్కడా దొరకదని, అందుకే దేశ విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రముఖులకు అరకు కాఫీ రుచిచూపిస్తున్నామన్నారు.

మన విశిష్టతలు గుర్తించాలి

మన ప్రాంతంలోని విశిష్ట, పర్యాటక ప్రాంతాలను గుర్తించకపోవడం వల్లే ఇతర ప్రాంతాల్లో పర్యటించడానికి పర్యాటకులు మొగ్గు చూపుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఒకే చోట రెండు జ్యోతిర్లింగాలున్న శ్రీశైలాన్ని దర్శించుకోవడానికి అక్టోబరు 16న ప్రధాని మోదీ వస్తున్నారని, జ్యోతిర్లింగాల విషయం రాష్ట్రంలో అనేక మందికి అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. దసరా ఉత్సవాలంటే కలకత్తా, మైసూరు మాత్రమే గుర్తొచ్చేవని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విజయవాడలో నిర్వహిస్తున్న కార్యక్రమాలతో దేశం మొత్తం నగరంవైపు చూస్తోందని చంద్రబాబు తెలిపారు.



శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

'అక్షరం అండగా..'తో పరిష్కారం

- కొత్తచెరువులో శ్మశానవాటికకు స్థలం, దారి



కొత్తచెరువు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు పట్టణ ప్రజలకు శ్మశాన వాటికకు స్థలం కేటాయింపుతో పాటు, దారి సమస్య పరిష్కారమైంది. జనవరి 28న నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' సభలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కొత్తచెరువు బీసీ కాలనీ వాసులు కోరారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి స్పందించి, పుట్టపర్తి ప్రధాన రహదారి పక్కన, నల్లగొండ సమీపంలోని సర్వే నం.1451లో 3 ఎకరాలను కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు ఇచ్చినా శ్మశాన వాటికకు దారి మాత్రం చూపలేదు. ఈ నెల 2న కొత్తచెరువు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన 'అక్షరం అండగా..' సభలో ఈ సమస్యను స్థానికులు ప్రస్తావించారు. వెంటనే దారి సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి సూచించారు. దీంతో శ్మశాన వాటికకు వెళ్లేందుకు 30 అడుగుల రోడ్డు ఏర్పాటు పనులను రెవెన్యూ, పంచాయతీ అధికారులు శనివారం చేపట్టారు.

ఆహార పరిశ్రమ రంగంలో 10 వేల కోట్ల పెట్టుబడులు

- రాష్ట్ర ఆహార శుద్ధి, పరిశ్రమల మంత్రి టీజీ భరత్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ కృషితో రాష్ట్ర ఆహార శుద్ధి రంగంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ఆహార శుద్ధి, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. పెట్టుబడుల రాకతో 20 వేల కొత్త ఉద్యోగాలు కూడా వచ్చాయన్నారు. శనివారం, భారత మండపంలో ప్రారంభమైన వరల్డ్ ఫుడ్ ఇండియా ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్‌ను మంత్రి సందర్శించారు. విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు బ్రాండ్‌ను చూసి ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల కోసం మంచి పాలసీలను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆహార పరిశ్రమలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చేవారికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి చెప్పారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

దయచేసి టికెట్ రేట్లు పెంచకండి సార్



ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ చూపాలని, అందుకోసం ఫిల్మ్ ఇండస్ట్రీకి ప్రాతినిథ్యం వహిస్తున్న ఫిల్మ్ ఛాంబర్‌ను, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌ను పిలిచి చర్చించాలని సీనియర్ నటుడు ఆర్.నారాయణమూర్తి కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'సామాన్యుడికి కూడా వినోదాన్ని పంచేది కేవలం సినిమా మాత్రమే. అలాంటి సినిమా టికెట్ ధరలు పెంచితే సామాన్యుడు ఇబ్బంది పడతాడు. రేట్లు పెంచడం వలన చిన్న నిర్మాతలు కూడా నష్టపోతున్నారు. దయచేసి టికెట్ రేట్లు పెంచకండి సార్. టికెట్ ధరలు పెంచను, మిడ్ నైట్ షోలను అనుమతించను అని అసెంబ్లీలో చెప్పిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి సెల్యూట్ చేస్తున్నా. అదే మాట మీద నిలబడాలని కోరుతున్నా' అన్నారు.



కావాల్సినంత వినోదం

కిరణ్ అబ్బవరం

'ఈ దీపావళికి థియేటర్లకు వచ్చే అన్ని వర్గాల ప్రేక్షకులకు 'కె-ర్యాంప్' సినిమా కావాల్సినంత వినోదాన్ని పంచుతుంది. అందుకు నేను హామీ ఇస్తున్నాను' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రమిది. యుక్తి తరేజా కథానాయిక. రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం ప్రెస్ మీట్ నిర్వహించింది. దర్శకుడు జైన్స్ నాని మాట్లాడుతూ కె-ర్యాంప్ అంటే బూతు మాట కాదు. కె-ర్యాంప్ అంటే కిరణ్ అబ్బవరం ర్యాంప్. దాన్ని దృష్టిలో పెట్టుకునే కథ రాశాను' అని చెప్పారు. చిత్ర నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ 'ఈ సినిమా చేస్తున్నప్పుడు జైన్స్ నానితో ఇండస్ట్రీకి మరో త్రివిక్రమ్, హరీశ్ శంకర్ దొరికినట్లే' అని నరేశ్ నాతో అన్నారు. ఈ దీపావళికి ఎన్ని సినిమాలు విడుదలవుతున్నా.. 'కె-ర్యాంప్' విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. కార్యక్రమంలో కథానాయిక యుక్తి తరేజా, సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్, ప్రొడక్షన్ డిజైనర్ బ్రహ్మ కడలి తదితరులు మాట్లాడారు.

శక్తిమంతమైన పాత్రలో...



నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓడెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. శనివారం ఈ సినిమా నుంచి మంచు మోహన్‌బాబు ఫస్ట్‌లుక్ పోస్టర్లను విడుదల చేశారు మేకర్స్. ఆయన ఇందులో 'శికంజ మాలిక్' అనే విలన్ పాత్రను పోషిస్తున్నారు. ఓ పోస్టర్‌లో షర్ట్ లేకుండా గన్, కత్తి, సిగార్ పట్టుకుని సీరియస్ లుక్‌లో ఉన్నారు. ఇంకో పోస్టర్‌లో గన్ పట్టుకుని సిగార్ కాలుస్తున్న లుక్ ఆయన పాత్ర చాలా శక్తిమంతంగా ఉండబోతోందని తెలిపేలా ఉంది. ఈ లుక్స్ అదిరిపోయాయంటూ, వింటేజ్ మోహన్‌బాబును చూస్తున్నట్లు ఉందని సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. ఇందులో నాని జడల్ అనే పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న 'ది ప్యారడైజ్' సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: సీహెచ్ సాయి, సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్.

అలరించే అమ్మ పాట



వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్కే తెరకెక్కించిన చిత్రం 'కానిస్టేబుల్'. జాగృతి మూవీ మేకర్స్ బేనర్‌పై బలగం జగదీశ్ నిర్మించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రంలోని 'తల్లిలేని ఓ దేవుడా ఈ తల్లి ఘోష చూడరా' అంటూ సాగే గీతాన్ని ఆర్.నారాయణమూర్తి ఆవిష్కరించారు. ఈ పాటను రామారావు రచించగా ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ ఆలపించడం విశేషం. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'నా గత చిత్రాలకు భిన్నంగా ఇందులో నా పాత్ర ఉంటుంది. చక్కటి డ్రామా, వినోదం, భావోద్వేగాలు వంటి అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని చెప్పారు. ఆర్యన్ సుభాన్ మాట్లాడుతూ 'ట్రైలర్‌కి వస్తున్న స్పందన చిత్రంపై మా నమ్మకాన్ని మరింత పెంచింది' అని అన్నారు. నిర్మాత బలగం జగదీశ్ మాట్లాడుతూ 'అక్టోబరు 10న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. నైజాంలో ఏషియన్ ఫిల్మ్స్ రిలీజ్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని చెప్పారు.

థ్రిల్లర్ సరస్వతి



పలు సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించి మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు వరలక్ష్మి శరత్‌కుమార్. తాజాగా ఆమె దర్శకత్వం, నిర్మాణం వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే తన సోదరి పూజ శరత్‌కుమార్‌తో కలసి దోస డైరీస్ అనే నిర్మాణ సంస్థను ప్రారంభించారు. శనివారం ఈ బేనర్‌పై తెరకెక్కనున్న తొలి చిత్రం 'సరస్వతి'ని ప్రకటించారు. ఇందులో ఆమె ప్రధాన పాత్ర పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా వరలక్ష్మి శరత్‌కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్రం అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది. క్షణక్షణం ఉత్కంఠభరితంగా సాగే ఈ థ్రిల్లర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుంది. కచ్చితంగా ఘన విజయం సాధిస్తుంది. త్వరలోనే ఇతర వివరాలు తెలియజేస్తాను' అని అన్నారు. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, ప్రకాశ్‌రాజ్, ప్రియమణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

కన్నీటి కరూర్



విజయ్ రోడ్ షోకు భారీగా తరలివచ్చిన జనం



గాయపడిన బాలుడు



తొక్కిసలాటలో గాయపడిన మహిళలను ఆస్పత్రికి తీసుకువెళ్తున్న దృశ్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. గత మూడు వారాలుగా ప్రతి శని, ఆది వారాల్లో 'ర్యాలీ'లు నిర్వహిస్తున్నారు. శనివారం... నామక్కల్, కరూర్‌లో సభలు ఏర్పాటు చేశారు. ఉదయం పది గంటలకు నామక్కల్ రావాల్సిన విజయ్... మూడు గంటలు ఆలస్యంగా అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం 3 గంటలకు కరూర్‌లోని వేలుచామిపురం వద్దకు విజయ్ వస్తారని నిర్వాహకులు ప్రకటించారు. కానీ... ఉదయం 11 గంటల నుంచే కరూర్ వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. తమ అభిమాన (కథా)నాయకుడిని చూసేందుకు యువకులతో పాటు... పిల్లలు, మహిళలూ భారీగా తరలి వచ్చారు. ఎండ మండిపోతున్నా లెక్క చేయకుండా గంటలకొద్దీ వేచి చూశారు. చివరికి... నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 7 గంటల తర్వాత విజయ్ అక్కడికి చేరుకున్నారు. తన సభల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న బస్సు పైకి ఎక్కి విజయ్ ప్రసంగం ప్రారంభించగానే... అభిమానులు ఉర్రూతలూగిపోయారు. ఆయన ప్రసంగం ముగియడానికి కొద్దిసేపటి ముందే తొక్కిసలాట మొదలైంది. తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అప్పటికే నీరసించిన జనంలో కొందరు స్పృహతప్పి పడిపోయారు. ఇది గమనించిన విజయ్ టీమ్ అప్రమత్తమైంది. విజయ్ కూడా తన ప్రసంగాన్ని ఆపివేసి... బస్సు పైనుంచే వాటర్ బాటిళ్లు విసిరేశారు. విజయ్ అక్కడి నుంచి బస్సులో బయలుదేరగానే... పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. ఉదయం నుంచి ఎండలో ఉండి... మాడిపోయిన జనం ఒక్కసారిగా అక్కడి నుంచి కదిలారు. విజయ్‌ని స్పష్టంగా చూడాలని గోడలు, చెట్లు ఎక్కిన వాళ్లు కిందికి దూకారు. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. అసలే ఇరుకు రోడ్డు... చీకటి... అటు జన ప్రవాహం, ఇటు ఒకరిమీద ఒకరు పడటంతో తొక్కిసలాట మొదలైంది. పెను విషాదానికి ఇదే కారణమైంది.

హాహాకారాలు... ఆర్తనాదాలు

తొక్కిసలాట సమయంలో పోలీసులూ అసహాయులుగా మారిపోయారు. పరిస్థితిని అదుపులోకి తేవడం వారికి అసాధ్యంగా మారింది. చీకట్లో ఏం జరుగుతోందో ఎవరికీ అర్థం కాలేదు. తొక్కిసలాటలో చిక్కుకున్న జనం ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైపోయారు. 'సాయం చేయండి... ప్లీజ్... పోలీస్' అంటూ ఆర్తనాదాలు చేశారు. చాలామంది అక్కడే స్పృహ కోల్పోయారు. దారులన్నీ జనసంద్రంగా మారడంతో అంబులెన్స్‌లు కూడా వేగంగా చేరుకోలేకపోయాయి.

కన్నీటి సంద్రంలా కరూర్ ప్రభుత్వాసుపత్రి

క్షతగాత్రులను తరలించేందుకు సమారు 50 అంబులెన్స్‌లను ఉపయోగించారు. క్షతగాత్రులు, మృతదేహాలు, బాధిత కుటుంబీకుల రోదనలతో కరూర్ ప్రభుత్వాసుపత్రి శోకసముద్రంలా మారింది. ఒక్కో అంబులెన్సులో నలుగురైదుగురు క్షతగాత్రులను కూడా తీసుకొచ్చారు. ఇక్కడ 80 మందికి పైగా క్షతగాత్రులు ఈ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొంతమంది క్షతగాత్రులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు.

విచారణకు ఆదేశం...

ఈ విషాదంపై ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయంలో ఉన్నతస్థాయిలో సమీక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున అందిస్తామని ప్రకటించారు. అలాగే... ఈ ఘటనపై హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో న్యాయ విచారణకు ఆదేశించారు. ఆదివారం ఉదయం కరూర్ వెళ్లాలని భావించినప్పటికీ... శనివారం రాత్రికే ప్రత్యేక విమానంలో అక్కడికి చేరుకున్నారు. జరిగిన విషాదంపై విచారణకు ఆదేశించారు. ఇక... స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ తన దుబాయ్ పర్యటనను రద్దు చేసుకుని, విమానాశ్రయం నుంచి నేరుగా కరూర్ చేరుకున్నారు.

నా గుండె బద్దలైంది: విజయ్

కరూర్ నుంచి తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్న నటుడు విజయ్.. మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆయన దీనిపై ఒక ప్రకటన విడుదల చేశారు. "నా గుండె బద్దలైపోయింది. భరించలేని బాధతో విలవిలలాడుతున్నాను. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని విజయ్ పేర్కొన్నారు.

ప్రముఖుల దిగ్భ్రాంతి


కరూర్ విషాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తమిళనాడు గవర్నర్ రవి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితర ప్రముఖులు కూడా బాధితులకు తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

అదుపు చేయలేకనే.. విషాదాలు

(సెంట్రల్ డెస్క్)

ఫిబ్రవరిలో ఢిల్లీలోని రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రాణాలు కోల్పోయారు.. జూన్‌లో బెంగళూరులో ఆర్సీబీ జట్టు ఐపీఎల్ విజయోత్సవ కార్యక్రమం నేపథ్యంలో తొక్కిసలాట జరిగి 11 మంది చనిపోయారు.. ఇప్పుడు తమిళనాడులో విజయ్ రాజకీయ సభలో తొక్కిసలాటలో 38 మంది వరకు మృతి చెందారు.. వీటన్నింటికీ కారణం తక్కువ స్థలంలో ఎక్కువ మంది గుమిగూడటం, ఎవరికి వారు తామే ముందుకు దూసుకుపోవడానికి ప్రయత్నించడం.. అన్నింటికన్నా ముఖ్యంగా గుంపును కట్టడి (క్రౌడ్ మేనేజ్‌మెంట్) చేయలేకపోవడమే. మన దేశంలో రైల్వేస్టేషన్లు, బస్టాండులు, మార్కెట్లు, సినిమా హాళ్ల వంటివి ఎప్పుడూ కిక్కిరిసే కనిపిస్తాయి. ఇక జాతరలు, వేడుకల సమయంలో జనం గుమిగూడటమూ సాధారణమే. దానికితోడు సినీ నటుల కార్యక్రమాలు, రాజకీయ సభలు, ర్యాలీలకు భారీగా జనం పోటెత్తుతుంటారు. అలాంటి చోట్ల తొక్కిసలాట జరగకుండా జనాన్ని కట్టడి చేయడమే కీలకం. తగిన భద్రతా ఏర్పాట్లు చేయడం నుంచి ఆధునిక సాంకేతికతను వినియోగించడం దాకా ఇందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వరల్డ్ రీసోర్సెస్ ఇనిస్టిట్యూట్ ఇండియా నివేదిక ప్రకారం.. ఏ ప్రదేశంలోనైనా ప్రతి చదరపు మీటరుకు నలుగురు వ్యక్తులు ఉంటే అది కిక్కిరిసిన పరిస్థితి. అదే ఆరుగురి చొప్పున ఉంటే ప్రమాదకర పరిస్థితి. తొక్కిసలాటకు అవకాశం ఎక్కువ. ప్రస్తుతం హెచ్‌డీ కెమెరాలు, అవి చిత్రీకరించే దృశ్యాల ఆధారంగా గుమిగూడిన జనం పరిస్థితిని విశ్లేషించే సాంకేతికతలు అందుబాటులోకి వచ్చాయి. ఎక్కడ ఎక్కువ జనం గుమిగూడారు? గుంపులో జనం ఎటువైపు కదులుతున్నారు? తొక్కిసలాట జరిగే పరిస్థితి నెలకొందా? అన్నది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. జనాన్ని నియంత్రించేలా, మరోవైపు మళ్లించేలా క్షేత్రస్థాయిలోని సిబ్బందిని సూచనలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇక భారీగా గుమిగూడిన జనం మధ్య అక్కడక్కడా ఖాళీ ప్రదేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని.. ఏదైనా ఇబ్బంది ఏర్పడితే తొక్కిసలాట జరగకుండా ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. జనం గుమిగూడిన ప్రాంతానికి సినీ నటులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు వస్తే.. వారిని చూడటానికి అంతా ఒక్కసారిగా ఎగబడి తొక్కిసలాటకు దారితీస్తుంది. అలాంటి సమయంలో కచ్చితమైన ముందుజాగ్రత్త చర్యలు చేపట్టేలా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. జనం కిక్కిరిసిపోయే పరిస్థితి ఏర్పడితే ముందుగానే జాగ్రత్తపడేలా ప్రజల్లో అవగాహన కల్పించడమూ కీలకం.

లోకం తీరు





శనివారం రోడ్ షోలో మాట్లాడుతున్న విజయ్

ప్రభంజనం... ఆంక్షలు... వివాదాలు!

ప్రేక్షకులకు, ప్రజలకు విజయ్‌గా సుపరిచితుడైన ఆయన పూర్తి పేరు... జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్! తమిళనాట 'ఇలయ దళపతి'గా పేరు తెచ్చుకున్నారు. తమిళనాట విజయ్ రాజకీయ రంగ ప్రవేశం పెను సంచలనం సృష్టించింది. గత ఏడాది 'తమిళ వెట్రి కళగం' (తమిళ విజయం పార్టీ) ఏర్పాటు చేశారు. అక్టోబరు 27న విల్లుపురంలో తొలి రాజకీయ సభకు భారీగా జనం తరలి వచ్చారు. ఆ తర్వాత... నిర్వహించిన సభల్లోనూ ఇదే పరిస్థితి. సభలకు వచ్చే జనాన్ని అదుపు చేయడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. దీంతో విజయ్ ప్రచారానికి పలు నిబంధనలు విధించారు. అయితే దీనిని సవాల్ చేస్తూ ఆయన పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. న్యాయస్థానం పోలీసుల నిబంధనల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూనే, అన్ని పార్టీల నేతల ప్రచారానికి ఒకే విధమైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది.



వాంగ్‌చుక్‌కు పాక్‌తో సంబంధాలు: లద్దాఖ్ డీజీపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: లద్దాఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌కు పాకిస్థాన్‌తో సంబంధాలున్నాయని.. దీనిపై దర్యాప్తు అధికారులు విచారణ జరుపుతున్నారని డీజీపీ ఎస్డీ సింగ్ జమ్వాల్ తెలిపారు. వాంగ్‌చుక్‌తో సంబంధాలు కలిగి ఉన్న పాక్ గూఢచారి (పీఐఓ)ని ఇటీవలే అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వాంగ్‌చుక్ గతంలో పాక్, బంగ్లాదేశ్‌లలో పర్యటించారన్నారు. శనివారం లేహ్‌లో జరిగిన మీడియా సమావేశంలో లద్దాఖ్ డీజీపీ జమ్వాల్ మాట్లాడుతూ.. 'లేహ్‌లో అల్లర్ల వెనక వాంగ్‌చుక్ కీలక వ్యక్తి. ఆయన రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. ఓ పాక్ గూఢచారిని ఇటీవలే అరెస్టు చేశాం. అతడు వాంగ్‌చుక్‌తో సంప్రదింపులు జరిపాడు. దీనికి సంబంధించిన రికార్డులున్నాయి. ఆయన వ్యవహార శైలి అనేక అనుమానాలకు తావిస్తోంది. వీటిపై దర్యాప్తు జరుపుతున్నాం' అని వివరించారు.

ప్రపంచ ఉగ్రవాద కేంద్రం పాకిస్థాన్: జైశంకర్

న్యూయార్క్, సెప్టెంబరు 27: ఉగ్రవాదాన్ని అధికార విధానంగా కలిగిన పొరుగుదేశం(పాకిస్థాన్) ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా నిలిచిందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించరాదని, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం అందకుండా చూడాలని ఆయన ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో ప్రసంగిస్తూ చెప్పారు. ఉగ్రవాద మూలాలను ఉమ్మడిగా పెకిలించి వేయాలని ఆయన ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. పహల్గాంలో ఉగ్రవాదులు పాశవిక దాడి జరిపారని, ప్రతిగా భారత్ పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిందని చెప్పారు. గాజాలో శాంతి నెలకొనాలని, దీని కోసం భారత్ సహకరిస్తుందన్నారు. ఇదిలా ఉండగా, ఆపరేషన్ సిందూర్ వేళ కాల్పుల విమరణ విషయంలో మూడో దేశం ప్రమేయం లేదని.. మూడో వ్యక్తి ప్రమేయం అంతకన్నా లేదని భారత్ ఐరాస వేదికగా స్పష్టం చేసింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి పటేల్ గహ్లోత్ కీలక ప్రకటన చేశారు. "మే 9వ తేదీ వరకు భారత్‌పై కాల్పులకు పాల్పడుతూ.. పాక్ బెదిరింపు ధోరణిని ప్రదర్శించింది. కానీ, మే 10న భారత్‌తో పాక్ సైన్యం కాళ్లబేరానికి వచ్చింది. అయితే.. పాక్ ప్రధాని..తమ దేశంలో ధ్వంసమైన రన్‌వేలు తమ విజయమని భావిస్తే.. వారు ఆనందించవచ్చు" అని ఎద్దేవా చేశారు.

అమెరికా నుంచి మొక్కజొన్న దిగుమతి?

» ఇథనాల్ తయారీకి వినియోగించే అవకాశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య చర్చల్లో.. ఇథనాల్ ఉత్పత్తి కోసం ఆ దేశం నుంచి మొక్కజొన్న కొనుగోలు చేసే అవకాశాలను భారతదేశం పరిశీలిస్తోంది. అమెరికా నుంచి వచ్చిన ఈ తాజా ప్రతిపాదనల మేరకు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని చేసుకునే లక్ష్యంతో చర్చలు జరుగుతున్నాయి. తదుపరి చర్చలకు తేదీ, వేదిక ఇంకా ఖరారు కానప్పటికీ, నిర్దేశిత గడువులోగా వాణిజ్య ఒప్పందం చేసుకునే లక్ష్యంతో ఇరుపక్షాలూ చర్చల్లో పురోగతి కొనసాగిస్తున్నాయని ఓ ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది. రష్యా నుంచి భారత్ ముడిచమురును కొనుగోలు చేసే అంశమే తాజా వాణిజ్య చర్చల్లో ప్రధాన అవరోధంగా ఉందని అమెరికా యంత్రాంగం చెబుతోంది. కాగా, రష్యా నుంచి చమురు దిగుమతులు ఈనెలలో సుమారు రోజుకు 2 లక్షల బ్యారళ్లకు పెరగనున్నట్టు భావిస్తున్నారు.

ఎప్‌స్టీన్‌తో మస్క్ సహా పలువురికి సంబంధాలు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: లైంగిక నేరస్థుడు, వ్యాపార వేత్త దివంగత జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, బ్రిటన్ రాజకుమారుడు ఆండ్రూ, స్టీవ్ బానన్ సహా పలువురికి సంబంధాలు ఉన్నాయని అమెరికా చట్టసభకు చెందిన డెమొక్రాట్స్‌తో కూడిన స్థాయీ సంఘం తాజాగా విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది. 'ఎప్‌స్టీన్ ఫైల్స్' ఫైల్స్ పేరుతో విడుదల చేసిన నివేదికలో ఎప్‌స్టీన్‌తో పలువురు ప్రముఖులకు ఉన్న సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, సమావేశాలు, విమాన ప్రయాణ వివరాలు, ఆర్థిక అంశాలను పేర్కొన్నారు. "ఎప్‌స్టీన్ ఎస్టేట్ అందించిన మూడో దఫా పలు నివేదికలను పరిశీలించిన తర్వాత ఈ పాక్షిక నివేదికను రూపొందించాం. దీనిలో ఫోన్ సందేశాలు, విమానాల బుకింగ్ వివరాలు, ఆర్థిక లావాదేవీలు, ఎప్‌స్టీన్ దైనందిన చర్య వంటివి ఉన్నాయి." అని పేర్కొన్నారు. ముఖ్యంగా 2014, డిసెంబరులో మస్క్.. ఓ ప్రైవేటు ఐలాండ్‌కు ఎప్‌స్టీన్‌ను ఆహ్వానించినట్టు ఉందని తెలిపారు.

గాజా నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలి

» హమాస్ ఆయుధాలను వీడాలి

» అమెరికా 21 సూత్రాల శాంతి ప్రణాళిక

వాషింగ్టన్, సెప్టెంబరు 27: గాజా యుద్ధానికి ముగింపు పలికేందుకు, భవిష్యత్తులో ఒక దేశంగా పాలస్తీనా ఏర్పాటయ్యేందుకు వీలుగా అమెరికా 21 సూత్రాల శాంతి ప్రణాళికను ప్రతిపాదించింది. గాజా నుంచి ఇజ్రాయెల్ వైదొలగడం, పాలస్తీనియన్లను గాజాలో ఉండేందుకు ప్రోత్సహించడం, హమాస్ ఆయుధాలు వీడడం, బందీలను విడుదల చేయడం, వంటి అంశాలు ఆ ప్రణాళికలో ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ సమావేశాల సందర్భంగా అమెరికా ఈ ప్రణాళికను కొన్ని అరబ్, ముస్లిం దేశాల ముందు ఉంచింది. పాలస్తీనియన్లను గాజా స్ట్రిప్‌లో ఉండనివ్వాలనే ప్రతిపాదన.. ట్రంప్ వైఖరిలో మార్పును సూచిస్తుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. గాజాను స్వాధీనం చేసుకుని.. పాలస్తీనియన్లను తరలిస్తానని ఫిబ్రవరిలో ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా, 'ద్వి దేశ పరిష్కారా'న్ని ఎప్పుడూ సమర్థించని ట్రంప్.. భవిష్యత్తులో పాలస్తీనా ఒక దేశంగా ఏర్పడేందుకు ఆలోచన చేయడం కూడా గమనార్హం. ఈ నేపథ్యంలో నెతన్యాహుతో సోమవారం జరగనున్న ట్రంప్ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, గాజాలోని జనావాసాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 44 మంది మరణించారు.

మోదీ విధానాలు భేష్: పుతిన్

మాస్కో, సెప్టెంబరు 27: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో భారత దేశం చెప్పుకోదగిన రీతిలో ఆర్థిక ప్రగతి సాధిస్తోందని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసించారు. ఎలాంటి విదేశీ ఒత్తిళ్లకు లొంగకుండా స్వతంత్ర విధానాలను అవలంబిస్తోందని కొనియాడారు. ఇటీవల మోదీతో ఫోన్‌లో మాట్లాడిన పుతిన్ ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. "ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ సంపూర్ణ స్వతంత్ర, సార్వభౌమ విధానాలను అమలు చేస్తోంది. అన్నింటికన్నా ముఖ్యంగా ఆర్థిక రంగంలో చాలా మంచి ఫలితాలను సాధిస్తోంది. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలు అన్నింటిలోనూ అత్యధిక ఆర్థిక వృద్ధి రేటును నమోదు చేస్తోంది" అని పేర్కొన్నారు.

ఇక 'స్వదేశీ' 4జీ!

» స్వదేశీ టెక్నాలజీతో బీఎస్ఎన్ఎల్ సేవలు

» ఒడిశాలో ప్రారంభించిన ప్రధాని మోదీ

» 37,500 కోట్లతో 97,500 మొబైల్ టవర్లు

ఝార్సుగూడ, సెప్టెంబరు 27: ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ సేవలు దేశ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఒడిశాలోని ఝార్సుగూడలో ఈ సేవలను ప్రారంభించారు. అలాగే రూ.37,500 కోట్ల వ్యయంతో పూర్తి స్వదేశీ సాంకేతికతతో నిర్మించిన 97,500కు పైగా 4జీ మొబైల్ టవర్లను కూడా ఆయన ప్రారంభించారు. దీంతో టెలికాం పరికరాలను సొంతంగా ఉత్పత్తి చేసే చైనా, డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియాల సరసన భారత్ చోటు దక్కించుకుంది. ఈ నెట్‌వర్క్ పూర్తిగా క్లౌడ్ ఆధారితమైనదని, భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేయవచ్చని అధికారులు తెలిపారు. ప్రధాని మోదీ కలలకు ప్రతిరూపమైన డిజిటల్ ఇండియా లక్ష్య సాధనలో ఇదొక మైలురాయిగా పేర్కొన్నారు. దీంతో 26,700కు పైగా గ్రామాల్లో 20 లక్షల మందికిపైగా కొత్త వినియోగదారులకు 4జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. అదేవిధంగా డిజిటల్ భారత్ నిధి ద్వారా 30వేల గ్రామాలను అనుసంధానించే లక్ష్యంతో 100శాతం 4జీ శాచ్యురేషన్ నెట్‌వర్క్‌తో పాటు ఒడిశాలో రూ.60వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. 8ఐఐటీల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.

- రూ.37,500 కోట్ల వ్యయంతో 97,500కు పైగా 4జీ మొబైల్ టవర్లు ఏర్పాటు. వీటిలో చాలవరకూ సౌర శక్తితో పనిచేసేవి కావడంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ టెలికం సైట్‌ల క్లస్టర్‌గా గుర్తింపు. 100శాతం 4జీ శాచ్యురేషన్ నెట్‌వర్క్‌తో దేశవ్యాప్తంగా దాదాపు 30వేల గ్రామాలకు 4జీ సేవలు.
- క్లౌడ్ ఆధారిత నెట్‌వర్క్ కావడంతో భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేసే అవకాశం.

సహకరించిన టెక్ దిగ్గజాలు

- స్వదేశీ 4జీ నెట్‌వర్క్ రూపకల్పనలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు టెక్ దిగ్గజాలైన టీసీఎస్, సీ-డాట్, తేజస్ నెట్‌వర్క్ లిమిటెడ్ కీలక పాత్ర పోషించాయి.
- టీసీఎస్ - డేటా సెంటర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ నిర్వహణ
- తేజస్ నెట్‌వర్క్ - రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ (ఆర్ఏఎన్)



ఒడిశాలో పలు అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని మోదీ

ప్రజలను దోచుకున్న కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా దోచుకుందని మోదీ ఆరోపించారు. అల్పాదాయ వర్గాలను కూడా వదలకుండా వారిపైనా పన్నుల భారం మోపిందని మండిపడ్డారు. ఒడిశాలోని ఝార్సుగూడలో శనివారం నిర్వహించిన 'నమో యువ సమాబేశ్'లో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో ప్రబలంగా ఉన్న దోపిడీ సంస్కృతి నుంచి బీజేపీ రక్షించిందని అన్నారు. ప్రజలను దోచుకోవడానికి ఏ అవకాశాన్ని కూడా కాంగ్రెస్ వదిలిపెట్టలేదని విమర్శించారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా బీజేపీ ప్రభుత్వం ఆదాయాన్ని, పొదుపును రెట్టింపు చేసిందని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం రెండు సెమీ కండక్టర్ యూనిట్లను మంజూరు చేసిందని, ఆర్థిక కారిడార్ కోసం కూడా ప్రణాళికలు ఉన్నాయన్నారు.

సరిహద్దులకు 'అనంత శస్త్ర' శక్తి

» దేశీయ క్షిపణుల కొనుగోలుకు 30 వేల కోట్లతో టెండర్ నోటీసులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: పాకిస్థాన్, చైనా సరిహద్దుల వెంబడి రక్షణ వ్యవస్థను మన సైన్యం మరింత బలోపేతం చేస్తోంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 'అనంత శస్త్ర' క్షిపణి వ్యవస్థతో గగనతల రక్షణ శక్తి సామర్థ్యాలను పటిష్ఠం చేయనుంది. సుమారు రూ. 30 వేల కోట్లతో ఆ క్షిపణి వ్యవస్థ కొనుగోలు చేయడానికి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు టెండర్ నోటీసు జారీ చేసినట్లు ఏఎన్ఐ వార్తా సంస్థ పేర్కొంది. భూ ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే ఈ క్షిపణి వ్యవస్థను డీఆర్‌డీవో తయారు చేసింది. గతంలో ఈ క్షిపణి వ్యవస్థను క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (క్యూఆర్ఎస్ఏఎం) అని పిలిచేవారు. తర్వాత దీనికి అనంత శస్త్రగా నామకరణం చేశారు. 5 నుంచి 6 రెజిమెంట్ల ఈ క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేసి సరిహద్దుల్లో మోహరించనున్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం వీటి సేకరణకు తమ ముందుకు వచ్చిన ప్రతిపాదనను డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ వెంటనే ఆమోదించింది. కదులుతున్నపుడు కూడా శత్రువుల లక్ష్యాలను ఛేదించడం అనంత శస్త్ర ప్రత్యేకత. దీనిని చాలా వేగంగా ప్రయోగించవచ్చు. సుమారు 30 కిలో మీటర్ల పరిధిలోని లక్ష్యాలను ధ్వంసం చేయగలదు. ప్రస్తుతం ఆర్మీ వద్దనున్న ఆకాశ్‌తీర్, మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (ఎంఆర్ఎస్ఏఎం)లకు తోడుగా అనంత శస్త్ర ఆర్మీ అమ్ములపొదిలో ఉంటుంది.

త్వరలో ఏఐతో 40% ఉద్యోగాలు భర్తీ..!

» ఓపెన్ ఏఐ సీఈవో ఆల్ట్‌మన్ వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: ప్రస్తుతం టెక్నాలజీ రంగాన్ని శాసిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) 2030 నాటికి సూపర్ ఇంటెలిజెన్స్ స్థాయికి చేరుకుంటుందని ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. త్వరలోనే ఏఐ 40 శాతం ఉద్యోగాలను భర్తీ చేయగలదని భావిస్తున్నానని చెప్పారు. ఈ ఏడాది యాక్సెల్ స్ప్రింగర్ అవార్డు అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు సైన్స్ ఫిక్షన్‌కే పరిమితమైన ఏఐ టెక్నాలజీ నేడు ప్రతి పనిలోనూ భాగమైందన్నారు. ఏఐ త్వరలోనే మానవ పరిధికి మించిన ఆవిష్కరణలు చేయగలదని చెప్పారు. '2030 నాటికి మనం చేయలేని పనులను చేసే అసాధారణ సాంకేతికత మన వద్ద ఉంటుందని నమ్ముతున్నాను' అని ఆల్ట్‌మన్ వెల్లడించారు. టెక్నాలజీ పరంగా అభివృద్ధి చెందడం శుభపరిణామమే అయినప్పటికీ.. ఇది ఉద్యోగాల తొలగింపునకు దారితీయొచ్చని ఆయన పేర్కొన్నారు. కొన్నిరంగాల్లో పూర్తిగా కొత్త రకం పనులు పుట్టుకొస్తాయని, మరికొన్ని పనులు అదృశ్యమవుతాయని చెప్పారు. ఏది వచ్చినా దాన్ని స్వీకరించి నేర్చుకోవడం ముఖ్యమని అన్నారు.

యాక్సెంచర్‌లో 3 నెలల్లో 11,000 ఉద్యోగాల కోత

» మరిన్ని కోతలున్నాయని ప్రకటించిన సీఈవో



న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: ఐటీ, కన్సల్టింగ్ సేవల దిగ్గజం యాక్సెంచర్ గత మూడు నెలల్లో 11,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఏఐ వినియోగం పెరగడం, కార్పొరేట్ సంస్థల నుంచి సేవల డిమాండ్ తగ్గడం వల్ల మానవ వనరులను తగ్గించుకుంటున్నామని శనివారం యాక్సెంచర్ సీఈవో జూలీ స్వీట్ ప్రకటించారు. భవిష్యత్తులో మరిన్ని తొలగింపులు ఉంటాయని తెలిపారు. తొలగించే ఉద్యోగుల పరిహారం కోసం 865 మిలియన్ డాలర్ల మొత్తాన్ని కేటాయించామని వెల్లడించారు. తమకు అవసరమైన నైపుణ్యాలను వారికి నేర్పించడం గిట్టుబాటు కాని వ్యవహారం అని నిర్ధారణ అయిన చోటే తొలగింపులు చేపడుతున్నామని తెలిపారు. తమ క్లయింట్లకు అవసరమైన ఏఐ ఆధార సేవలు సత్వరమే అందించే విధంగా తమ మానవ వనరులను వేగంగా తీర్చిదిద్దుకుంటున్నట్లు చెప్పారు. మానవ వనరుల పునర్వ్యవస్థీకరణ కారణంగా కంపెనీకి బిలియన్ డాలర్లు ఆదా అవుతాయని అంచనా వేస్తున్నారు. ఉద్యోగులను తొలగించినప్పటికీ యాక్సెంచర్ లాభాలు గత ఏడాదితో పోలిస్తే ఏడు శాతం పెరిగాయి.

విద్యార్థులకు ఫీజుల ఉపశమనం

- 400 కోట్లు విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు
- 2023-24, 2024-25 ఫైనలియర్ విద్యార్థులకు త్వరలో చెల్లింపు

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో ఉన్నత విద్య కోర్సుల ఫైనలియర్ పూర్తిచేసి బయటికొచ్చిన విద్యార్థుల ఫీజు బకాయిల కోసం రూ.400 కోట్లు విడుదల చేస్తూ శనివారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేసింది. 2024-25 విద్యా సంవత్సరం ఫీజులను కాలేజీల ఖాతాల్లో జమ చేస్తారు. 2023-24 విద్యా సంవత్సరం వరకు ఉన్న నిబంధనల ప్రకారం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఫీజులు జమచేయాలి. అయితే ఫీజులు కట్టకపోయినా తాము సర్టిఫికెట్లు ఇచ్చామని, అందువల్ల ఆ ఫీజులు తమకే ఇవ్వాలని కొన్ని కాలేజీలు అడుగుతున్నాయి. దీనిపై ప్రభుత్వం సర్వే చేయించగా.. చాలావరకు కాలేజీలు ఇప్పటికే ఫీజులు వసూలు చేసినట్లు తేలింది. దీంతో ఆ విద్యా సంవత్సరం ఫీజులను తల్లుల ఖాతాల్లోనే జమ చేసే అవకాశం ఉంది.

సిమ్ బ్లాక్ చేసి.. 23 లక్షలు కొట్టేసి..

- కావలి ఎమ్మెల్యేకు సైబర్ నేరగాళ్లు టోకరా
- ఆర్టీఏ బకాయిలంటూ లింక్.. క్లిక్ చేయగానే సిమ్ బ్లాక్

కావలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, ప్రముఖులు సైతం సైబర్ కేటుగాళ్ల మాయలో పడిపోతున్నారు. తాజాగా నెల్లూరు జిల్లా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి రూ.23.69 లక్షలు పోగొట్టుకున్నారు. ఆగస్టు 15న వెంకటక్రిష్ణారెడ్డి పర్సనల్ వాట్సాప్ నంబర్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఆర్టీఏ బకాయిలకు సంబంధించి ఒక లింక్ పంపించారు. కాంట్రాక్టర్, క్వారీల యజమాని అయిన ఎమ్మెల్యేకు పలు రవాణా వాహనాలు ఉండటంతో ఆర్టీఏ బకాయిలు ఏమైనా ఉన్నాయా...? అని ఆ లింక్‌ను క్లిక్ చేశారు. క్షణాల్లోనే ఫోన్ వేడెక్కి సిమ్ బ్లాక్ అయింది. జియో సిమ్ కావడంతో జియో సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. వారు చెప్పినట్టే ఆధార్ నంబర్‌ను లింక్ చేసినా సిమ్ యాక్టివేట్ కాలేదు. హైదరాబాద్‌లోని ఆధార్ విజిలెన్స్ విభాగం దృష్టికి తీసుకెళ్లగా వారు సిమ్‌ను యాక్టివేట్ చేయగా... రెండు బ్యాంకు ఖాతాల్లోని రూ.23.69 లక్షలు వాడేసినట్లు సమాచారం వచ్చింది. సిమ్ బ్లాక్ అయిన తర్వాత సైబర్ నేరగాళ్లు చేసిన పనేనని నాలుగు రోజుల క్రితం కావలి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఎంపై సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు

- అనంతపురం జిల్లాకు చెందిన 'శివ సుప్రీం శివ' అరెస్ట్

గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో మార్ఫింగ్ వీడియోలు, ఫొటోలతో సీఎం చంద్రబాబుపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను శనివారం గుంటూరులోని సీఐడీ రీజినల్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ ఎస్పీ కేవీ శ్రీనివాస్ వివరించారు. అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన గడ్డం శివప్రసాద్ మెడికల్ రిప్రజెంటేటివ్. సుప్రీం శివ అనే ఫేస్‌బుక్ ప్రొఫైల్‌తో సీఎంపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడమే కాకుండా, కులాలను రెచ్చగొట్టేలా తప్పుడు ప్రకటనలు చేస్తున్నాడు. ఆ పోస్టులపై గుంటూరు వికాస్‌నగర్‌కు చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఈనెల 6న మంగళగిరిలోని సీఐడీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం శివప్రసాద్ అనంతపురం జిల్లా ధర్మవరంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. అతన్ని శనివారం గుంటూరులోని సీఐడీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. కాగా, ఇటీవల యూరియాపై సీఎం చంద్రబాబు చేసిన ప్రకటనను కొందరు మార్ఫింగ్ చేసి తప్పుడు వీడియోను సోషల్ మీడియాలో పెట్టి ప్రచారం చేశారని ఎస్పీ చెప్పారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. సమావేశంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ రవికిరణ్, గుంటూరు సీఐడీడీఎస్పీ సునీల్, సీఐ రాంబాబు పాల్గొన్నారు.

జనవరిలో అమరావతికి క్వాంటమ్ కంప్యూటర్

రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీల నిర్మాణం

- సాంకేతిక రంగంలో భారత్ పరుగులు
- దేశ దశ, దిశ మార్చిన బీఎస్ఎన్ఎల్
- సృజనాత్మకతకు మాతృసంస్థగా ఉండాలి
- 4జీ టవర్ల ప్రారంభోత్సవ సభలో సీఎం చంద్రబాబు


స్వదేశీ బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను ప్రారంభించే కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రి సత్యకుమార్, బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్, ఎంపీ కేశినేని చిన్ని, తదితరులు

విజయవాడ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): "క్వాంటమ్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత మొదటి క్వాంటమ్ మిషన్‌ను ప్రధాని మోదీ తీసుకొచ్చారు. వచ్చే ఏడాది జనవరిలో మొదటి క్వాంటమ్ కంప్యూటర్ అమరావతికి వస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. సైబర్ సెక్యూరిటీ, సేఫ్టీకి క్వాంటమ్ కంప్యూటర్ చాలా అవసరమని అన్నారు. బీఎస్ఎన్ఎల్ రజతోత్సవం సందర్భంగా శనివారం విజయవాడలో 4జీ టవర్లను జాతికి అంకితం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 30 ఏళ్లలో చేసే అభివృద్ధిని రాబోయే పదేళ్లలో చేయబోతున్నామని తెలిపారు. 1995లో తాను సీఎం అయినప్పుడు నాలెడ్జ్ ఎకానమీకి ఐటీ వెన్నెముక అని గుర్తించానన్నారు. ఐటీని ప్రోత్సహించడానికి హైటెక్ సిటీ నిర్మించానన్నారు. "ప్రధానిగా వాజ్‌పేయి ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన కమిటీ టెలికంలో నూతన మార్పులకు కారణమైంది. దీనితో బీఎస్ఎన్ఎల్ శక్తిమంతమైన సంస్థగా తయారైంది. ఐటీ అంటేనే ఇండియా. ప్రపంచంలో భారతీయులు శక్తిమంతులుగా తయారు కావడానికి ఐటీ కారణం. కోవిడ్ సమయంలో 100 దేశాలకు భారత్ వ్యాక్సిన్ సరఫరా చేసింది. మన దేశంలో రూపొందించిన యూపీఐ యాప్‌ను ఫ్రాన్స్, సింగపూర్ దేశాలు దత్తత తీసుకున్నాయి. ఒకప్పుడు ఇతర దేశాల ఉత్పత్తులను మనం వాడేవాళ్లం. ఇప్పుడు మన ఉత్పత్తులను ఇతర దేశాలు వాడుకుంటున్నాయి. 1997 మార్చి నాటితో పోలిస్తే రెండు దశాబ్దాల తర్వాత బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య ఒక బిలియన్‌ను దాటింది. హార్డ్‌గా కాకుండా సాఫ్ట్‌గా పనిచేయాలి. ప్రజలు పలు ధ్రువీకరణ పత్రాల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ఇప్పుడు 737 సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇస్తున్నాం. దీనికి కారణం 4జీనే. 4జీ సేవలు 1995 నాటి నాకల. దేశంలో ఏడాదికి 30 కోట్ల ఫోన్లు తయారు చేస్తున్నాం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తయారీ 50 శాతం పెరిగింది. ఒకప్పుడు ఇతర దేశాల్లో తయారైన ఫోన్లను వాడేవాళ్లం. త్వరలోనే దేశం మొత్తం మేక్ ఇన్ ఇండియా ఫోన్లను ఉపయోగించే పరిస్థితులు వస్తాయి. రాష్ట్రంలో 22 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉన్నారు. 14.70 లక్షల మందికి ఫోన్లు ఉన్నాయి. వారిలో 14 లక్షల మందికి స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి" అని చంద్రబాబు అన్నారు.

ప్రతి పదేళ్లకూ టెక్నాలజీ అప్‌గ్రేడ్

"ప్రపంచానికి భారత్ టెక్నాలజీని అందజేసే పరిస్థితి భవిష్యత్తులో వస్తుంది. 4జీ వచ్చిన తర్వాత మిగిలి జీలన్నీ సులువుగా మారాయి. 2010లో 4జీ, 2020లో 5జీ, 2030లో 6జీ.. ఇలా ఏది కావాలన్నా మనవాళ్లు సులువుగా తయారు చేసే పరిస్థితి. 4జీలో మొదట బీఎస్ఎన్ఎల్ విఫలం కావడంతో 10 లక్షల మంది వినియోగదారులను కోల్పోయింది. తర్వాత ఒక లక్ష, ఒక మిలియన్ నుంచి ఇప్పుడు 22 మిలియన్ల వినియోగదారులను బీఎస్ఎన్ఎల్ సంపాదించుకుంది. ప్రతి పదేళ్లకు ఒకసారి టెక్నాలజీ అప్‌గ్రేడ్ అవుతోంది. టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేయడం వల్ల బీఎస్ఎన్ఎల్ మనుగడ సాగిస్తోంది. రిలయన్స్ ఇన్ఫోకం ఆ పని చేయలేకపోవడం వల్ల ఆ సంస్థ మనుగడ సాగించలేకపోయింది. బీఎస్ఎన్ఎల్ దేశానికి దశ, దిశ నిర్దేశించే పరిస్థితికి వచ్చింది. అసలు బీఎస్ఎన్ఎల్ సంస్థ ఉంటుందా అన్న అనుమానం ఒకప్పుడు ఉండేది. ఈ సంస్థ సృజనాత్మకతకు మాతృసంస్థగా తయారు కావాలి. ప్రైవేటు కంపెనీలు ఎప్పుడూ లాభాలు చూసుకుంటాయి. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజలకు సేవ చేస్తాయి. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, వరదలకు సంబంధించిన సమాచారాన్ని సెన్సార్ల ద్వారా తెలుసుకుని ఏఐ ద్వారా ప్రజలకు సమాచారం ఇస్తున్నాం. స్మార్ట్ ఫోన్లలో ఇతర దేశాలు తయారు చేసిన 24 శాతం యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటున్నాం. వాటి ద్వారా 95% ఆదాయాన్ని వారు తీసుకుని, 5% మనకు ఇస్తున్నారు. ఈ యాప్‌లను స్వదేశంలో తయారు చేసుకుంటే 100% డబ్బులు మన వద్దే ఉంటాయి. 2047 నాటికి భారత్ ప్రపంచంలో నంబర్ వన్‌గా ఉంటుంది" అని చంద్రబాబు అన్నారు.

మారుమూలలకూ 4జీ సేవలు: సత్యకుమార్

"మారుమూల ప్రాంతాలకు నిరంతరాయంగా టెలికం సేవలు అందడానికి 4జీ సేవలను తీసుకురావడానికి ప్రధాని మోదీ చేసిన ప్రయత్నం మంచి ఫలితాలను ఇచ్చింది. 2014 నాటికి 27 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 97 కోట్లకు చేరింది. మొబైల్ కనెక్షన్లు 112 కోట్లు ఉండగా, వాటిలో 97 కోట్ల వరకు స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. 2014లో ఒక జీబీ డేటా రూ.325 ఉండేది. ఇప్పుడు దాని ఖరీదు రూ.9.34. ఒక్కో జీబీపై రూ.298.64 తగ్గించారు" అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

ఫోన్ల తయారీలో భారత్ రెండో స్థానం: పెమ్మసాని

"వాజ్‌పేయి ప్రధాని అయ్యే నాటికి బీఎస్ఎన్ఎల్‌కు ఏటా రూ.6 వేల కోట్ల నికరలాభం ఉండేది. 2.50 లక్షల మంది ఉద్యోగులు ఉండేవారు. 2004లో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన 2జీ స్కాంల వల్ల బీఎస్ఎన్ఎల్ సంస్థ కిందికి దిగజారింది. 2014 తర్వాత ప్రణాళికాబద్ధంగా డిజిటల్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాల వల్ల బీఎస్ఎన్ఎల్ రూపురేఖలు మారుతున్నాయి. రూ.25 కోట్ల మందికి ఆనాడు బ్రాండ్‌బ్యాండ్ కనెక్షన్లు ఉండేవి. ఇప్పుడు 100 కోట్ల మంది బ్రాండ్‌బ్యాండ్ ఉపయోగిస్తున్నారు. 2014-15 మధ్య దేశంలో 60 లక్షల ఫోన్లు తయారయ్యేవి. నేడు ఆ సంఖ్య 33 కోట్లకు చేరింది. ఫోన్ల తయారీలో దేశం ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది" అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

4జీ వెలుగు రేఖ: వివేక్‌బాంజల్

"4జీ ప్రజల జీవితాల్లో ఒక వెలుగు రేఖగా ఉంటుంది. స్వదేశీ పరిజ్ఞానంతో ప్రపంచంలో 4జీ టెక్నాలజీని రూపొందించుకున్న దేశాల్లో భారత్‌ది ఐదోస్థానం. 93 వేల టవర్లు దేశంలో ఉన్నాయి. 14 వేల టవర్లు మారుమూల గ్రామాల్లో ఉన్నాయి. రాష్ట్రంలో 6 వేల 4జీ టవర్లు ఉన్నాయి. 1200 టవర్లు 600 మారుమూల గ్రామాల్లో ఉన్నాయి. స్వర్ణాంధ్ర-2047 కలను సాకారం చేయడానికి బీఎస్ఎన్ఎల్ రాష్ట్ర సర్కిల్ సిద్ధంగా ఉంది" అని బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ వివేక్‌బాంజల్ వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, రాజ్యసభ ఎంపీ కనకమేడల రవీంద్ర, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీఎస్ఎన్ఎల్ సీజీఎం శేషాచలం, సీడాట్ సీఈవో ఆర్కే ఉపాధ్యాయ, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

2022 నాటి జిల్లా జడ్జీల సీనియారిటీ జాబితా రద్దు

- హైకోర్టు కీలక తీర్పు
- 4 నెలల్లో కొత్త జాబితా సిద్ధం చేయాలి
- అప్పటివరకు పదోన్నతులు కల్పించవద్దు
- హైకోర్టు రిజిస్ట్రీకి ధర్మాసనం ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా జడ్జీల సీనియారిటీ జాబితా విషయంలో హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పు ఇచ్చింది. వారి సీనియారిటీని నిర్ణయిస్తూ 2022 జనవరి 5న హైకోర్టు రిజిస్ట్రీ జారీ చేసిన ప్రొసీడింగ్స్, వాటిని నోటిఫై చేస్తూ అదే ఏడాది మార్చి 11న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 13ను రద్దు చేసింది. 2015 మార్చి 31న ఇచ్చిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా 10 శాతం బదిలీల కోటా (యాక్సిలరేటెడ్) కింద నియమితులైన పిటిషనర్లు, 65 శాతం పదోన్నతి కోటా ద్వారా నియమితులైన ఇతర న్యాయాధికారుల విషయంలో తాజాగా సీనియారిటీ జాబితాను రూపొందించాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. జాబితా తయారులో ఏపీ స్టేట్ జ్యుడీషియల్ సర్వీస్ రూల్స్-2007లోని 13(ఏ)ని అనుసరించి రోస్టర్ పాయింట్లు, ఉమ్మడి హైకోర్టు 2017 ఫిబ్రవరి 4న రూపొందించిన సీనియారిటీ జాబితాను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. కొత్త సీనియారిటీ జాబితా తయారు చేసేవరకు 2022 జనవరి నాటి జాబితాకు అనుగుణంగా ఎలాంటి పదోన్నతులు కల్పించవద్దని హైకోర్టు రిజిస్ట్రీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గరిష్ఠంగా నాలుగునెలల్లోగా సీనియారిటీ జాబితాను తయారు చేసి, తదనంతరం చట్ట ప్రకారం పదోన్నతులు కల్పించాలని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. 2015లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా 65 శాతం పదోన్నతి కోటా కింద నియమితులైన న్యాయాధికారుల కంటే 10 శాతం యాక్సిలరేటెడ్ కోటా కింద నియమితులైన తమను సీనియారిటీ జాబితాలో జూనియర్లుగా చేర్చడం ఏపీ జ్యుడీషియల్ సర్వీస్ రూల్స్, సుప్రీంకోర్టు తీర్పుకి విరుద్ధమంటూ న్యాయాధికారులు జి.రజని, జి.అన్వర్ బాషా, పి.భాస్కరరావు 2022లో వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ మూడు వ్యాజ్యాలు ఒకే అంశంతో ముడిపడి ఉండటంతో కలిపి విచారించిన ధర్మాసనం ఇటీవల తుది నిర్ణయం వెల్లడించింది. "65 శాతం పదోన్నతి కోటా, 10 శాతం యాక్సిలరేటెడ్ కోటా కింద జిల్లా జడ్జీల నియామకం కోసం ఒకే తేదీన నోటిఫికేషన్ ఇచ్చారు. రెండు కోటాల కింద ఎంపిక ప్రక్రియ పూర్తి అయ్యి 2015 నవంబరు 11న ఫలితాలు ప్రకటించారు. అనంతరం రెండు కోటాలకు సంబంధించి ఎంపిక జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. పోస్టింగ్ ఆర్డర్లు సైతం ఒకే రోజున ఇచ్చారు. అయితే రెండు కోటాలకు సంబంధించి నియామక ఉత్తర్వులు(జీవోలు) రాష్ట్ర ప్రభుత్వం రోజుల తేడాతో (65 శాతం కోటాకు 2016 జనవరి 20న, 10 శాతం కోటాకు 2016 ఫిబ్రవరి 8న)జారీ చేసిందనే కారణంతో 10 శాతం కోటా అభ్యర్థులను జూనియర్లుగా పరిగణించడానికి వీల్లేదు. అలా చేయడం ఏపీ జ్యుడీషియల్ సర్వీసు రూల్స్‌లోని నిబంధన 13(ఏ)కి విరుద్ధం. సీనియారిటీని రోస్టర్ పాయింట్లకు అనుగుణంగా నిర్ణయించాలి తప్ప ప్రభుత్వ ఉత్తర్వుల తేదీ ఆధారంగా కాదు" అని ధర్మాసనం తన తీర్పులో స్పష్టం చేసింది.


మాచర్ల సర్కిల్ కార్యాలయం వద్ద పోలీసు విచారణకు హాజరైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

పోలీసు విచారణకు పిన్నెల్లి సోదరులు


- మాచర్ల సర్కిల్ కార్యాలయానికి హాజరు
- ఉదయం నుంచి రాత్రి వరకు ప్రశ్నించిన అధికారులు
- తెలియదు.. గుర్తులేదు.. అంటూ సమాధానాలు

మాచర్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిపోలీసుల విచారణకు హాజరయ్యారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడులో జరిగిన జవిశెట్టి సోదరుల జంట హత్య కేసులో వీరు ఏ6, ఏ7 నిందితులు. శనివారం మాచర్ల సర్కిల్ కార్యాలయానికి హైకోర్టు న్యాయవాదులు మనోహర్‌రెడ్డి, రామలక్ష్మణారెడ్డిలతో వీరు హాజరయ్యారు. గురజాల డీఎస్పీ జగదీశ్, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా వీరిని విచారించారు. ముందుగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఉదయం 10.45 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సుమారు 170 ప్రశ్నలు సంధించగా.. 'తెలియదు.. గుర్తు లేదు..' అనే సమాధానాలు వచ్చినట్టు సమాచారం. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని సుమారు 180 ప్రశ్నలు అడగ్గా.. ఆయన కూడా 'తెలియదు.. గుర్తులేదు.. నాకు సంబంధం లేదు' అనే సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. వీరు నిందితులతో మాట్లాడినట్లు తెలియజేసే ఫోన్ కాల్స్, సిగ్నల్స్‌ను విచారణాధికారులు ప్రస్తావించగా.. 'ఆ ఫోన్లు మేం వాడలేదు.. ఎవరు వాడారో మాకు తెలియదు' అంటూ సమాధానాలిచ్చారని సమాచారం. విచారణ అనంతరం వీరిద్దరినీ పోలీసులు బయటికి పంపించేశారు. మరోసారి వీరిని విచారణకు పిలిచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ప్రతీకారం తప్పదు: గుడివాడ అమర్నాథ్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ రోజు వైసీపీని పెడుతున్న ప్రతి ఇబ్బందికీ ప్రతీకారం ఉంటుందని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మిథున్ రెడ్డిని శనివారం ములాఖత్ ద్వారా అమర్నాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస్ కలిశారు. అనంతరం అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ సీనియర్ నాయకత్వంపై ఏదో రకంగా బురద జల్లి తప్పుడు కేసులు బనాయిస్తోందన్నారు. ఎంపీ మిథున్ రెడ్డిని ఫ్యాబ్రికేటెడ్ కేసులో అరెస్టు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంపై ఏవైనా విమర్శలు వస్తే డైవర్షన్ చేయడం కోసం ఎవరో ఒకరిపై కేసులు పెడుతున్నారన్నారు. ఇప్పుడు బాలకృష్ణ మాటలనూ డైవర్ట్ చేయడానికి ఏదో ఒక సబ్జెక్టు వెతుక్కుంటారని అనుమానం వ్యక్తం చేశారు.

విద్యుత్ చార్జీల్లో భారీ ఊరట!



తొలిసారి తగ్గనున్న ట్రూఅప్ భారం.. 923 కోట్లు తిరిగి వినియోగదారులకు చెల్లింపు

- 2024-25 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన
- యూనిట్‌కు 13 పైసలు చొప్పున వెనక్కి
- నవంబరు నుంచి వచ్చే ఏడాది అక్టోబరు
- వరకు నెలవారీ బిల్లుల్లో సర్దుబాటు
- విద్యుత్తు కొనుగోళ్ల ఖర్చులు తగ్గిన ఫలితం
- వైసీపీ హయాంలో అడ్డగోలుగా విద్యుత్తు కొనుగోళ్లు
- వాటిని కట్టడి చేసిన కూటమి ప్రభుత్వం
- త్వరలో మరో రూ.1059.75 కోట్లు ట్రూడౌన్

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెరిగాయి అని మాత్రమే వినడానికి అలవాటు పడ్డ వినియోగదారులకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) తీపి కబురు చెప్పింది. వినియోగదారులపై ట్రూఅప్ భారాన్ని తగ్గించాలని నిర్ణయించింది. సుమారు రూ. 923.55 కోట్లను తిరిగి వినియోగదారులకు చెల్లించాలని ఏపీఈఆర్‌సీ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీలు(ఎఫ్‌పీపీసీఏ) పేర్లను మాత్రమే విన్న విద్యుత్తు వినియోగదారులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి ట్రూడౌన్ (చార్జీల తగ్గింపు)ను వింటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కంలు దాఖలు చేసిన రూ. 2,758.76 కోట్ల ట్రూఅప్ మొత్తానికిగాను ఏపీఈఆర్‌సీ రూ. 1,863.64 కోట్లకు ఆమోదం తెలిపింది. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిస్కంలు రూ. 2,787 కోట్లు వసూలు చేయడంతో ఆ మొత్తం నుంచి రూ. 1,863.64 కోట్లను మినహాయించి మిగిలిన రూ. 923.55 కోట్లను విద్యుత్తు వినియోగదారులకు తిరిగి చెల్లించాలని ఏపీఈఆర్‌సీ ఆదేశించింది. దీంతో వినియోగదారులకు భారీ ఊరట లభించనుంది. 2024-25లో విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను ఈ ఏడాది జూన్ 30న విద్యుత్తు పంపిణీ సంస్థలు (డిస్కంలు) ఏపీఈఆర్‌సీకి నివేదించాయి. ఆ నివేదికలను మూడు నెలల్లోపు పరిశీలించి ఈఆర్‌సీ నిర్ణయం తీసుకోవాల్సిన కాలపరిమితి ఉన్న నేపథ్యంలో శనివారం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎలా సర్దుబాటు చేస్తారు

ట్రూడౌన్ చార్జీల రూపంలో మిగిలిన రూ. 923.55 కోట్లను ఈ ఏడాది నవంబరు నుంచి 2026 అక్టోబరు వరకు విద్యుత్తు వినియోగదారుల బిల్లుల్లో సర్దుబాటు చేస్తారు. యూనిట్‌కు 13 పైసలు చొప్పున వినియోగదారులకు లబ్ధి చేకూరనుంది. అయితే ఇది ప్రస్తుత బిల్లులోని యూనిట్లపై కాకుండా 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వినియోగించిన యూనిట్లకు వర్తింప చేస్తారు. ఆ మొత్తాన్ని ప్రస్తుత బిల్లులో సర్దుబాటు చేస్తారు. ఉదాహరణకు 2024 ఏప్రిల్‌లో వినియోగదారుల 100 యూనిట్లు విద్యుత్తు వినియోగిస్తే యూనిట్‌కు 13 పైసలు చొప్పున ఆ 100 యూనిట్లకు రూ. 13లు ఈ ఏడాది నవంబరు బిల్లులో సర్దుబాటు చేస్తారు.

త్వరలో మరో వెయ్యి కోట్లకుపైగా..

రానున్న రెండు మూడు నెలల్లో మరో విడత ట్రూడౌన్ చార్జీలకు ఏపీఈఆర్‌సీ సిద్ధమవుతోంది. 2019-24 మధ్య కాలానికి రూ. 1059.75 కోట్ల ట్రూడౌన్ (చార్జీల తగ్గింపు)ను ఏపీ ట్రాన్స్‌కో ఈ ఏడాది మార్చిలో ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలపై నిర్ణయానికి ఎలాంటి కాలపరిమితి లేదు. అయితే వీటిపై రానున్న ఒకటి రెండు నెలల్లోనే ఏపీఈఆర్‌సీ నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. 2019-24 మధ్య పెట్టుబడి వ్యయం కింద వివిధ అభివృద్ధి పనులకు ఏపీఈఆర్‌సీ అనుమతించిన ఖర్చు.. వాస్తవ ఖర్చు మధ్య వ్యత్యాసాన్ని ట్రూడౌన్ కింద సర్దుబాటు చేసేందుకు ట్రాన్స్‌కో ప్రతిపాదించింది. అప్పట్లో కోవిడ్ తదితర కారణాల వల్ల అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఆ నిధులు అలాగే మిగిలిపోవడంతో వాటిని ట్రూడౌన్ కింద వినియోగదారులకు సర్దుబాటు చేయనున్నారు.

ఏమిటీ ట్రూఅప్


విద్యుత్తు పంపిణీ సంస్థలు(డిస్కంలు) విద్యుత్తు కొనుగోలు, పంపిణీకి సంబంధించి అయ్యే ఖర్చులను లెక్కించి, దాని ఆధారంగా వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిన ధరలను విద్యుత్తు నియంత్రణ మండలి నిర్ణయిస్తుంది. ఏపీఈఆర్‌సీ అనుమతించిన మొత్తం కంటే డిస్కంలకు అయిన వాస్తవ ఖర్చు ఎక్కువగా వస్తే దాన్ని లెక్కించి ట్రూఅప్ చార్జీల రూపంలో వసూలు చేసుకునేందుకు అనుమతిస్తుంది. వైసీపీ హయాంలో అడ్డగోలు ధరలకు విద్యుత్తును కొనుగోళ్లు చేయడంతో ఈ ట్రూఅప్ చార్జీల భారం భారీగా పడింది.

ట్రూడౌన్ అంటే..

అనుమతించిన దానికంటే డిస్కంలకు అయిన వాస్తవ ఖర్చు తక్కువగా ఉంటే మిగులు మొత్తాన్ని వినియోగదారులకు సర్దుబాటు చేయాలని ఏపీఈఆర్‌సీ ఆదేశిస్తుంది. దీన్నే ట్రూడౌన్ అంటారు. విద్యుత్తు కొనుగోళ్ల ధరల విషయంలో కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవడంతో డిస్కంలు తొలిసారి ట్రూడౌన్ చార్జీలను అమలు చేసే పరిస్థితి ఏర్పడింది.

హైకోర్టు ఆదేశాలతో మంగళగిరి రూరల్ సీఐపై కేసు

- హైకోర్టు వ్యాన్ డ్రైవర్‌ను అడ్డుకున్న వివాదంలో ఫిర్యాదు



గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావుపై శనివారం అదే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 25న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసే సభకు పోలీస్ శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా మంగళగిరి డాన్‌బాస్కో స్కూల్ వద్ద ఆ రోజు ఇరువురు కానిస్టేబుళ్లు విధుల్లో ఉండగా హైకోర్టుకు సంబంధించిన ఓమ్నీ వ్యాన్ అక్కడకు వచ్చింది. కానిస్టేబుళ్లు ఆ వ్యాన్‌ను ఆపినప్పుడు డ్రైవర్‌కు, కానిస్టేబుళ్లకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని కానిస్టేబుల్‌కు వ్యాన్‌ను తగిలించడమే కాకుండా ఆయన పట్ల దురుసుగా ప్రవర్తించారని డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన తనపై చేయి చేసుకున్నారని, వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారని డ్రైవర్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. హైకోర్టు ఫైల్స్‌తో వస్తున్న డ్రైవర్‌పై సీఐ చేయి చేసుకోవడం, కారును స్టేషన్‌కు తరలించడాన్ని తీవ్రంగా పరిగణించిన హైకోర్టు ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను పిలిపించి వివరణ తీసుకుంది. డ్రైవర్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి తగుచర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించింది. ఈ నేపథ్యంలో శనివారం సీఐ శ్రీనివాసరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు.


16న కర్నూలుకు ప్రధాని మోదీ..!



- జీఎస్టీ సంస్కరణలపై రోడ్‌షోకు హాజరు
- చంద్రబాబు, పవన్‌తో కలిసి భారీ ర్యాలీ
- శ్రీశైలం మల్లన్నను దర్శించుకోనున్న ప్రధాని
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

కర్నూలు/అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ అక్టోబరు 16న కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు. జీఎస్టీ సంస్కరణలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి కర్నూలు నగరంలో రోడ్‌షో నిర్వహించనున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలూ ర్యాలీలో పాల్గొంటారు. అలాగే, శ్రీశైల మల్లికార్జునస్వామిని మోదీ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ఇప్పటికే పూర్తి చేసిన పలు ప్రగతి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. మోదీ పర్యటనపై సూచనప్రాయంగా సమాచారం తెలిసినా.. అధికారికంగా షెడ్యూలు ఖరారు కావాల్సి ఉంది. మోదీ పర్యటన వివరాలను మంత్రి లోకేశ్ శాసనమండలి లాబీలో మంత్రులు, ఎమ్మెల్సీలతో ప్రస్తావించారు. కర్నూలు జిల్లా కలెక్టరు డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఓర్వకల్లు సమీపంలో ప్రధాని సభ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం పరిశీలించారు. కర్నూలు నగరంలో నిర్వహించే భారీ ర్యాలీ రూట్ మ్యాప్‌పైనా జిల్లా యంత్రాంగంతో చర్చించినట్లు సమాచారం. గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 5,230 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టు (ఐఆర్ఈఎస్‌పీ)ను, ఓర్వకల్లు సమీపంలో 415 ఎకరాల విస్తీర్ణంలో జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమను ప్రధాని ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.

బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతోంది: షర్మిల


బీజేపీ ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాలు సేకస్తున్న షర్మిల

విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతోందని, ఎన్నికల కమిషన్ బీజేపీ తొత్తుగా మారిందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఓటు చోరీ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా శనివారం విజయవాడలోని అజిత్ సింగ్‌నగర్ డాబా కొట్లు వద్ద సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ గెలుపు కష్టమనుకున్న చోట్ల దొంగ ఓట్లు చేర్చి బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తోందని ఆరోపించారు.


పార్టీలో సమస్యల పరిష్కారానికి పనిచేస్తా

- సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తన వయసు 75 ఏళ్లు నిండడంతో పార్టీ జాతీయ కార్యదర్శి పదవి నుంచి తప్పుకొన్నానని సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ తెలిపారు. తెలంగాణ భవన్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇకపై తాను సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా వ్యవహరిస్తానని చెప్పారు. పార్టీలో అంతర్గత సమస్యల పరిష్కరించేందుకు పనిచేస్తానన్నారు.

ఎడ్‌సెట్, పీఈసెట్, పీజీసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎడ్‌సెట్, పీఈసెట్, పీజీసెట్ తుది కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యామండలి షెడ్యూలు విడుదల చేసింది. ఎడ్‌సెట్‌కు ఈ నెల 29 నుంచి అక్టోబరు 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 10న సీట్లు కేటాయిస్తారని తెలిపింది. పీఈసెట్‌కు కూడా అవే తేదీల్లో దరఖాస్తు చేసుకుంటే.. 10న సీట్లు కేటాయిస్తారని, పీజీసెట్‌కు 29 నుంచి అక్టోబరు 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని 8న సీట్లు కేటాయిస్తారని వివరించింది.



మాజీ శాసనసభ్యుల పెన్షన్లు పెంచాలి

30 నుంచి 50 వేలకు!

అసెంబ్లీకి సదుపాయాల కమిటీ సిఫారసు

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసనసభ్యుల పెన్షన్‌ను రూ.30 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని స్పీకర్ ఆధ్వర్యంలోని ఏపీ శాసనవ్యవస్థ సదుపాయాల కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ మేరకు కమిటీ తొలి నివేదికను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం అసెంబ్లీకి సమర్పించారు. శాసనసభ్యులు, మాజీ శాసనసభ్యుల సదుపాయాలపై మూడు సిఫారసులు చేసినట్లు తెలిపారు. సభ్యుల జీతభత్యాలను 2016లో చివరిసారిగా సవరించారని, మారిన పరిస్థితులకు అనుగుణంగా తగిన సమయంలో వాటిని హేతుబద్ధం చేయాలని సిఫారసు చేసింది. సదుపాయాల కమిటీ సిఫారసులను అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సిఫారసులను ప్రభుత్వానికి పంపుతామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

నా వ్యాఖ్యలు అపార్థానికి దారితీశాయి

- అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించండి
- స్పీకర్‌కు కామినేని శ్రీనివాస్ విజ్ఞప్తి
- బాలకృష్ణ వ్యాఖ్యల తొలగింపునకూ నిర్ణయం!



అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తాను శాసనసభలో చేసిన వ్యాఖ్యలు అపార్థానికి దారితీశాయని, అందువల్ల వాటిని రికార్డుల నుంచి తొలగించాలని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శనివారం అసెంబ్లీ స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని స్పీకర్‌కు తెలుపుతామని ఆ సమయంలో సభాస్థానంలో ఉన్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. ఈనెల 25న కామినేని మాట్లాడిన ఒక అంశంపై తీవ్ర వివాదం రేగిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో తనను కలిసేందుకు వచ్చిన సినీ ప్రముఖులను అప్పటి సీఎం జగన్ అవమానించారని, దీనిపై చిరంజీవి గట్టిగా అడిగారని కామినేని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇది కూటమిలో అంతర్గత చర్చకు దారితీయడంతో, తన వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని కామినేని కోరారు. కాగా, కామినేని శ్రీనివాస్ వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించనున్న నేపథ్యంలో.. ఆయన వ్యాఖ్యలకు స్పందిస్తూ ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలనూ రికార్డుల్లో ఉంచాల్సిన అవసరం లేదని, వాటినీ తొలగించాలని నిర్ణయించారు. తన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ఎమ్మెల్యే కామినేని కోరడాన్ని జనసేన పార్టీ తరఫున స్వాగతిస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శనివారం తెలిపారు.

'ఫిష్ ఆంధ్ర' పేరుతో వైసీపీ భారీ దోపిడీ

- రూ.155 కోట్లలో 51.44 కోట్లే ఖర్చు చేశారు: అచ్చెన్న



అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'ఫిష్ ఆంధ్ర' పేరుతో గత వైసీపీ ప్రభుత్వం దోపిడీకి తెగబడిందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' కింద కేంద్రం ఇచ్చిన నిధులను దోచుకోవడానికి జగన్ వేసిన కొత్త ఎత్తుగడే ఈ పథకమని మండిపడ్డారు. శనివారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ఫిష్ ఆంధ్ర కోసం రూ.155.69 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించిన గత ప్రభుత్వం కేవలం రూ.51.44 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. నంద్యాల, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని విజయ డెయిరీల్లో అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

కౌలు రైతులకూ 'అన్నదాత సుఖీభవ'

కౌలు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో కార్డులివ్వకపోవడంతో అన్నదాత సుఖీభవ పథకం మొదట విడత నిధులు అందించలేకపోయామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రెండో విడతలో వారికి కార్డులిచ్చి రూ.320 కోట్లు అందిస్తామని అసెంబ్లీలో మంత్రి ప్రకటించారు. కాగా, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలుతో వైసీపీకి మైండ్ బ్లాంక్ అయిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల వాగ్దానాలను సీఎం చంద్రబాబు తన అనుభవంతో చాకచక్యంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రశంసించారు.

అక్రమ మైనింగ్ సొమ్ము రికవరీ చేస్తాం: మంత్రి కొల్లు



రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమార్కులు కాజేసిన సొమ్మును రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. 'ఓబులాపురం గనుల్లో అక్రమాలపై తాజాగా వచ్చిన కోర్టు తీర్పు స్పష్టతనిచ్చింది. ఓఎంసీలో సీజ్ చేసిన లక్ష టన్నుల ఇనుప ఖనిజం అక్రమంగా తరలించినవారిపై కఠిన చర్యలు ఉంటాయి. మైనింగ్ రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

ఊరికి 20 కి.మీ. దూరంలో లే-అవుట్లు: మంత్రి కొలుసు



పేదల ఇళ్ల నిర్మాణం కోసం గత వైసీపీ ప్రభుత్వం వేసిన లే-అవుట్లు ఊరికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, లోతట్టు ప్రాంతాల్లో ఉండటంతో ఇళ్ల నిర్మాణాలకు అనువుగా లేవని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. వాటిలో ఇళ్లు కట్టుకోవడానికి ఆసక్తి చూపని లబ్ధిదారుల సమ్మతితోనే వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

తిరుపతి మహిళా లెజిస్లేటివ్ సదస్సు సంతృప్తినిచ్చింది: స్పీకర్

తిరుపతిలో ఇటీవల నిర్వహించిన మహిళా పార్లమెంటరీ, లెజిస్లేటివ్ కమిటీల సదస్సుకు విశేష ఆదరణ లభించిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఈ సదస్సు పట్ల అత్యంత సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఇలాంటి సదస్సులు స్థానికంగా కూడా నిర్వహించాలని, దీనిపై మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవ తీసుకోవాలని కోరారు.

పర్యాటక రంగంలో 10,644 కోట్ల పెట్టుబడులు

- 103 సంస్థలతో ఎంవోయూలు: మంత్రి దుర్గేశ్



అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక 15నెలల కాలంలోనే పర్యాటక రంగంలో 103 సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుని మొత్తం రూ.10,644 కోట్ల పెట్టుబడులు సాధించామని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ సహకారంతో వివిధ పథకాల ద్వారా రూ.441 కోట్ల నిధులు రాబట్టామని చెప్పారు. శనివారం అసెంబ్లీలో మంత్రి మాట్లాడారు. పర్యాటక రంగం అభివృద్ధికి అన్ని చర్యలూ తీసుకున్నట్టు తెలిపారు. 2029 నాటికి 50వేల గదుల ఏర్పాటు లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. చీరాల నియోజకవర్గంలో చారిత్రక ప్రదేశాలైన మోటుపల్లి, పురాతన వీరభద్రస్వామి గుడిని ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ప్రణాళికలను వివరించారు. చీరాల సమీపంలో బీచ్ రహదారుల అనుసంధానం, రోడ్లు, పర్యాటకులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి వివరించారు. సీఎం సూచన మేరకు క్యారవాన్ టూరిజాన్ని అందుబాటులోకి తీసువస్తున్నామని తెలిపారు. కేంద్ర సహకారంతో రాజమహేంద్రవరంలో రూ.94.44 కోట్లతో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు, కడప జిల్లాలో రూ.77.91 కోట్లతో గండికోట, రూ.97.52 కోట్లతో సూర్యలంక బీచ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రూ.29 కోట్లతో బొర్రా గుహల్లో ఎక్స్‌పీరియెన్స్ సెంటర్, రూ.50 కోట్లతో అహోబిలం, నాగార్జున సాగర్‌లలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి వివరించారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకునే ముందు ఎమ్మెల్యేలతో ఒక కమిటీని ఏర్పాటుచేసి, గోవా వెళ్లి అధ్యయనం చేసి రావాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. త్వరలోనే ఎమ్మెల్యేలతో కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి దుర్గేశ్ చెప్పారు.

చంద్రయ్య కుమారుడి 'ఉద్యోగ బిల్లు'కు వైసీపీ అడ్డు

మండలిలో విపక్షం తీవ్ర రభస

- డివిజన్ కోరిన వైసీపీ సభ్యులు
- బిల్లు రిజర్వ్.. నిరవధిక వాయిదా

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో.. రాజకీయ ప్రేరేపిత ఘర్షణల్లో మృతి చెందిన తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం కల్పించే సవరణ బిల్లును వైసీపీ అడ్డుకుంది. తొలుత ఏపీ పబ్లిక్ సర్వీసుల నియామకాల క్రమబద్ధీకరణ రెండవ సవరణ బిల్లును మంత్రి పయ్యావుల మండలిలో ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పల్నాడుజిల్లాలో రాజకీయ ప్రేరేపిత ఘర్షణల్లో తోట చంద్రయ్య మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు తోట వీరాంజనేయులును జూనియర్ అసిస్టెంట్‌గా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి బిల్లులో చేసిన సవరణలను ఆమోదించాలి. ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల్లో గతంలో ఇళ్లలోకి వచ్చి చంపేసేవారు. అలా చనిపోయిన బాధితుల కుటుంబాలకు గత ప్రభుత్వాలు ఉద్యోగాలు ఇచ్చిన సంఘటనలు కోకొల్లలు." అని అన్నారు.

ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించినట్టే: బొత్స

చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇచ్చే బిల్లును వైసీపీ తిరస్కరించింది. విపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. "ఈ బిల్లు రాజకీయపరమైంది. మాకు మానవత్వం ఉంది. అయితే రాజకీయ పరమైన అంశానికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా చట్టసవరణ చేస్తే భవిష్యత్తు తరాలకు ఎలాంటి సంకేతం ఇస్తున్నట్టు?. శాశ్వత ఉద్యోగం ఇవ్వడం సరికాదు. ఇలాంటి చర్యల వల్ల రాజకీయ ఘర్షణలను ప్రోత్సహించినట్లు అవుతుంది. ఈ అంశాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలి." అని అన్నారు. ఈ సవరణ బిల్లుపై డివిజన్ కోరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు.. బిల్లును రిజర్వ్‌లో ఉంచి, సభను నిరవధికంగా వాయిదా వేశారు.

ఇస్తే తప్పులేదు: వైసీపీ ఎమ్మెల్సీ

చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇచ్చే సవరణ బిల్లును వైసీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం సమర్థించారు. "చంద్రయ్య మా ప్రాంతవాసి. ప్రభుత్వం నక్సల్స్ బాధితులకు, ఉద్యోగ విధుల్లో ఉండి చనిపోయిన వారికి బెనిఫిట్స్ ఇస్తోంది. చంద్రయ్య కుటుంబానికి న్యాయం చేయడంలో అభ్యంతరం లేదు. పెద్దలు ప్రతిపాదించింది రాజకీయం అనుకోకూడదు. ఇది మంచి ప్రతిపాదన." అని ఏసురత్నం అన్నారు.

చెప్పాం.. చేసి చూపిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. శనివారం అసెంబ్లీలో సూపర్ సిక్స్ మేనిఫెస్టో హామీల అమలుపై ముఖ్యమంత్రి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో చెప్పినవన్నీ నేడు చేసి చూపిస్తున్నామన్నారు. మరే ఇతర రాష్ట్రంలో లేనివిధంగా ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెద్ద ఎత్తున పెన్షన్లు ఇస్తున్నామని చెప్పారు. నెలకు రూ.2,745 కోట్లను ఖర్చు చేస్తున్నామని, మొత్తంగా 63.50 లక్షల మందికి పెన్షన్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పెన్షన్లకు ఏడాదికి రూ.32,143 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, తెలంగాణలో రూ.8,179 కోట్లు, కేరళలో రూ.7,295 కోట్లు పెన్షన్ల కింద ఖర్చు పెడుతున్నాయని.. ఏపీలో ఇచ్చే మొత్తంతో పోలిస్తే పావు వంతు ఇస్తున్నాయని అన్నారు. ప్రతి నెలా ఇచ్చే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు ఎంతో ఆలోచించి పేదల సేవలో అని పేరు పెట్టామని సీఎం తెలిపారు.

ఉద్యోగాల కల్పనకు మొదటి ప్రాధాన్యం

"రాష్ట్రంలోని యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 4,71,574 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం. ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుంది. ఇప్పుడు 204 అన్న క్యాంటీన్లు ఉన్నాయి. త్వరలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా 70 క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నాం" అని చెప్పారు. "యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పించే విధానానికి శ్రీకారం చుట్టాం. 1.63 కోట్ల మంది పేదలకు రూ.25 లక్షల వరకు ఉచితంగా చికిత్సలు అందించేలా పాలసీ రూపొందించాం. వచ్చే జూన్ నాటికి 6.15 లక్షల ఇళ్లను అందుబాటులోకి తెస్తాం. 2029 నాటికి ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.



"టీడీపీ, జనసేన, బీజేపీ కలసి ఎన్నికలకు వెళ్లాయి. ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోంది. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది కాబట్టే 15 నెలల కాలంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టగలిగాం. అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలన ద్వారా రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్నాం. రాష్ట్రాభివృద్ధిలో ఎమ్మెల్యేలు కలిసికట్టుగా పనిచేయాలి. కలసి ఉన్నాం కాబట్టే ఇవన్నీ చేయగలుగుతున్నాం. దీన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి." - చంద్రబాబు

పేదల కోసమే నిత్యం ఆలోచన..

ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి ఆటో, క్యాబ్ డ్రైవర్లు అర్హులు. ఊపిరి ఉన్నంతకాలం పేదల కోసమే పనిచేస్తాను. పేదల కోసమే నిత్యం ఆలోచన చేస్తున్నా. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడం, నంబర్ వన్‌గా చేయడానికి పనిచేస్తున్నాను. అలాగే ఎమ్మెల్యేలూ పనిచేయాలి. మేనిఫెస్టో హామీలు చాలా వరకు అమలు చేశాం. రైల్వే జోన్ ఏర్పాటయ్యేలా చూశాం. ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు ఇస్తున్నాం. ఆర్థిక అసమానతలు తగ్గించడానికి పీ-4 వేదిక కానుంది" అని చంద్రబాబు అన్నారు.

లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం

"డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను బలోపేతం చేశాం. డ్వాక్రా మహిళలు పెద్దఎత్తున డబ్బులు పొదుపు చేస్తున్నారు. చాలా పరిశ్రమలు, చాలా మంది అప్పులు తీసుకుని ఎన్‌పీఏలుగా మారుతున్నారు. కానీ డ్వాక్రా సంఘాలు మాత్రం తీసుకున్న అప్పులను కచ్చితంగా తిరిగి చెల్లిస్తున్నారు. లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. ప్రతి ఎమ్మెల్యే వెయ్యి మంది మహిళలను గుర్తించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలి" అని అన్నారు.

అన్నదాత సుఖీభవ

"రైతు కుటుంబం నుంచి వచ్చాను. రైతులను ఆదుకునే బాధ్యతను తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చాం. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా కింద రూ.7500 ఇస్తే.. కూటమి ప్రభుత్వం రూ.14 వేలు ఇస్తోంది. మూడు విడతల్లో ఈ పథకాన్ని పీఎం కిసాన్‌తో జోడించి ఇస్తున్నాం. ఇప్పటి వరకు 46.86 లక్షల మంది రైతులకు 3,174 కోట్లను అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా అందచేశాం. ఇదే కాకుండా.. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, స్పెషల్ ప్యాకేజీలు ఇస్తున్నాం. 1.34 లక్షల మంది రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌ను సబ్సిడీపై అందిస్తున్నాం" అని అన్నారు.

స్త్రీ శక్తి పథకం

"స్త్రీశక్తి పథకం ద్వారా ఇప్పటి వరకు మహిళలు 8.86 కోట్లసార్లు ఉచిత ప్రయాణాలు చేశారు. స్త్రీశక్తి వల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది. ఉచిత బస్సు స్కీమ్‌కు ఏడాదికి 2,963కోట్లు ప్రభుత్వం భరిస్తోంది. ఇది నాకు చాలా సంతృప్తినిచ్చిన పథకం. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఈ పథకాన్ని సమర్థంతంగా అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న 97 శాతం మందికి స్త్రీశక్తి పథకం గురించి తెలుసు. 85 శాతం మంది స్త్రీ శక్తి పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆడబిడ్డల ఆర్థిక ఎదుగుదలకు ఈ పథకం తోడ్పడింది" అని సీఎం సంతోషం వ్యక్తం చేశారు.

తల్లికి వందనం

"తల్లికి వందనం పథకాన్ని సమర్థంతంగా అమలు చేశాం. ఈ పథకానికి రూ.10,090 కోట్లు ఖర్చు పెట్టాం. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ తల్లికి వందనం అమలు చేశాం. ఇప్పటికీ తల్లికి వందనం ఎవరికైనా అందకుంటే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 2,79,720 మందికి రూ.363.64 కోట్లు అందజేస్తున్నాం. మొత్తంగా తల్లికి వందనం పథకంలో 66,57,508 మంది విద్యార్థులు లబ్ధిదారులుగా ఉన్నారు" అని తెలిపారు.

దీపం 2.0 పథకం

"దీపం 2.0 పథకం అమలు చేశాం. తల్లి వంటింట్లో పడే కష్టాలను చూసి.. మరే మహిళ ఆ కష్టాలు పడకూడదని ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం పెట్టాం. ఇప్పుడు దీపం 2.0 పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇప్పటి వరకు 2.66 కోట్ల ఉచిత సిలిండర్లను మహిళలకు అందచేశాం. ఇందుకోసం రూ.1718 కోట్లను ప్రభుత్వం భరిస్తోంది" అని చంద్రబాబు వివరించారు.

మండలిలో ప్రొటోకాల్ వివాదానికి తెర

- అధికార, విపక్ష సభ్యులకు చైర్మన్ ధన్యవాదాలు
- కాఫీ, టీల విషయంలో తేడా రాకుండా చూస్తామన్న మంత్రి

పొరపాటే.. ఉద్దేశపూర్వకం కాదు: మంత్రి కేశవ్
బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: విపక్ష నేత బొత్స

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలి చైర్మన్‌కు అవమానం జరిగిందన్న వివాదం ఎట్టకేలకు ముగిసింది. తిరుపతిలో మహిళా పార్లమెంటరీ సదస్సుకు, అసెంబ్లీ ప్రాంగణంలో విప్‌ల భవన ప్రారంభోత్సవానికి మండలి చైర్మన్ మోషేన్‌రాజును ఆహ్వానించకుండా అగౌరవపర్చారని శుక్రవారం మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. ఇదే అంశంపై శనివారం వైసీపీ సభ్యులు నల్ల కండువాలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. మండలిలో ఆందోళన దిగారు. చైర్మన్‌కు జరిగిన అవమానానికి ఉభయ సభల నాయకుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో చైర్మన్‌ను అవమానించాలనే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వివరణ ఇచ్చారు. మరోసారి ఇలాంటి పొరపాటు జరక్కుండా చూస్తామని చెప్పడంతో వివాదానికి తెరపడింది. తొలుత సభ ప్రారంభం కాగానే వైసీపీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి మండలి చైర్మన్‌కు జరిగిన అవమానంపై సభానాయకుడు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సభాపతి గౌరవాన్ని, రాజ్యాంగ హక్కుల్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. 'మీ డిమాండ్ చెప్పారు.. ప్రభుత్వం తరుపున మంత్రి చెప్పేది వినండి' అని చైర్మన్ సూచించారు. మంత్రి కేశవ్ మాట్లాడుతూ 'చైర్మన్‌ను పిలవకూడదు.. పేర్లు వేయకూడదన్న ఆలోచనలు ప్రభుత్వానికి లేవు. ఎక్కడ పొరపాటు జరిగిందో చూసి, పూర్తి వివరాలతో మీ దగ్గరకు వస్తాం. భవిష్యత్‌లో ఇలాంటివి జరక్కుండా చూస్తాం. ఈ విషయాన్ని మీకు, మీ ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాం. జీఎస్టీ బిల్లు, నాలా బిల్లు, ఇతర ప్రభుత్వ బిల్లుల్ని ఆమోదించాలని కోరుతున్నా.' అని చెప్పారు. విపక్ష నేత బొత్స మాట్లాడుతూ 'ఇలా రిపీటెడ్‌గా జరుగుతోంది. ఒకటి రెండు సార్లైతే సర్దుకోవచ్చు. జీఎస్టీ బిల్లుకు మేం వ్యతిరేకం కాదు. రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే తప్పు.. బిల్లులకు మేం వ్యతిరేకం కాదు. కానీ దీనికి ఫుల్‌స్టాప్ పడాలి. మాకు చర్చ ముఖ్యం కాదు. ప్రభుత్వం నుంచి సమాధానం కావాలి' అని అన్నారు. మంత్రి కేశవ్ జోక్యం చేసుకుని 'చైర్మన్‌ను పిలవకూడదనే ఆలోచన ప్రభుత్వానికి లేదు. పొరపాటు జరిగిందే తప్పు.. ఉద్దేశపూర్వకంగా జరగలేదు. సభాపతి కుర్చీని గౌరవిస్తాం' అని వివరణ ఇచ్చారు. చైర్మన్ మోషేన్‌రాజు జోక్యం చేసుకుని వ్యవస్థల్ని, సమాజాన్ని గౌరవించాలని హితవు పలికారు. నా వ్యక్తిగత ప్రొటోకాల్ విషయంలో దురదృష్టకరమైన పరిస్థితిని విపక్ష సభ్యులు గుర్తించి, సభలో ప్రస్తావించడం, దీనిపై సానుకూలంగా స్పందించినందుకు ప్రభుత్వానికి, ప్రతిపక్ష సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. దీంతో ఈ వివాదానికి ముగింపు పలికారు.




కాఫీ, టీల్లోనూ వ్యత్యాసం: బొత్స

శాసనమండలిలో సభ్యులకిచ్చే కాఫీ విషయాన్ని విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రస్తావించారు. 'ఒకసారి క్యాంటీన్‌కు వెళ్లండి అధ్యక్షా.. ఎమ్మెల్యేల క్యాంటీన్‌ను, ఎమ్మెల్సీల క్యాంటీన్‌ను పరిశీలించండి. ఎమ్మెల్సీలకిచ్చే కాఫీలోనూ వ్యత్యాసం చూపుతున్నారు' అని చెప్పారు. మంత్రి కేశవ్ జోక్యం చేసుకుని 'సభ దృష్టికి విపక్ష నేత కొన్ని విషయాలు తీసుకొచ్చారు. నాకైతే ఆశ్చర్యంగా ఉంది. ఒకే కాంట్రాక్టర్ అసెంబ్లీకి, మండలికి సరఫరా చేస్తున్నారు. కాఫీ, టీ, టిఫిన్, భోజనం అందిస్తున్నారు. ఇందులో వ్యత్యాసం ఉందని చెప్తుంటే అనుమానం వస్తోంది. అలా ఉంటుందని అనుకోవట్లేదు. ఏం జరుగుతున్నదో ఆరా తీస్తాం. ఉద్దేశపూర్వకంగా జరగదు. తప్పు జరిగితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం' అన్నారు. చైర్మన్ మాట్లాడుతూ 'సభ్యులు ఈ విషయాన్ని ఒకసారి నా దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కాఫీ, టీలు వేర్వేరుగా పెట్టొద్దని సెక్రటరీకి చెప్పా. అక్కడ వేరే కాఫీ, గ్రీన్ టీ పెట్టి, ఇక్కడ పెట్టకపోవడం సరికాదని చెప్పా. పద్ధతి మారట్లేదు' అన్నారు. దీని గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది... ఇకపై అలా జరక్కుండా చూస్తాం అని మంత్రి కేశవ్ చెప్పారు.

సభకు వచ్చేది టీ.. కాఫీ కోసమా!

సమస్యలపై చర్చ చేయరా?: సంధ్యారాణి



కాఫీ, టీ కోసం మండలిలో వైసీపీ సభ్యులు దెబ్బలాడటం దౌర్భాగ్యమని మంత్రి గుమ్మడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 'వైసీపీ హయాంలో నేను ఎమ్మెల్సీగా ఉన్నాను. అప్పుడు అత్యంత అవమానకరంగా నా హ్యాండ్ బ్యాగ్‌ను చింపి మరీ తనిఖీలు చేసేవారు. ఓ మహిళా సభ్యురాలి హ్యాండ్ బ్యాగ్‌ను తనిఖీ చేయడం ప్రొటోకాల్ అవుతుందా? అలాంటి దుర్మార్గాలకు పాల్పడిన వైసీపీ ఇప్పుడు కాఫీ, టీ కోసం గొడవ పడుతూ విలువైన ప్రజాసమయాన్ని దుర్వినియోగం చేస్తున్నారు' అని అన్నారు.

ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

- 8 రోజులపాటు సభ.. 23 బిల్లులకు ఆమోదం
- ప్రజాసమస్యలపై అధికార పక్షమే విపక్షమై గళం

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు వాడివేడిగా జరిగాయి. విపక్ష వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరుకాకున్నా స్వపక్షమే విపక్షం అవతారమెత్తి సమస్యలపై గళం వినిపించింది. సమావేశాలు ఈనెల 18న ప్రారంభమై 27తో ముగిశాయి. టీడీపీ, బీజేపీ, జనసేన సభ్యులు సభలో వివిధ ప్రజాసమస్యలు లేవనెత్తారు. టిడ్కో ఇళ్లు, పేదలకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్యశ్రీ, కాలుష్య నియంత్రణ, రోడ్లు, వంతెనల దుస్థితి.. తదితర సమస్యలను ప్రస్తావించారు. అయితే కొందరు ఎమ్మెల్యేలు తమ వ్యక్తిగత అజెండా కోసం అసెంబ్లీని వేదికగా చేసుకోవడం.. దీనిపై సీఎం చంద్రబాబు సీరియస్ కావడం.. చర్చనీయాంశమైంది. టీడీపీ ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, కూన రవికుమార్, బొండా ఉమ వంటి వారు ప్రస్తావించిన అంశాలను సీఎం సీరియస్‌గా తీసుకున్నారు. ఇవన్నీ ప్రజలకు లబ్ధి చేకూర్చేకన్నా.. సభ్యుల వ్యక్తిగత అజెండాలకు ప్రాధాన్యమిచ్చేలా ఉన్నాయన్నారు. తొలిరోజు జీఎస్టీపై పవర్ పాయింట్ ప్రజంటేషన్(పీపీటీ) ఇచ్చిన సీఎం చంద్రబాబు సమావేశాలు జరిగిన ప్రతిరోజూ స్వల్పకాలిక చర్చపై ప్రజంటేషన్ ఇస్తూ వచ్చారు. రెండో రోజు నీటిపారుదల రంగంపై, మూడో రోజు వ్యవసాయంపై, నాలుగో రోజు ఆరోగ్య రంగంపై పీపీటీ ద్వారా సభ్యులకు సమాధానమిచ్చారు. ఆరో రోజు పెట్టుబడులు, లాజిస్టిక్స్‌పై, ఏడో రోజు సూపర్ సిక్స్‌పై పీపీటీ ఇచ్చారు. ఈ సమావేశాలు 8 రోజులపాటు జరిగ్గా 23 బిల్లులు ఆమోదం పొందాయి. మూడు బిల్లులు ఉపసంహరించుకోగా, 6 అంశాలపై లఘు చర్చ జరిగింది.

మండలిలో గరం.. గరం

శాసనమండలిలో వైసీపీ ఆధిపత్యం ఉండటంతో సమావేశాలు గరం.. గరంగా సాగాయి. సమావేశాల చివరి రోజైన శనివారం వైసీపీ ఎమ్మెల్సీలు కాఫీ బాగోలేదంటూ లేవనెత్తిన వివాదం ప్రజా సమస్యలపై ఆ పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని చాటింది. ప్రజాసమస్యలను గాలికొదిలేసి కాఫీ.. టీపై గొడవ ఏమిటంటూ అధికారపక్ష సభ్యులు ధ్వజమెత్తారు. కాగా, మండలి సమావేశాలు 8 రోజులు జరిగాయి. మొత్తం 22 బిల్లులు ఆమోదం పొందగా, 3 బిల్లులను వెనక్కి తీసుకున్నారు. 4 తీర్మానాలను ఆమోదించారు.

స్పీకర్ చాంబర్‌కు సీఎం

అసెంబ్లీ సమావేశాల తీరుపై చర్చ

అమరాతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశా లు శనివారం నిరవధిక వాయిదా పడిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు స్పీకర్ చాంబర్‌కు వెళ్లారు. అసెంబ్లీ సమావేశాలు జరిగిన తీరుపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో సభ్యుల సదుపాయాలపై కమిటీ చేసిన సూచనలను స్పీకర్ సీఎంకు వివరించారు. అనంతరం అసెంబ్లీలో శాసనసభ్యుల గ్రూప్ ఫొటోను ఆయనకు అందజేశారు.



ప్రజాసమస్యల పరిష్కారంలో జాయింట్ కమిటీలదే కీలకపాత్ర: అయ్యన్న

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనను సమీక్షించి ప్రజలకు న్యాయం జరిగేలా చేయడంలో అసెంబ్లీ జాయింట్ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో శనివారం స్పీకర్, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ఆధ్వర్యంలో 8 జాయింట్ కమిటీలు తొలిసారి సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ఈ కమిటీలు ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. సభ్యులు జిల్లాల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, పరిష్కార మార్గాలను సూచించాలని కోరారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల్లోనూ పర్యటించాలని కోరారు. సభా సమావేశాలు ఏడాది పొడవునా జరపటం సాధ్యం కాని పనికావడంతో, ఈ కమిటీలు సభ పని భారాన్ని పంచుకుంటాయని, ఏడాది పొడవునా పనిచేస్తాయని అన్నారు. 'మహిళలు, పిల్లలు, వృద్ధులు, వికలాంగులు వంటి వర్గాల సంక్షేమానికి మనం తీసుకునే చర్యలు నైతిక బాధ్యత మాత్రమే కాదు.. రాజ్యాంగబద్ధమైన విధి' అని స్పీకర్ పేర్కొన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.